FOR ADS.......
ఆకాంక్ష
CONTACT :
8333818121

తొలి ఆకాంక్ష
TGTEL/25/A1964
తెలుగు సంచలన దిన పత్రిక

విలేకరులు కావలెను
ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో
భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..
సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
తొలి ఆకాంక్ష

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :121 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజిలు : 08, వెల. 5రూ/ ఆదివారం- 21 -డిసెంబర్ - 2025

## హైదరాబాద్, వరంగల్ నగరాల్లో డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఆరుగురు అరెస్టు




కొత్త సంవత్సరం వస్తున్న నేపథ్యంలో తనిఖీలు చేపట్టిన పోలీసులు
330 గ్రాముల గంజాయి, 3 గ్రాముల కొకైన్, 11.5 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం
వరంగల్, మియాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆరుగురి అరెస్టు

## కేసీఆర్ ప్రజల్లోకి వస్తున్నారు




- రేవంత్ రెడ్డి హనీమూన్ ముగిసింది
- కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్య
- కేసీఆర్ బహిరంగ సమావేశాలపై రేపు నిర్ణయిస్తామని వెల్లడి
- రేవంత్ రెడ్డిని మాత్రం తాను ఫుట్‌బాల్ ఆడుకుంటానని వ్యాఖ్య
- తాను ఫెయిల్యూర్ లీడర్‌ను కాదన్న కేటీఆర్
- రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్‌గా ఉన్న సమయంలో 7 ఉప ఎన్నికల్లో ఓడిపోయారని వ్యాఖ్య

### ఎమ్మెల్యేలపై తెలంగాణ ముఖ్యమంత్రి

# రేవంత్ రెడ్డి ఆగ్రహం!

- పంచాయతీ ఎన్నికల ఎఫెక్ట్
- 16 మంది ఎమ్మెల్యేలపై రేవంత్ రెడ్డి అసహనం!
- రెబల్స్‌తో సమన్వయం చేయలేకపోయారంటూ ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి ఆగ్రహం
- బంధువులను అభ్యర్థులుగా నిలబెట్టడంపై అసహనం
- ఇప్పటికైనా తీరు మార్చుకుని పార్టీ నిబంధనలకు లోబడి పని చేయాలన్న అధిష్ఠానం
- పంచాయతీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం టెలికాన్ఫరెన్స్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ సమావేశానికి హాజరు



పంచాయతీ ఎన్నికల్లో సరిగ్గా పని చేయలేదంటూ 16 మంది ఎమ్మెల్యేలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం టెలికాన్ఫరెన్స్ నిర్వహించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ తదితరులు సమావేశానికి హాజరయ్యారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలపై చర్చించారు. ఈ సందర్భంగా, పలు ప్రాంతాల్లో రెబల్స్‌ను సమన్వయం చేయలేకపోయారంటూ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ - మిగతా 2 లో

## మీ సేవ అభినందనీయం




ప్రభుత్వ టీచర్‌పై మంత్రి లోకేశ్ ప్రశంసలు
ప్రభుత్వ టీచర్ మోటూరి మంగారాణిని ప్రశంసించిన మంత్రి లోకేశ్
యూట్యూబ్ ఛానల్ ద్వారా వినూత్నంగా విద్యాబోధన
ప్రమాదానికి గురైన విద్యార్థికి అండగా నిలిచిన సేవా స్ఫూర్తి
మంగారాణి వంటి వారితోనే ఏపీ మోడల్ విద్య సాధ్యమన్న లోకేశ్

### స్వర్ణాంధ్ర

# 'స్వచ్ఛాంధ్ర'

- జనవరి 26 నాటికి ఏ రోడ్డుపైనా చెత్త కనిపించకూడదు సీఎం చంద్రబాబు
- అర్బన్ ప్రాంతాల్లో డోర్ టూ డోర్ చెత్త సేకరిస్తామన్న సీఎం చంద్రబాబు
- జనవరి 26 నాటికి ఏ రోడ్డుపైనా చెత్త కనిపించకూడదన్న సీఎం
- అనకాపల్లి జిల్లాలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో చంద్రబాబు
- ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా అది తాత్కాలికమే అవుతుంది - అందులో ప్రజలు భాగస్వాములైతేనే అది శాశ్వతమవుతుంది
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది కాలంలోనే అనేక మార్పులు తీసుకొచ్చినట్లు తెలిపారు
- అందరి ఆరోగ్యం కోసం చేపట్టే కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలి




ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా అది తాత్కాలికమే అవుతుందని, అందులో ప్రజలు భాగస్వాములైతేనే అది శాశ్వతమవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. అనకాపల్లి జిల్లా పర్యటనలో ఉన్న ఆయన తాళ్లపాలెంలో నిర్వహించిన 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వచ్ఛ భారత్‌పై నివేదిక ఇవ్వాలని గతంలో ప్రధాని కోరారని, ఆయన కోరిక మేరకు నివేదిక ఇచ్చినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది కాలంలోనే అనేక మార్పులు తీసుకొచ్చినట్లు తెలిపారు."అందరి ఆరోగ్యం కోసం చేపట్టే కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలి. యూజ్ రికవరీ, రీయూజ్ విధానంతో - మిగతా 2 లో

## పవనన్న చేసిన భగీరథ ప్రయత్నం ఫలించింది




- రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్
- 'అమరజీవి జలధార' పథకానికి శంకుస్థాపన చేసిన పవన్ కల్యాణ్
- ఉభయ గోదావరి జిల్లాలకు సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం
- పవన్ కల్యాణ్‌కు మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక అభినందనలు
- లోకేశ్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం మరో కీలక హామీని నెరవేర్చే దిశగా ముందడుగు వేసింది. ఉభయ గోదావరి జిల్లాల్లోని ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా సురక్షితమైన తాగునీటిని అందించే లక్ష్యంతో ఉప ముఖ్యమంత్రి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి పవన్ కల్యాణ్ 'అమరజీవి జలధార' పథకానికి శంకుస్థాపన చేశారు. ఈ పథకం ద్వారా ప్రజల దాహార్తి తీర్చడానికి కృషి చేయనున్నారు. ఈ కార్యక్రమంపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ - మిగతా 2 లో

## బెంగాల్ ర్యాలీలో వర్చువల్‌గా మాట్లాడిన మోదీ

- మమతా బెనర్జీ ప్రభుత్వంపై విమర్శలు
- బెంగాల్ ప్రభుత్వం చొరబాటుదారులను కాపాడుతోందని ఆరోపణ
- అందుకే రాష్ట్రంలో ఓటరు జాబితా సవరణను వ్యతిరేకిస్తోందని విమర్శ
- మమత పాలనలో బెంగాల్లో అవినీతి, బంధుప్రీతి రాజ్యమేలుతున్నాయని వ్యాఖ్య
- బీహార్ ఎన్నికల ఫలితం బెంగాల్ ఎన్నికల్లో తమ విజయానికి మార్గం సుగమం చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం



పశ్చిమ బెంగాల్‌లోని నాడియాలో జరిగిన ర్యాలీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ సందర్భంగా మమతా బెనర్జీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పొగమంచు కారణంగా ర్యాలీ ప్రాంతానికి చేరుకోలేకపోయిన ఆయన, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజలనుద్దేశించి మాట్లాడారు. అధికార టీఎంసీ ప్రభుత్వం బెంగాల్‌లో చొరబాటుదారులను ప్రోత్సహిస్తోందని ఆయన ఆరోపించారు. అందుకే రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తోందని అన్నారు.మమతా బెనర్జీ పాలనలో బెంగాల్లో అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలు రాజ్యమేలుతున్నాయని మోదీ దుయ్యబట్టారు. ఇటువంటి మహా జంగిల్ రాజ్‌కు తగిన బుద్ధి చెప్పాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు.తృణమూల్ నేతలు, ఆ పార్టీ బీజేపీని ఎంత వ్యతిరేకించినప్పటికీ బెంగాల్ అభివృద్ధిని మాత్రం - మిగతా 2 లో

## సిరియాలో అమెరికా వైమానిక దాడులు




ఐసిస్ కేంద్రాలే టార్గెట్
70కి పైగా దాడులతో ఉగ్రవాద శిబిరాల్లో బీభత్సం సృష్టించిన ఎయిర్ ఫోర్స్
అమెరికా ఆపరేషన్ 'హాక్‌ఐ'.. భారీ సంఖ్యలో ఉగ్రవాదులు హతం!
అమెరికన్లపై ఐసిస్ జరిపిన దాడులకు జవాబిచ్చాం.. పెంటగాన్ వ్యాఖ్య

## ఉపాధి హామీ పథకంపై కేంద్రం బుల్డోజర్



- సోనియా గాంధీ తీవ్ర విమర్శలు
- గ్రామీణ పేదల హక్కులను కాలరాస్తున్నారన్న సోనియా
- మహాత్మా గాంధీ పేరును కూడా తొలగించారని ఆరోపణ
- ఈ నల్ల చట్టంపై పోరాటానికి సిద్ధమన్న సోనియా


కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంపై కేంద్ర ప్రభుత్వం పద్ధతి ప్రకారం బుల్డోజర్ నడుపుతోందని ఆమె శనివారం ఆరోపించారు. ఇది గ్రామీణ పేదలు, రైతులు, వ్యవసాయ - మిగతా 2 లో

# బీమా భయాలు




భారత బీమా మార్కెట్ మీద పట్టుసాధించాలని విదేశీకంపెనీలు ఉత్సాహపడటమే కాదు, నానాటికీ ఒత్తిడి పెంచుతున్న నేపథ్యంలో, వాటి పూర్తిస్థాయి ప్రవేశానికి ప్రభుత్వం తలుపులు బార్లా తెరిచింది. అందరికీ బీమాఅందరికీ రక్షణ అని అందరికీ నచ్చే, నమ్మకాన్ని ఇచ్చే ఓ చక్కని పేరు బిల్లుకు పెట్టి, 1938నాటి బీమా చట్టం మొదలు నిన్నమొన్నటి వరకూ ఉన్న పలుచట్టాలను ఇందుకోసం ప్రభుత్వం సవరించింది. నూరుశాతం విదేశీప్రత్యక్ష పెట్టుబడికి ఇలా తలుపులు పూర్తిగా తెరవడం ద్వారా ఈ దేశంలోని ప్రతీ పౌరుడికీ 2047నాటికి కచ్చితంగా బీమా కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యం సులువుగా నెరవేరుతుందట.విదేశీ ప్రత్యక్షపెట్టుబడులకు ద్వారాలు కొద్దికొద్దిగా తెరుస్తున్నప్పుడల్లా ప్రభుత్వం కొన్ని అంశాలను బలంగా ముందుకు తెస్తుంది. జీవితబీమా, ఆరోగ్యబీమాల విస్తృతి మనదేశంలో బహుస్వల్పమని, పాతికేళ్లక్రితం వరకూ ఈ రంగం పూర్తిగా ప్రభుత్వ గుత్తాధిపత్యంలో ఉండిపోవడం వల్ల అది ఎదగాల్సినంత ఎత్తుకు ఎదగలేదన్నది వాదన. బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డిఎ) ఏర్పాటుద్వారా ఈ రంగాన్ని ప్రైవేటుకు తెరిచేవరకూ అది బలపడలేదని, ఆ తరువాత కూడా ప్రభుత్వపరంగా ఎన్ని ప్రయత్నాలు జరిగినా ప్రజల్లోకి దూకుడుగా విస్తరించలేకపోయిందని అంటారు. ఈ పేరిట, వాజపేయి హయాంలో చిన్నగా మొదలైన ఎఫ్‌డిఐ ప్రవేశాన్ని ఆ తరువాత మరో నాలుగేళ్ళకు కాంగ్రెస్ హయాంలో మరింత హెచ్చించేందుకు ఓ బలమైన ప్రయత్నం జరిగింది కానీ, యూపీఏకు వెన్నుదన్నుగా ఉన్న వామపక్షాలతో పాటు, బీజేపీ కూడా 49శాతం చేయడానికి ఒప్పుకోక ఆగిపోయింది. మంచి సంఖ్యాబలంతో అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ ప్రభుత్వం వచ్చీరావడంతోనే ఎఫ్‌డిఐని 49శాతం చేసి, ఆ తరువాత డెబ్బయ్‌నాలుగుశాతానికీ, ఇప్పుడు ఏకంగా నూరుశాతానికీ అనుమతించడంతో పాతికేళ్ళ తర్జనభర్జనలకు పూర్తిగా తెరపడినట్టే. ఇప్పటివరకూ జీడీపీలో రమారమి మూడుశాతం వాటాకు పరిమితమైపోయిన బీమా రంగం ఇకపై అద్భుతమైన వేగంతో ఎదుగుతుందనీ, విదేశాల్లో మాదిరిగా ఆరున్నరశాతానికి తాకుతుందని పాలకుల ఆశ. ఎఫ్‌డిఐలతో బలోపేతమైన ప్రైవేటుసంస్థలు రాబోయే రోజుల్లో పెట్టుబడులతో, సరసమైన ఉత్పత్తులతో బీమాను ద్విగుళం బహుళం చేస్తాయని, పెరిగిన పోటీతో ఉద్యోగ ఉపాధి అవకాశాలూ విస్తరిస్తాయని ప్రభుత్వం అంచనాలు కడుతోంది.సహజంగానే భయాలూ, భిన్న వాదనలూ కూడా ఉంటాయి. స్థానిక కంపెనీల్లో భాగస్వాములుగా ఉన్న విదేశీసంస్థలు తామే పూర్తిగా టేకోవర్ చేసే పరిస్థితుల్లో నియంత్రణ ఎలా అన్న ప్రశ్న ఉండనే ఉంది. బీమా కంపెనీతో బీమాయేతర కంపెనీ విలీనాన్ని అనుమతించడంపైనా ప్రశ్నలు ఉన్నాయి. చైర్మన్, ఎండి, సీఈవోలలో కనీసం ఒక్కరు భారతీయ పౌరుడు కావాలన్న నిబంధన బాగున్నప్పటికీ, కంపెనీ కష్టాల్లోకి జారుకున్నాక వీరు చేసేదీ, ప్రభుత్వం చేయగలిగేదీ ఏమిటని కొందరి ప్రశ్న. విదేశీవాటా పరిమితంగా ఉన్నప్పుడు ప్రభుత్వాలు ఎన్ని హామీలైన ఇవ్వవచ్చు. కానీ, వందశాతం చేరికతో ఇక్కడి జనం సొమ్ము ఇక్కడ ఖర్చుకాకుండా విదేశాలకు తరలిపోతుందనో, దేశీయపొదుపు అన్యుల చేతుల్లో పడి ఆవిరైపోతుందనో భయాలు కలగడం సహజం. ఐఆర్‌డిఎకు మరిన్ని అధికారాలు కట్టబెట్టి, వినియోగదారుడు కేంద్రంగా కొత్తమార్పులు చేశామని ప్రభుత్వం చెబుతోంది కనుక, ఆయా కంపెనీల నిర్వహణ, వాటిపై నియంత్రణ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని నమ్మాలి. విదేశీ కంపెనీలు ఆర్జించిన లాభాలు సరిహద్దులు దాటిపోకుండా తిరిగి ఇక్కడే పెట్టుబడులవుతాయని ఆశించాలి.నూరుశాతం ఎఫ్‌డిఐతో విదేశీ కంపెనీలు తక్కువ మూలధనంతో ఇకపై ఇక్కడ వ్యాపారాలు మొదలుపెట్టుకోవచ్చు, ప్రైవేటు రంగంలో విదేశీ కంపెనీలదే ఇష్టారాజ్యం కావచ్చు. భారతదేశ బీమారంగంలో అన్నీ విదేశీ కంపెనీలే ఉన్నా ఆశ్చర్యపడనక్కరలేదు. ఇప్పటివరకూ 65శాతం వాటాతో అతిబలంగా ఉన్న ప్రభుత్వరంగ ఎల్‌ఐసికి ఇది పెద్ద పరీక్ష. అమెరికా మీద ఆగ్రహం కలిగినా, చైనామీద చిరాకు వచ్చినా మన నాయకులకు తక్షణమే గుర్తుకు వచ్చే స్వదేశీ నినాదం ఇలా విదేశీపెట్టుబడులకు తలుపులు తెరుస్తున్నప్పుడు గుర్తుకురాకపోవడం ఆశ్చర్యం. స్వదేశీ ముద్దు, విదేశీ వద్దు అంటున్నవారే ఈ దేశ ప్రజలను తమ జీవితాలను, ప్రాణాలను, భద్రతను విదేశీ సంస్థల చేతుల్లో పెట్టి భద్రంగా ఉండమని భరోసా ఇస్తున్నారు.

## జనవరి 26 నాటికి ఏ రోడ్డుపైనా చెత్త కనిపించకూడదు




**మొదటిపేజీ తరువాయి** – ముందుకెళ్లాలి. వాడిన ప్లాస్టిక్ ఇస్తే డబ్బు ఇచ్చేలా చూస్తున్నాం. వ్యర్థాలను వనరుగా, ఆస్తిగా మారుస్తున్నాం. ఉత్తమ పారిశుద్ధ్య కార్మికులకు అవార్డులు ఇస్తున్నాం. వచ్చే ఏడాది జూన్ నాటికి ఏపీని ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా మారుస్తాం. ఇప్పటికే సచివాలయంలో ప్లాస్టిక్ వాడకుండా చర్యలు చేపట్టాం. గత ప్రభుత్వం వదిలిన 86 లక్షల టన్నుల చెత్తను తొలగించాం. రీసైక్లింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నాం. జనవరి 26 నాటికి ఏ రోడ్డుపైనా చెత్త కనిపించకూడదు. ప్రస్తుతం 26 ప్రాంతాల్లో స్వచ్ఛ రథాలు ఉన్నాయి. అవసరమైతే 100 రథాలు ఏర్పాటు చేసి పొడిచెత్త సేకరిస్తాం.మీరు ఇచ్చిన పొడిచెత్తకు డబ్బు కూడా ఇస్తాం. ఇంట్లో చెత్త ఊడ్చి రోడ్డుపై వేయడం మానుకోవాలి. అందరిలో సామాజిక స్పృహ రావాలి. రోడ్లు కూడా మనవే. అర్బన్ ప్రాంతాల్లో డోర్ టూ డోర్ చెత్త సేకరిస్తారు. ఇంట్లో చెత్తను మీరే కంపోస్ట్‌గా తయారు చేసుకోవచ్చు. పట్టణాల్లో 5 లక్షల ఇళ్లలో, గ్రామాల్లో 10 లక్షల ఇళ్లలో కంపోస్ట్ తయారు చేయాలనేది లక్ష్యం. వీలున్న ప్రతి ఒక్కరూ కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసుకోవాలి. ఇంటిచుట్టూ స్థలం ఖాళీగా ఉన్నా ఎక్కడికో వెళ్లి కూరగాయలు కొంటున్నారు. కూరగాయలు ఇంట్లోనే పండించుకుంటే అందరికీ ఆరోగ్యం, డబ్బు ఆదా అవుతుంది. ఉత్తరాంధ్రలో సేకరించిన చెత్త నుంచి కరెంట్ ఉత్పత్తి చేస్తున్నారు. చెత్త నుంచి కరెంట్ ఉత్పత్తి చేసే మరో 6 ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. మార్చి నాటికి గోబర్ యూనిట్లు పూర్తి చేస్తాం" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. "అక్టోబరు 2 తర్వాత రాష్ట్రంలో ఎక్కడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కనిపించకూడదు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల పునర్వినియోగం దిశగా చర్యలు చేపట్టాం. గ్రామాల్లో కూడా ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండాల్సిందే. ఏం పని చేశామో మాకు మేమే బేరీజు వేసుకుంటున్నాం. కలెక్టర్లు, ఎస్పీల పనితీరునూ బేరీజు వేస్తున్నాం. రాష్ట్రాన్ని బాగు చేసుకోవాల్సిన బాధ్యత మనదే. మేం వచ్చాక అనకాపల్లి జిల్లాను శరవేగంగా అభివృద్ధి చేస్తున్నాం. జిల్లాకు 46 పరిశ్రమలు వస్తున్నాయి. రాంబిల్లి, పూడి, నక్కపల్లి, మాకవరపాలెంలో పరిశ్రమలు వస్తున్నాయి. కోడూరు, పరవాడ, అచ్యుతాపురంలో పరిశ్రమలు వస్తున్నాయి. అరకు కాఫీకి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చాం" అని చంద్రబాబు తెలిపారు."కిలో అరకు కాఫీ రూ.10 వేల ధర పలికింది. ఆన్‌లైన్‌లో పెట్టిన అరకు కాఫీని రెండు గంటల్లోనే కొనేశారు. ఇప్పుడు ప్రజలంతా పంచదార మానేసి, బెల్లం వాడుతున్నారు. ప్రతిచోటా బెల్లం, దాని ఉత్పత్తుల వినియోగం బాగా పెరిగింది. అనకాపల్లి జిల్లా రైతులు ఆర్గానిక్ బెల్లం తయారు చేయాలి. ఆర్గానిక్ బెల్లాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేయవచ్చు. ఇప్పుడు ప్రపంచమంతా విశాఖ వైపు చూస్తోంది. విశాఖకు డేటా సెంటర్లు, నాలెడ్జ్ సెంటర్లు వస్తున్నాయి. అలాగే స్టీల్ సిటీ, అల్యూమినియం సిటీ వస్తున్నాయి. ఇవన్నీ వస్తే ఉమ్మడి విశాఖ జిల్లా రూపురేఖలు మారతాయి.మన అభివృద్ధి యజ్ఞాన్ని భగ్నం చేసేందుకు రాక్షసులు వస్తున్నారు. టీచర్లు, కానిస్టేబుల్ ఉద్యోగాలపైనా కోర్టులకు వెళ్తున్నారు. ఎందరు అడ్డుకున్నా రాష్ట్ర ప్రగతి ఆగదు. విశాఖలో యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నాం. యోగా డే కార్యక్రమాన్ని ప్రధాని మోదీ కూడా మెచ్చుకున్నారు. విశాఖను ఏఐ, డేటా, యోగా సెంటర్‌గా మారుస్తున్నాం. గత ప్రభుత్వం సర్వే రాళ్లపై రూ.700 కోట్లు ఖర్చు చేసింది. గంజాయి పంటలను కాఫీ తోటలుగా మార్చిన ఘనత మా ప్రభుత్వానిదని" చంద్రబాబు వెల్లడించారు.

## సిరియాలో అమెరికా వైమానిక దాడులు



**మొదటిపేజీ తరువాయి** – సిరియాలోని ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా అమెరికా సైన్యం భారీ ఎత్తున ప్రతీకార దాడులు నిర్వహించింది. శనివారం తెల్లవారుజామున అమెరికా సెంట్రల్ కమాండ్ నేతృత్వంలో జరిగిన ఈ వైమానిక దాడులు ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశాయి. సిరియాలోని ఎడారి ప్రాంతాల్లో ఉన్న ఐసిస్ శిక్షణ కేంద్రాలు, ఆయుధ గిడ్డంగులు మరియు కమ్యూనికేషన్ కేంద్రాలపై అమెరికా యుద్ధ విమానాలు విరుచుకుపడ్డాయి. 'ఆపరేషన్ హాక్ఐ' పేరుతో ఎయిర్ ఫోర్స్ చేపట్టిన ఈ దాడుల్లో పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులు మరణించినట్లు సమాచారం. ఇటీవల అమెరికా సైనికులు, మిత్రదేశాల దళాలపై ఐసిస్ జరిపిన దాడులకు సమాధానంగానే ఈ భారీ ఆపరేషన్ చేపట్టినట్లు అమెరికా రక్షణ శాఖ(పెంటగాన్) స్పష్టం చేసింది. ఐసిస్ ఉగ్రవాదులు మళ్లీ పుంజుకోకుండా మరియు భవిష్యత్తులో దాడులు చేయకుండా వారి సామర్థ్యాన్ని దెబ్బతీయడమే ఈ దాడుల ప్రధాన ఉద్దేశమని సెంట్రల్ కమాండ్ పేర్కొంది.గత కొన్ని రోజులుగా మధ్యప్రాచ్య దేశాల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, అమెరికా నేరుగా సిరియాలో రంగంలోకి దిగడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. సిరియాలో ప్రస్తుతం వెయ్యి మందికి పైగా అమెరికన్ సైనికులు ఉన్నారని సమాచారం. ఈ క్రమంలోనే సిరియాలో ఐసిస్ ముప్పును పూర్తిగా తొలగించే వరకు తమ పోరాటం ఆగదని అమెరికా సైనిక వర్గాలు స్పష్టం చేశాయి.

## ఉపాధి హామీ పథకంపై కేంద్రం బుల్డోజర్



**మొదటిపేజీ తరువాయి** – కూలీల హక్కులను కాలరాయడమేనని, వారి జీవనోపాధిపై జరుగుతున్న దాడి అని అభివర్ణించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ 'ఎక్స్' ఖాతాలో ఒక వీడియో సందేశాన్ని పంచుకున్నారు. రెండు రోజుల క్రితం పార్లమెంటులో వీబీ-జీ రామ్ జీ బిల్లు 2025ను ఆమోదించిన నేపథ్యంలో సోనియా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.దాదాపు రెండు దశాబ్దాల క్రితం మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ హయాంలో ఈ చట్టాన్ని తీసుకొచ్చిన విషయాన్ని సోనియా గుర్తుచేశారు. ఇది కోట్లాది గ్రామీణ కుటుంబాలకు, ముఖ్యంగా అణగారిన వర్గాలకు జీవనోపాధి భద్రత కల్పించిన ఒక విప్లవాత్మక అడుగు అని ఆమె పేర్కొన్నారు. కరోనా మహమ్మారి సమయంలో ఈ పథకం పేదలకు జీవనాధారంగా నిలిచిందని తెలిపారు.అయితే, గత 11 ఏళ్లుగా మోదీ ప్రభుత్వం ఈ పథకాన్ని నీరుగార్చేందుకు అనేక ప్రయత్నాలు చేసిందని సోనియా ఆరోపించారు. ప్రతిపక్షాలతో సంప్రదింపులు జరపకుండా, ఏకపక్షంగా ఉపాధి హామీ పథకం స్వరూపాన్నే మార్చేశారని, చివరకు మహాత్మా గాంధీ పేరును కూడా తొలగించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరికి, ఎక్కడ, ఎంత పని ఇవ్వాలనే నిర్ణయాలను క్షేత్రస్థాయి వాస్తవాలకు దూరంగా ఢిల్లీ నుంచి తీసుకుంటున్నారని విమర్శించారు."20 ఏళ్ల క్రితం ఈ చట్టం కోసం నేను పోరాడాను. ఇప్పుడు ఈ నల్ల చట్టానికి వ్యతిరేకంగా పోరాడేందుకు కూడా నేను కట్టుబడి ఉన్నాను" అని సోనియా ఉద్ఘాటించారు. ఈ పోరాటంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

## కేసీఆర్ ప్రజల్లోకి వస్తున్నారు

**మొదటిపేజీ తరువాయి** – రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి హనీమూన్ ముగిసిందని ఇక కేసీఆర్ ప్రజల్లోకి వస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్ రేపు అన్ని విషయాలపై పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. కేసీఆర్ బహిరంగ సమావేశాలపై రేపటి సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎవరితో ఫుట్‌బాల్ ఆడుకుంటారో తనకు తెలియదని, కానీ తాను మాత్రం ఆయనతో ఫుట్‌బాల్ ఆడుకుంటానని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తనను ఫెయిల్యూర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడంపై కూడా కేటీఆర్ స్పందించారు. తాను ఫెయిల్యూర్ నాయకుడిని కాదని ఆయన అన్నారు. తాను వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాక 32 జిల్లా పరిషత్‌లు, 136 మున్సిపాలిటీలను గెలిచామని గుర్తు చేశారు.అయితే రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 7 ఉప ఎన్నికలు నిర్వహిస్తే అన్ని స్థానాల్లో ఓడిపోయారని కేటీఆర్ గుర్తు చేశారు. ఆయన ముఖ్యమంత్రి అయ్యాక సొంత పార్లమెంటు స్థానాన్ని కూడా గెలిపించలేకపోయారని విమర్శించారు. తాను ఐరన్ లెగ్ కాదని, రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీలే ఐరన్ లెగ్‌లు అని ఆయన అన్నారు. ఢిల్లీలో రేవంత్ రెడ్డి విందులు, వినోదాలు ఎవరి ఇళ్లల్లో జరుగుతున్నాయో అందరికీ తెలుసని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఢిల్లీలోని తుగ్లక్ రోడ్డులో రేవంత్ రెడ్డి ఇల్లును రీమోడల్ చేయించిందే బీజేపీ ఎంపీ అని ఆయన ఆరోపించారు. సీఎం రమేశ్‌కు కాంట్రాక్టులు ఇస్తుంది రేవంత్ రెడ్డేనని అన్నారు. తాను ముఖ్యమంత్రి ఇంట్లోని మహిళలు, పిల్లలు, మనవడి గురించి మాట్లాడనని కేటీఆర్ స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి వలె తాను కుటుంబ సభ్యుల గురించి మాట్లాడి చిల్లర రాజకీయాలు చేయదలుచుకోలేదని ఆయన అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందని కేటీఆర్ వెల్లడించారు.



## హైదరాబాద్, వరంగల్ నగరాల్లో డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఆరుగురు అరెస్టు



**మొదటిపేజీ తరువాయి** – హైదరాబాద్ నగరంలో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఆరుగురిని ఈగల్ టీమ్ పోలీసులు అరెస్టు చేశారు. నగరంలో ప్రతి సంవత్సరం కొత్త సంవత్సర వేడుకల సమయంలో పెద్ద ఎత్తున డ్రగ్స్ పట్టుబడుతుండటం ఆనవాయతీగా వస్తోంది. మత్తు పదార్థాల వ్యాపారంలో 80 నుంచి 90 శాతం డిసెంబర్ – జనవరి మధ్య జరుగుతుందని అంచనా. ఈ నేపథ్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.రాష్ట్రంలో డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఆరుగురు డ్రగ్ పెడ్లర్లను అరెస్టు చేసిన పోలీసులు, వారి నుంచి 330 గ్రాముల గంజాయి, 3 గ్రాముల కొకైన్, 11.5 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు.వరంగల్ జిల్లాలో ముగ్గురు గంజాయి సరఫరాదారులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 80 గ్రాములు, మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఆంధ్రప్రదేశ్,

## ఒక గొప్ప నాయకుడిని ఒక కులానికి పరిమితం చేస్తారా?

**పవన్ కల్యాణ్**

**గొప్ప నాయకులకు కులాలను ఆపాదించవద్దన్న పవన్ కల్యాణ్**

**పొట్టి శ్రీరాములును ఒక కులానికి పరిమితం చేయడంపై ఆవేదన**

**ఉభయగోదావరి జిల్లాల్లో అమరజీవి జలధార ప్రాజెక్టుకు శంకుస్థాపన**

**రూ.3,050 కోట్ల వ్యయంతో సురక్షిత తాగునీటి పథకం**

**బూర్గుల, పొట్టి శ్రీరాములు త్యాగాలను స్మరించుకున్న ఉపముఖ్యమంత్రి**



మహనీయులకు, గొప్ప నాయకులకు కులాలను అంటగడితే మనం ఎప్పటికీ భారతీయులుగా ఎదగలేమని, కేవలం కులాల సమూహంగానే మిగిలిపోతామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఉభయ గోదావరి జిల్లాల ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు రూ.3,050 కోట్ల వ్యయంతో చేపడుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. అంబేద్కర్, గాంధీ, పొట్టి శ్రీరాములు వంటి వారు అందరి కోసం ఆలోచించిన గొప్పవారని, వారిని కులాలకు అతీతంగా చూడాలని సూచించారు. గతంలో తాను పొట్టి శ్రీరాములు జయంతి నాడు నివాళులు అర్పించేందుకు వెళ్తే, ఆయన విగ్రహం ఒక ఆర్యవైశ్య సత్రం వద్ద ఉందని చెప్పారని, ఆ రోజు తాను ఎంతో ఆవేదనకు గురయ్యానని గుర్తుచేసుకున్నారు. తెలుగు ప్రజలందరి కోసం ప్రాణత్యాగం చేసిన వ్యక్తిని ఒక కులానికి, నెల్లూరు జిల్లాకు పరిమితం చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా 5 జిల్లాల్లో 'అమరజీవి జలధార' వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం రూ.7,910 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు 'అమరజీవి' అని పేరు పెట్టడానికి బలమైన కారణం ఉందని వివరించారు. తెలుగువారంతా ఏకం కావాలని ముఖ్యమంత్రి పదవిని త్యాగం చేసిన బూర్గుల రామకృష్ణారావు, తెలుగువారి ఆత్మగౌరవం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు తనకు ఎంతో ఇష్టమైన నాయకులని, వారి త్యాగాలను స్మరించుకుంటూనే ఈ పథకానికి ఆ పేరు పెట్టినట్లు స్పష్టం చేశారు.

## పవనన్న చేసిన భగీరథ ప్రయత్నం ఫలించింది

**మొదటిపేజీ తరువాయి** – మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు స్వచ్ఛమైన జలాలు అందించేందుకు పవన్ చేసిన భగీరథ ప్రయత్నం ఫలించిందని కొనియాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మరో హామీని నెరవేరుస్తున్న పవన్ కల్యాణ్‌కు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు.మంత్రి లోకేశ్ శుభాకాంక్షలపై పవన్ కల్యాణ్ స్పందిస్తూ ధన్యవాదాలు తెలియజేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని 'జల్ జీవన్ మిషన్' పథకాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నామని చెప్పారు."ప్రజలందరికీ రోజుకు కనీసం 55 లీటర్ల సురక్షిత త్రాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన జల్ జీవన్ మిషన్ పథకాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ, ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యం లోని కూటమి ప్రభుత్వం ద్వారా, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రిగా ఈ అద్భుతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ఉభయ గోదావరి జిల్లాల ప్రజల దాహార్తి తీర్చే ఈ 'అమరజీవి జలధార ప్రాజెక్ట్' పట్ల అభినందనలు తెలియజేసినందుకు మిత్రుడు, సహచర మంత్రివర్యుడు నారా లోకేశ్ కు హృదయపూర్వక ధన్యవాదాలు. ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ గారిని నిరంతరం స్మరించుకునేలా మధ్యాహ్న భోజన పథకానికి నామకరణం చేసినందుకు, ఆవిడ జన్మించిన గోదావరి నేల నుంచి మీకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అంటూ పవన్ కల్యాణ్ ఎక్స్ లో స్పందించారు.

## మీ సేవ అభినందనీయం

**మొదటిపేజీ తరువాయి** – రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలిపై ప్రశంసల వర్షం కురిపించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని లాలాచెరువు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయురాలు మోటూరి మంగారాణి సేవానిరతిని కొనియాడుతూ సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా ఓ పోస్ట్ పెట్టారు.అంకితభావం, సేవా దృక్పథంతో మంగారాణి విధులు నిర్వర్తిస్తున్నారని లోకేశ్ అభినందించారు. తరగతి గది బోధనకే పరిమితం కాకుండా రైమ్స్, ఆటల ఆధారిత పాఠాలు, స్ఫూర్తి కథలు, 3డి యానిమేషన్ వీడియోలు రూపొందించి 'మీఅస్త్రుతీఖఅఆ నావంంశీఅం' అనే యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విధంగా లక్షలాది మంది విద్యార్థులకు విద్యను చేరువ చేస్తున్న ఆమెకు హ్యాట్సాఫ్ చెప్పారు.మంగారాణి సేవా స్ఫూర్తిని కూడా లోకేశ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇటీవల అదే పాఠశాల విద్యార్థి సత్తి చరణ్ తేజ్ ప్రమాదానికి గురికాగా, తోటి ఉపాధ్యాయులతో కలిసి విరాళాలు సేకరించి ఆ బాలుడి వైద్యానికి అండగా నిలిచారని గుర్తుచేశారు.రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అయిన మంగారాణి.. టెక్స్ట్ బుక్ రైటర్‌గా, టీచర్ ట్రైనర్‌గా కూడా సేవలు అందిస్తున్నారని లోకేశ్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల గొప్పతనాన్ని చాటిచెబుతున్న మంగారాణి వంటి ఉపాధ్యాయుల కృషితోనే 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్' కల సాకారం అవుతుందని ఆయన తన పోస్టులో ఆశాభావం వ్యక్తం చేశారు.

## బెంగాల్ ర్యాలీలో వర్చువల్‌గా మాట్లాడిన మోదీ

**మొదటిపేజీ తరువాయి** – తాము ఎప్పుడూ ఆపబోమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులను మమత ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. మమతా బెనర్జీ పాలనలో ఉద్రిక్తతలు, అల్లర్లు, బెదిరింపులతో విసిగిపోయిన ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. బీహార్ ఎన్నికల ఫలితం బెంగాల్ ఎన్నికల్లో తమ విజయానికి మార్గం సుగమం చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎమ్మెల్యేలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం!

**మొదటిపేజీ తరువాయి** – ఇన్‌ఛార్జ్‌లపై రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్ అసహనం వ్యక్తం చేశారు.రెబల్స్‌తో సమన్వయ లోపం, బంధువులను అభ్యర్థులుగా నిలబెట్టడం ద్వారా పార్టీకి తీరని నష్టం చేశారని సీఎం అన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకుని పార్టీ నియమ నిబంధనలకు లోబడి పని చేయాలని ఆదేశించారు.తెలంగాణలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 12,733 స్థానాలకు గాను కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు 7,000కు పైగా స్థానాల్లో గెలవగా, బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు 3,502కు పైగా స్థానాల్లో, బీజేపీ 688 స్థానాల్లో విజయం సాధించారు. తమకు పట్టున్న కొన్ని స్థానాలను కోల్పోవడంపై కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్‌గా ఉంది. ఈ క్రమంలో బాధ్యులపై అధిష్ఠానం ఆగ్రహం వ్యక్తం చేసింది.

# సంపాదకీయం

## జీవించి ఉండటానికి నన్ను నేను ఒప్పించుకునే ప్రయత్నం నా కవిత్వం

మనుష్యులు తమతమ రోజువారీ యుద్ధాలను దాటడానికి పోరాటం ఎంత ముఖ్యమో పోనివ్వాలనే చూపూ అంతే ముఖ్య మని తెలిసిన కవి బివివి ప్రసాద్. అందుకే గెలుపు జ్వరం పట్టిన లోకంలో, ఓడిపోవడానికే ఎక్కువ ధైర్యం కావాలని ఇప్పటికి ఎన్నో యేళ్ళ క్రితమే తన కవిత్వంలో చెప్పగలిగారు. లోపలి ప్రపంచంతో నిజాయితీగా సాగే సంభాషణల్లో, కొంత ఆనందమూ, కొంత దిగులూ, కొంత ఆశా కొంత వెలితీ అన్నీ తెరలు తెరలుగా తనలోనే వచ్చిపోవడం మనిషికి తెలుస్తుంది. ఆ ఉద్వేగాల ఉధృతిని అర్థం చేసుకునేందుకు ఉపకరించే తాత్విక అన్వేషణతోకూడిన కవిత్వం బివివి గారిది. లోపలి మనిషిపట్లా, లోకంపట్లా, దయాపూరితమైన చూపును, ఆలోచనను, మెలకువను ఈ కవిత్వంలో నేను చూశాను. సీతాకోక రెక్కల్లోని ఆశను, వర్షపు చినుకుల సంగీతాన్ని, వెన్నెలరాత్రుల నిశ్శబ్దంలోని గాఢమైన శాంతిని ఈ పదాల్లో నుండీ అందుకున్నాను. బివివి ప్రసాద్ కొత్త కవిత్వ సంపుటి 'సృష్టి' విడుదలైన సందర్భంగా ఆయనతో ఇంటర్వ్యూ.
'ఆకాశం' సంపుటితో మొదలై మీ కవిత్వ సంపుటుల్లో మీదైన శైలి ప్రస్ఫుటంగా కనపడుతూ వస్తోంది. దీని వెనుక ఉన్న సాధన, ప్రభావాలను చెప్పండి. 'ఆకాశం' రాసేనాటికి, శిల్పపరమైన ఎలాంటి కండిషన్ లేకుండా, నన్ను నేను వాక్యాల్లోకి తెరుచుకోవటం కొంత చాతనైంది అనుకుంటాను. అయితే నా వాక్యం నేను కనుగొనడానికి సహాయపడినవారు ముఖ్యంగా టాగోర్, ఖలీల్ జిబ్రాన్. పరమ ఉదాత్తమైనదాన్నే కవితా సమయంలో తాకాలని నేర్పారు వారు. తర్వాత ఇస్మాయిల్. కవిత్వంలోకి అనుభవాన్ని అనువదించడం, ప్రధానంగా, ఆయన నుండి వచ్చిందనుకుంటాను. మొదటి సంపుటి 'ఆరాధన'లోని కవితలలో ఏకరూప్యత లేకపోవటం గమనిస్తే, నాదైన వాక్యం కోసం తపన పడటం తెలుస్తుంది. 'నేనే ఈ క్షణం' సంపుటిలోని కవితల కాలంలోనే, విస్తృతంగా సాధన చేసిన హైకూ ప్రక్రియ నేర్పింది. గనుక జపనీయ కవుల ప్రభావం కూడా నా వాక్యాల్లో ఉండవచ్చును. శ్రీ రమణమహర్షి బోధించిన ప్రశ్న 'నేనెవరు' నా తాత్విక అన్వేషణకి మూలం. ఆ 'నేను'ను గురించి విస్తృతంగా, లోతుగా వివరించిన నిసర్గదత్త మహరాజ్‌ని చదవటం స్పష్టతనిచ్చింది. 'నేను'ను మరింత సూక్ష్మంగా బోధించినవారు శ్రీకాళహస్తిలోని సుబ్రహ్మణ్యంగారు. పూర్వ ఋషుల బోధలు, ఎకార్ట్ టోలీ వంటి ఆధునిక ద్రష్టల సూచనలు కూడా నా వెదుకులాటకి సహాయపడుతున్నాయి అనుకుంటాను. అయితే, అంతిమంగా ఎవరైనా తమదైన స్పష్టత, వెలుగు తామే పొందాల్సి ఉందనిపిస్తుంది. రూమి, టాగోర్ లాంటి తాత్వికకవుల్లో దైవం కోసం, దైవానుగ్రహం కోసం, సన్నిధి కోసం వెదుకులాట ఉంటుంది. మీ అన్వేషణకు దైవం కేంద్రం కాదు. ఎందుకు? పూర్వ తాత్వికకవులు సత్యాన్ని దైవంగా, గా, చూడబడేదిగా తలచటం ఎక్కువ, కొన్ని మినహాయింపులున్నా. సత్యం అని, చూసేవాడు అని, నేనే సత్యమని జ్ఞానులు చెబుతారు. కనక, నా ప్రయత్నమంతా నన్ను నేను తెలుసుకోవటం వైపే, నేను నేనుగా ఉండటం వైపే ఉంటుంది. రమణమహర్షి తనలో తాను సంస్థితం కావటం అంటారు. తెలియటం కూడా కాదు, అదిగా ఉండటం. అది సర్వ దర్శనాల లక్ష్యంగా తోచింది. ఒక ఆబ్జెక్ట్‌ని కవిత్వం చేయటంలో వెసులుబాటు ఉంటుంది. 'నేను'కీ ఆ వస్తువుకీ మధ్యనున్న ఖాళీలో ఎన్ని ఊహలైనా, నాటకీయత అయినా, ఎంత రసమైనా చొప్పించవచ్చును. కానీ 'నేను'ను కవిత్వం చేయటం దుస్సాధ్యం. కానీ, ప్రసాద్ అనే నేను, ఏమీకాని నేనుగా ఉండాలనుకున్నపుడు ఆ ప్రయత్నం, వెదుకులాట, దుఃఖం, ఆనందం కవిత్వంగా మారే వీలు కలుగుతుంది. ఆ చలనాలు కేవలం బౌద్ధికం కాకుండా, హృదయగతమైనప్పుడు అది కవిత్వంగా పండుతుంది. మీ కవితల్లో అధికభాగం 'నువ్వు' అని సంబోధిస్తూ రాస్తారు. దీనికేమైనా ప్రత్యేకమైన కారణం ఉందా? నా కవిత్వం నాతో నేను జరిపే సంభాషణ. కవిగా ఉన్న తాను, ఒంటరి తనతో జరిపే సంభాషణలో కవి, ఒంటరి మనిషిని ఉద్దేశించి చెబుతుంటాడు. ఈ ధోరణి ఉద్దేశపూర్వకంగా కాకుండా, సహజంగా నాలో ఏర్పడిందనుకుంటాను. గాఢమైన అనుభవంతో నిండిన ఒక మనిషి సాంత్వనగా పలుకుతున్న మాటల్లా వినపడుతుంది మీ కవిత్వం, అదే సమయంలో వాక్యాలు బోధ చేస్తున్నట్లు కూడా ఉండవు. ఇది ఎలా నిర్వహిస్తారు.

# ఆర్థిక అక్షరాస్యతా అవసరమే!



భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటింది. ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగానూ ఇండియా అవతరించింది. అయినాసరే చాలామందికి, ముఖ్యంగా యువతకు ఆర్థిక విషయాలపై సరైన అవగాహన(ఆర్థిక సాక్షరత) కొరవడుతోంది. డబ్బుతో కూడిన వ్యవహారాల్లో క్రమశిక్షణ, సహేతుకత అనేవి ఆర్థిక సాక్షరతలో అంతర్భాగం. సామాన్యులు తమ పేరిట తెరిచిన జన్‌ధన్ ఖాతాలను వినియోగించుకోవడం లేదంటే కారణం- వారికి సరైన అవగాహన లేకపోవడమే! 'ఆర్థిక సాక్షరత' అంటే డబ్బు సంపాదించడం, ఖర్చు పెట్టడమే కాదు- ఆర్థిక కార్యకలాపాలను చక్కగా నిర్వహించగలగడం కూడా. సరైన ఆర్థిక అవగాహన ఉన్నవారు బ్యాంకుల్లో డబ్బును పొదుపు చేయడంతో పాటు పనికొచ్చే కార్యక్రమాలకూ వృత్తి వ్యాపారాలకూ రుణాలు తీసుకుని ఎదుగుతారు. తద్వారా ప్రభుత్వానికి పన్నుల రూపేణా ఆదాయమూ సమకూరుతుంది. కానీ, దేశంలో చాలామందికి... విద్యావంతులకు కూడా ఆర్థిక నిర్వహణ గురించి పెద్దగా తెలియదు. కేవలం మూడోవంతు మహిళలకే మదుపుచేసే అలవాటు ఉంది. జన్‌ధన్ ఖాతాలు ఉన్నా, చాలామంది వాటిని వినియోగించడం లేదు. తల్లిదండ్రులు, విద్యాసంస్థలు కూడా పిల్లలకు ఆర్థిక సాక్షరతను అలవర్చేందుకు అంతగా ప్రయత్నించడం లేదు. ఈ పరిస్థితిని మార్చాల్సిన అవసరముంది.

### అవగాహనతో పురోగతి...

కేంద్ర ప్రభుత్వం 2047 నాటికల్లా 'వికసిత భారత్'ను సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. తెలుగు రాష్ట్రాలు సైతం ఆ దిశగా ప్రణాళికాబద్ధంగా ముందడుగు వేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ 2.4లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని లక్షిస్తుంటే, తెలంగాణ మూడు లక్షల కోట్ల డాలర్లపై గురిపెట్టింది. ఏపీ తలసరి ఆదాయాన్ని 43వేల డాలర్లకు పెంచాలని ఆశిస్తుంటే, తెలంగాణ ఏమో కోటి కుటుంబాలను కోటీశ్వరులను చేయాలని భావిస్తోంది. పేదరిక నిర్మూలనకు ఏపీ 'పీ-4' పథకంతో ముందుకు సాగుతోంది. ఈ లక్ష్యాలను సాధించడానికి పెట్టుబడులు, మౌలిక వసతులు సమకూర్చుకోవడంతోపాటు ప్రజలకు ఆర్థిక సాక్షరతను అలవరచడమూ ఎంతో ముఖ్యం. నేటి కాలంలో ప్రజల అవసరాలు పెరిగాయి. దీర్ఘకాలంలో వాటిని తీర్చుకోవడానికి పొదుపు-మదుపు ముఖ్యం. కాబట్టి ఆర్థిక మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రిస్క్‌ను సరిగ్గా అంచనావేస్తూ మదుపు చేయడం గురించి వారికి తెలియజెప్పాలి. ఎలాంటి పద్ధతులను అనుసరించాలి, ఏయే పథకాల్లో చేరాలి అనేది సామాన్యులకు వివరించాలి. స్టాక్ మార్కెట్లు, ప్రభుత్వ పథకాలు, సంపదను వృద్ధి చేసుకునే మార్గాల గురించీ తెలియజెప్పాలి. ఇదంతా ఆర్థిక సాక్షరతలో భాగమే. సుమారు 80శాతం మంది అక్షరాస్యులు ఉన్న భారతదేశంలో 75శాతం మంది వయోజనులకు ఆర్థిక అంశాలపై సరైన అవగాహన లేదనీబీ మరీ ముఖ్యంగా 80శాతం మహిళలకు బొత్తిగా ఆర్థిక సాక్షరత లేదని స్టాండర్డ్ అండ్ పూర్స్ నివేదిక వెల్లడించింది. ఆర్థిక సంస్థలు అందించే పొదుపు, మదుపు, రుణ, బీమా పథకాల గురించి సమాజంలోని అన్ని వర్గాలకూ అవగాహన ఉండటం ముఖ్యమని రిజర్వు బ్యాంకు పేర్కొంది. అందునా అల్పాదాయ, బలహీన వర్గాలకు వీటిపై అవగాహన పెంచడంతో పాటు స్వల్ప వడ్డీపై రుణాలిచ్చి వారి ఆర్థిక పురోగతికి చేయూతనివ్వాలని రంగరాజన్ కమిటీ గతంలోనే కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. నగరాలు, పట్టణాల్లో పొదుపు, పెట్టుబడి, బ్యాంకింగ్ గురించి అవగాహన ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లలకు బ్యాంకు ఖాతాలు తెరిచి చిన్ననాటి నుంచే వారితో చిన్న చిన్న మొత్తాలను పొదుపు చేయిస్తున్నారు. కిడ్డీ బ్యాంక్, జూనియర్స్ అకౌంట్ వంటి వాటిని ఇక్కడ ప్రస్తావించాలి. చిన్న పట్టణాలు, పల్లెలు, ఆదివాసీ ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితి కనిపించడం లేదు. ఈ అంతరాన్ని వెంటనే సరిదిద్దాలి. పదేళ్ల వయసు నిండి, 6-10 తరగతుల్లో ఉన్న విద్యార్థులంతా బ్యాంకుల్లో పొదుపు ఖాతాలు తెరిచేలా చర్యలు తీసుకోవాలి. వారికి లభించే ఉపకార వేతనాలు, వేర్వేరు ప్రభుత్వ పథకాల ద్వారా అందే నగదు ప్రయోజనాలను వాటిలోనే జమ చేయాలి. పొదుపు-మదుపు ఎంత ముఖ్యమో వారికి అర్థమయ్యేలా తెలియజెప్పాలి. మరో అయిదేళ్లలో అందరికీ నాణ్యమైన విద్యను అందించాలని ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన నాలుగో సుస్థిరాభివృద్ధి లక్ష్యం చెబుతోంది. అందులో భాగంగానే పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఆర్థిక సాక్షరత అలవరచాలి. కేంద్రం నెలకొల్పిన జాతీయ ఆర్థిక విద్యా కేంద్రం(ఎన్‌సీఎఫ్ఈ) ఆర్థిక సాక్షరతను పెంపొందించడానికి కృషి చేస్తోంది. దీనికి రిజర్వు బ్యాంకుతో పాటు సెబీ, బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ, పింఛన్ నియంత్రణ సంస్థల దన్ను ఉంది.

### బాల్యం నుంచే నేర్పించాలి...

ఎన్‌సీఎఫ్ఈ 2019లో నిర్వహించిన సర్వేలో పలు ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి. దేశంలో ఆర్థిక సాక్షరత 27శాతం ఉంటే, మహిళల్లో అది 21శాతమేనని తేలింది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా(ఎంఎస్ఎంఈ) పరిశ్రమల్లో స్త్రీలు 20శాతమే ఉన్నట్లు గుర్తించారు. పేద, బలహీన వర్గాలకు ఆర్థిక సాక్షరత ఉంటే... ప్రభుత్వం నుంచి నేరుగా సాయం పొందడమెలాగో వారికి అర్థమవుతుంది. తద్వారా అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ఉద్దేశించిన పథకాలు, ఆర్థిక సేవలు మరింతగా విస్తరిస్తాయి. క్రమంగా పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో పాటు ఆర్థిక కార్యకలాపాల్లో మహిళల భాగస్వామ్యమూ పెరుగుతుంది. వికసిత భారతం, స్వర్ణాంధ్ర, తెలంగాణ రైజింగ్ సంకల్పాలు సాకారమవ్వాలంటే సమాజంలోని అన్ని వర్గాలనూ ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములను చేయాలి. తెలుగు రాష్ట్రాల్లో ఆర్థిక సాక్షరత సాధనకు ప్రత్యేక సంస్థల ఏర్పాటు అత్యావశ్యకం. వాటి ఆధ్వర్యంలో విద్యా, వ్యవసాయ, కార్మిక శాఖలు... రైతు సంఘాలు, నెహ్రూ యువకేంద్రాలు కలిసికట్టుగా ఆర్థిక సాక్షరత సాధనకు కృషి చేయాలి. రిజర్వు బ్యాంకు, నాబార్డ్‌ల సహకారాన్నీ తీసుకోవాలి. ప్రభుత్వాలు 'నేటి బాలలే రేపటి పౌరుల'ని గుర్తుంచుకుని, వారిని ఇప్పటి నుంచే వికసిత భారత్ సాధనలో భాగస్వాములను చేయాలి.

# అలాంటి ఫ్రెండ్స్... మీకున్నారా?



మంచి స్నేహితులను ఎంచుకోవాలని పిల్లలకు తల్లిదండ్రులు చెబుతుంటారు. నిజానికి ఆ వయసులో ఎవరు మంచో ఎవరు కాదో అర్థం కాదు. పాఠశాల నుంచి కళాశాల స్థాయికి ఎదిగే క్రమంలో మంచీ చెడుల పట్ల కొంత అవగాహన పెరుగుతుంది. మనకు తెలియకుండా మనమే మనలాగా ఆలోచించేవారికి దగ్గరగా, వ్యతిరేక భావజాలం ఉన్నవారికి దూరంగా జరగడం ప్రారంభిస్తాం. ఇద్దరు వ్యక్తుల మధ్య మైత్రికి రెండుపక్కల నుంచి సమ ప్రాధాన్యం లభిస్తేనే అది విడదీయరాని బంధమవుతుంది. అయితే ఈరోజుల్లో ఇలాంటి గాఢమైన మైత్రీబంధాలు అరుదుగా మాత్రమే కనిపిస్తున్నాయి. మనకు పరిచయస్తులు ఎక్కువగానే ఉంటున్నారు కానీ, 'స్నేహితులే' తక్కువగా ఉంటున్నారు. ఆ మధ్య అమెరికాలో ఈ స్నేహాల మీద చాలా అధ్యయనాలు జరిగాయి. మిత్రులు తగ్గిపోయి, ఒంటరితనంతో బాధపడుతున్న వారి సంఖ్య విపరీతంగా పెరుగుతున్నట్లు ఈ అధ్యయనాలు తేల్చాయి. ఒంటరితనం వ్యక్తుల మానసిక, శారీరక ఆరోగ్యాలమీద, సామాజిక జీవితం మీద ఎన్నో దుష్ప్రభావాలు చూపుతుంది. అది తెలుసుకున్న స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ పరిశోధకులు ఆరోగ్యకరమైన స్నేహాలను ఎలా పెంచుకోవాలో చెబుతూ ఒక కోర్సును కూడా అందిస్తున్నారు. ఇది చాలదూ నిజమైన స్నేహాల అవసరం ఎంత ఉందో చెప్పడానికి? స్నేహానికి ఆరోగ్యకరమైన సంభాషణ పునాది వేస్తుంది. ఇందులో వినడం, మాట్లాడటం రెండింటికీ సమప్రాధాన్యం ఉండాలి. సంభాషణను వాగ్వాదంగా మార్చకుండా చర్చగా మాత్రమే కొనసాగించగలగాలి. నేటి సమాజంలో భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడం క్లిష్టమైన సమస్యగా మారింది. సహానుభూతితో కూడిన స్నేహం అందుకు దోహదపడుతుంది. ఒకప్పుడు కలం స్నేహాల్లో వ్యక్తుల మధ్య అరమరికలు లేకుండా అభిప్రాయాలను పంచుకునేవారు. సాంకేతికత పెరిగి, సామాజిక మాధ్యమాలు అందుబాటులోకి వచ్చాక అపరిచితులతో కొత్త స్నేహాలు ఏర్పడుతున్నాయి. కలం స్నేహంలో కూడా అటువంటివే ఏర్పడినా మోసాలు, బ్లాక్‌మెయిలింగ్ లాంటి వాటికి తావుండేది కాదు. కానీ ఇప్పటి స్నేహాలు అంత నమ్మశక్యమైనవిగా ఉండటం లేదని జరుగుతున్న సంఘటనలు తెలియజేస్తున్నాయి. ఆరోగ్యకరమైన స్నేహానికి ఎనిమిది ప్రధానమైన అంశాలు తోడ్పడతాయి. పరస్పర నమ్మకం కలిగి ఉండాలి. అవసరమైన సందర్భాల్లో ఇచ్చిపుచ్చుకునే ధోరణి ప్రదర్శించాలి. అభిప్రాయాలనూ ఆలోచనలనూ స్పష్టంగా వ్యక్తీకరించాలి. ఒకరినొకరు గౌరవించుకుంటూ, స్నేహబంధంలోనూ ఎవరి స్పేస్ వారికి ఇవ్వాలని తెలుసుకుని ప్రవర్తించాలి. దయా సానుభూతి కలిగి ఉండాలి. అభిప్రాయ భేదాలు వచ్చినప్పుడు సంయమనంతో వ్యవహరించాలి. బయటి నుంచి ఎదురైన సమస్యలను కలిసి పరిష్కరించుకోవాలి. చివరిది అన్నింటికన్నా ముఖ్యమైనది ఏ స్నేహమైనా హానికరంగా తయారైనప్పుడు దాన్ని వదులుకోవడానికి సిద్ధంగా ఉండాలి. శ్రీశ్రీ అన్నట్లు- నిన్ను నిన్నుగా ప్రేమించడానికే కాదు స్నేహించడానికి కూడా ఒకరు ఉండటం మహద్భాగ్యమే!

# రూపాయి క్షీణత ఎంతదాకా?



డాలర్‌తో రూపాయి మారకం విలువ మునుపెన్నడూ లేనంతగా 90 రూపాయలకు పడిపోయింది. దీనివల్ల దేశార్థికంపై ప్రతికూల ప్రభావం ప్రసరిస్తుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇదెంతవరకూ నిజం? రూపాయిని మనమెలా బలోపేతం చేసుకోగలం? భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ 3.30 రూపాయలు. 1991లో ఆర్థిక సంస్కరణలు వచ్చిన తరవాత రూపాయి తన విలువను వేగంగా కోల్పోయింది. నిరుడు 83 రూపాయల దగ్గర కొనసాగిన రూపాయి విలువ- ఇప్పుడు 90రూపాయలకు పడిపోవడం ఆర్థికవేత్తలను విస్మయపరుస్తోంది. సర్కారీ వర్గాలు మాత్రం ఆందోళనేమీ అక్కర్లేదని ధీమా వ్యక్తం చేస్తున్నాయి. డాలర్ బలపడటంవల్లే రూపాయి మారకపు విలువ తగ్గిందిగానీ, రూపాయి బలహీనపడలేదని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు.

### ఒత్తిడి ఎందుకు పెరుగుతోంది?

ఆసియాలోని మిగతా దేశాలతో పోలిస్తే మన రూపాయే ఎక్కువగా ప్రభావితమవుతుంటుంది. ఇందుకు ప్రధాన కారణం- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న వాణిజ్య నిర్ణయాలూ, ప్రతీకార సుంకాలే. మరోవైపు డాలర్ బలోపేతానికి అమెరికా ఫెడరల్ రిజర్వ్ కూడా కొన్ని చర్యలు తీసుకుంటోంది. న్యూఢిల్లీ-వాషింగ్టన్ వాణిజ్య చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడటం, భారతీయ ఎగుమతులపై అగ్రరాజ్యం 50శాతం సుంకాలు విధించడం... విదేశీ మదుపరులు 17బిలియన్ డాలర్ల దాకా పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం, డాలర్ కొనుగోలుకు మదుపరులు ఎగబడటం వంటి వరుస పరిణామాలతో డాలర్‌కు డిమాండ్ పెరిగింది. దాంతో రూపాయి మారకం విలువ పడిపోయింది. ఇప్పుడు రూపాయి క్షీణించడం గురించి భిన్న వాదనలు, రాజకీయ విమర్శలెన్నో వినిపిస్తున్నాయి. వాటిని పక్కనపెడితే, రూపాయి విలువ పతనం ఇప్పటికిప్పుడు ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రతికూల ప్రభావమేదీ చూపకపోవచ్చు. కానీ, దీనివల్ల దీర్ఘకాలంలో లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఉంటాయన్న సూచనలైతే కనిపిస్తున్నాయి. ఎగుమతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వమే స్వచ్ఛందంగా రూపాయి విలువను తగ్గిస్తే(డీవాల్యుయేషన్) కొన్ని రంగాల్లో అనుకూల ఫలితాలు వస్తాయి. 1966లో ద్రవ్యోల్బణాన్ని తగ్గించడానికీ, 1991లో విదేశీ మారకద్రవ్య నిల్వల లోటును అధిగమించడానికీ ఇలాగే చేశారు. ఇప్పుడు మార్కెట్ శక్తుల ప్రభావం వల్ల రూపాయి విలువ పతనమవుతోంది కాబట్టి- ప్రతికూల ఫలితాలే ఎక్కువగా రావచ్చు. జేపీ మోర్గాన్ ఇండియా చీఫ్ సాజిత్ చినోయ్ చెబుతున్నట్లు- ప్రపంచవ్యాప్తంగా భారతీయ వస్తువులు చౌకగా మారడానికీ, దిగుమతులు భారంగా మారి దేశీయ తయారీదారులకు తోడ్పడటానికీ, ఉద్యోగాల సృష్టికీ, చైనా వస్తువులకు అడ్డుకట్ట వేయడానికీ రూపాయి విలువ తగ్గడం కొంతవరకు ఉపయోగపడుతుంది. కానీ, ఇదంతా పరిమితంగానే ఉంటుంది. ఆర్థిక పరిభాషలో చెప్పాలంటే- రూపాయి విలువ తగ్గినప్పుడు ధరలు పెరుగుతాయి. అంటే, ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. దానివల్ల ప్రజల కొనుగోలుశక్తి, వస్తువులకు డిమాండ్ తగ్గిపోతుంది. పెట్టుబడులూ ఉద్యోగావకాశాలూ తగ్గిపోతాయి. అయితే, ప్రభుత్వం ఇటీవల జీఎస్‌టీ శ్లాబులు తగ్గించడం, ఆర్‌బీఐ ద్రవ్యవిధానం పరిస్థితిని కొంతవరకు సరిదిద్దగలుగుతాయి. సహజంగా రూపాయి విలువ క్షీణత ఎగుమతులను ప్రోత్సహించి, దిగుమతులను నిరుత్సాహపరుస్తుంది. దీనివల్ల విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో అనుకూలత ఏర్పడుతుంది. కానీ, ట్రంప్ సుంకాల పెంపు వల్ల రూపాయి విలువ తగ్గినా, ఎగుమతుల రంగంలో రావాల్సిన అనుకూలత రాకుండా పోయే ప్రమాదముంది. ఇండియా 85శాతానికి పైగా చమురు, 60శాతం వంట నూనెలతో పాటు ఎలక్ట్రానిక్ వస్తువులు, ఎరువులు, రసాయనాలు, యంత్రాలు వంటి వాటిని ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. ఇప్పుడు రూపాయి విలువ క్షీణించడం వల్ల వీటి ధరలు పెరగవచ్చు. ద్రవ్యోల్బణం తరహా పరిస్థితులు రవాణా వ్యవస్థపైనా, తద్వారా దేశార్థికంపైనా ప్రతికూల ప్రభావం చూపవచ్చు.

### మన కరెన్సీ బలపడే మార్గమేంటి?

రూపాయి విలువ పతనాన్ని అడ్డుకోవడానికి రిజర్వుబ్యాంకు చేపట్టే వడ్డీ రేట్ల పెంపు, ఓపెన్ మార్కెట్ ఆపరేషన్ వంటి చర్యలు తాత్కాలిక ఉపశమనం కలిగిస్తాయి. అయితే, విదేశీ మదుపరుల్లో విశ్వాసం కలిగించడం, దిగుమతులను తగ్గించుకోవడం, దేశీయ ఉత్పత్తులకు గిరాకీ పెంచడం, రష్యా సహా ఇతర భాగస్వామ్య దేశాలతో సొంత కరెన్సీలో వ్యాపారం చేయడం, పోర్ట్‌ఫోలియో పెట్టుబడులను ఆకర్షించడం వంటివి ఎంతైనా అవసరం. విదేశీ మారకద్రవ్య నిల్వలనూ...పొదుపు- మదుపు- వినియోగాన్ని పెంచడం ద్వారా దేశార్థికాన్నీ, రూపాయినీ బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారించాలి. భవిష్యత్తులో భారత్ గణనీయమైన వృద్ధిరేటును సాధించి, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినా- రూపాయి విలువను మార్కెట్ శక్తులే నిర్ణయిస్తాయని గుర్తుంచుకోవాలి!

**డాక్టర్ తిరునహరి శేషు, ఆర్థిక నిపుణులు**

ప్రపంచవ్యాప్తంగా పలుదేశాల్లో సాయుధ సంఘర్షణలు శాంతిని నీరుగారుస్తున్నాయి. ఆఫ్రికాలో ఖండంలోని బుర్కినా ఫాసో, మాలి, నైగర్, ఇథియోపియా, సోమాలియా, దక్షిణ సూడాన్, సూడాన్, డీఆర్ కాంగో వంటి చోట్ల ఏళ్లుగా సాయుధ ఘర్షణలు కొనసాగుతున్నాయి. పశ్చిమాసియాలోని సిరియా, యెమెన్, ఇరాక్, ఇజ్రాయెల్, గాజాల్లోనూ అవి రావణకాష్ఠాలు రగిలిస్తున్నాయి. ఆసియాలోని మయన్మార్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్, ఫిలిప్పీన్స్, ఐరోపాలోని అర్మీనియా, అజర్ బైజాన్‌బీ అమెరికా ఖండాల్లోని కొలంబియా, మెక్సికో, హైతి వంటి చోట్ల సాయుధ ఘర్షణలు నెత్తుటి నెగళ్లు రాజేస్తున్నాయి. వీటి మూలంగా 1989-2024 మధ్య 39 లక్షల మంది చనిపోయారు.

## ఫర్టిలైజర్ షాపును ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష...

యూరియా బుకింగ్ యాప్ ద్వారా యూరియా కొనుగోలు చేయడం సులభతరం...



పెద్దపల్లి **ఆకాంక్ష డిసెంబర్ 20:** : పెద్దపల్లి పట్టణంలోని జెండా చౌరస్తా వద్ద గల మహేష్ ఫెర్టిలైజర్స్ ఎరువుల షాపును జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...యూరియా లభ్యతపై రైతులకు ఎటువంటి అనుమానాలు,అపోహలు అవసరం లేదని, ప్రతి రైతుకు అవసరమైన మేర యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ తెలిపారు.యూరియా ప్రతి రైతుకు చేరాలనే ఉద్దేశంతో జిల్లాలో యూరియా ట్రాకింగ్ యాప్ సిద్ధం చేశామని కలెక్టర్ తెలిపారు.గత నెల రోజుల నుండి యాప్ ద్వారా ఎరువుల విక్రయాలు జిల్లాలో పర్యవేక్షించామని కలెక్టర్ తెలిపారు.మనం అనుసరించిన విధానాన్ని పరిశీలించిన ప్రభుత్వం మరింత మెరుగ్గా యూరియా బుకింగ్ యాప్ ప్రవేశ పెట్టిందని అన్నారు.ఓలా, ఉబర్ వంటి యాప్ లలో టాక్సీ ఎలా బుక్ చేస్తామో అదే విధంగా సులభంగా ఇంటి నుంచే యూరియా బుక్ చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.రైతులు తమ ఇంటి వద్ద నుంచి యూరియా బుక్ చేసుకుని ఎరువుల షాప్ కు స్వయంగా వచ్చి లేదా ఇతరులతో తమ బుక్ చేసుకున్న బస్తాల వివరాలు,ఓటిపి చెప్తే షాప్ యజమానులు యూరియా సరఫరా చేస్తారని,ఈ యాప్ ఉపయోగించడం వల్ల రైతుల సమయం వృధా కాదని, లైన్లలో నిలబడకుండా సరైన సమయంలో వచ్చి యూరియా తీసుకువెళ్లచ్చని అన్నారు.యాప్ విధానం ద్వారా రైతులు అవసరానికి మించి యూరియా తీసుకొని వెళ్లి స్టాక్ పెట్టుకోవడం నియంత్రించవచ్చని,చిన్న సన్న కారు రైతులకు ఎటువంటి యూరియా కొరత రాకుండా ఉంటుందని తెలిపారు.రైతులు తమ వ్యవసాయ భూమి వివరాలు తమకు ఎంత యూరియా అవసరమంటుందో ఇంకా ఎన్ని కావాలో అనే అంశాలు ఈ యాప్ లో నమోదవుతాయని కలెక్టర్ తెలియజేశారు. రైతులు ఈ యాప్ ను ఉపయోగించడం సులభంగా ఉంటుందని ప్రతి ఒక్కరు యాప్ ఉపయోగించుకొని యూరియా కొనుగోలు చేయాలని ఆప్ ఉపయోగించడంలో ఏదైనా సమస్యలు ఏర్పడితే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఏ. ఓ.లు, పెద్దపల్లి మండల వ్యవసాయ అధికారి శ్రీమతి అలివేణి సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచ్‌కు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అభినందనలు....



పెద్దపల్లి **ఆకాంక్ష డిసెంబర్ 20:** పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని జూలపల్లి మండలం వెంకటరావుపల్లి గ్రామ నూతన సర్పంచ్‌గా ఎన్నికైన మచ్చ యాదగిరి అరుణ శనివారం మాజీ శాసన సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దాసరి మనోహర్ రెడ్డిని నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అరుణతో పాటు ఆమె కుటుంబ సభ్యులు,అనుచరులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం దాసరి మనోహర్ రెడ్డి నూతన సర్పంచ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామాభివృద్ధిలో తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ప్రజలు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేసి వెంకటరావుపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని, గ్రామ సమస్యల పరిష్కారంలో ముందుండాలని దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ పార్టీ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను కొనసాగిస్తూ ప్రజల మన్ననలు పొందాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జూలపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు. నూతన సర్పంచ్ ఎన్నిక పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ గ్రామంలో పండుగ వాతావరణం నెలకొందని తెలిపారు.

## ఆలేరు రైలు మార్గంలో నవ దంపతుల మృతి...

హైదరాబాద్ **ఆకాంక్ష డిసెంబర్ 20:** రైలు నుంచి జారిపడి నవ దంపతులు మృతి చెందిన హృదయ విదారక ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా వంగపల్లి ఆలేరు రైలు మార్గంలో చోటు చేసుకుంది.ఈ ఘటనతో రెండు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.మృతులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన సింహాచలం, భవానిగా రైల్వే పోలీసులు గుర్తించారు. ఇటీవలే వివాహం జరిగిన ఈ దంపతులు హైదరాబాద్ నుంచి విజయవాడలోని బంధువుల ఇంటికి వెళ్లేందుకు రైలులో ప్రయాణిస్తున్న సమయంలో ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది.అర్ధరాత్రి సమయంలో వంగపల్లి%-%ఆలేరు మధ్య రైలు మార్గంలో వీరు రైలు నుంచి జారిపడి పడిపోయినట్లు ప్రాథమిక సమాచారం.ఘటన సమాచారం అందుకున్న వెంటనే రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదం ఎలా జరిగింది? రైలు ఏ సమయంలో ఈ ప్రాంతం గుండా వెళ్లింది? అనే అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ప్రమాదానికి గల అసలు కారణాలు దర్యాప్తు అనంతరం వెల్లడవుతాయని అధికారులు తెలిపారు.ఇటీవలే పెళ్లి బంధంతో ఒక్కటైన ఈ నవదంపతుల ఆకస్మిక మృతి కుటుంబ సభ్యులు,బంధువులను శోకసంద్రంలో ముంచెత్తింది. వరుడు, వధువు స్వగ్రామాల్లో తీవ్ర విషాద వాతావరణం నెలకొంది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను సొంత గ్రామాలకు తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ విషాద ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, దర్యాప్తు కొనసాగుతోందని రైల్వే పోలీసులు వెల్లడించారు.

## విద్యార్థులకు క్రిస్మస్ సెలవుల సందడి...

రెండు రోజుల నుంచి ఐదు రోజుల వరకు విస్తరణ...

పరీక్షల ముగింపుతో పాఠశాలలకు విరామం...

ఆకాంక్ష/**ఆకాంక్ష డిసెంబర్ 20:** ద్యార్థులు ఎదురుచూస్తున్న క్రిస్మస్ సెలవులు వచ్చేశాయి. గతంలో వారం నుంచి పది రోజుల వరకు కొనసాగిన క్రిస్మస్ సెలవులు ఇటీవల సంవత్సరాల్లో క్రమంగా తగ్గుతూ వచ్చినప్పటికీ, ఈ ఏడాది మళ్లీ కొంత వెసులు బాటు కలిగే అవకాశం ఏర్పడింది. ప్రభుత్వ క్యాలెండర్ ప్రకారం క్రిస్మస్ సందర్భంగా పాఠశాలలకు అధికారికంగా సెలవులు ప్రకటించనున్నారు.ప్రతి సంవత్సరం మాదిరిగానే డిసెంబర్ 25న క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు సాధారణ సెలవు ఉంటుంది.అదేవిధంగా డిసెంబర్ 26న బాక్సింగ్ డే సందర్భంగా కూడా పాఠశాలలకు సెలవు ఉంటుంది. ఈ రెండు రోజులు అధికారిక సెలవులుగా కొనసాగనున్నాయి. డిసెంబర్ 27వ తేదీ శనివారం కావడంతో కొన్ని పాఠశాలల్లో పూర్తిస్థాయి పనిదినం, మరికొన్ని చోట్ల అర్ధదినం, మరికొన్ని పాఠశాలల్లో పూర్తిస్థాయి సెలవుగా అమలు చేసే అవకాశం ఉంది. అనంతరం డిసెంబర్ 28వ తేదీ ఆదివారం కావడంతో విద్యా సంస్థలకు సహజంగానే సెలవు ఉంటుంది. ఈ క్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో చాలా వరకు రెండు నుంచి మూడు రోజుల వరకు సెలవులు ఉండనున్నాయి.అయితే క్రిస్టియన్ మిషనరీ పాఠశాలలకు ఈ సెలవుల వ్యవధి మరింత ఎక్కువగా ఉండనుంది. ఆయా పాఠశాలల్లో డిసెంబర్ 24 నుంచి డిసెంబర్ 28 వరకు మొత్తం ఐదు రోజుల పాటు క్రిస్మస్ సెలవులు ఇచ్చే అవకాశముందని సమాచారం. హైదరాబాద్ నగరం సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉన్న మిషనరీ స్కూళ్లు ఇప్పటికే ఈ దిశగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.ఇదిలా ఉండగా,పాఠశాలల్లో (ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు డిసెంబర్ 23వ తేదీతో ముగియనున్నాయి. పరీక్షలు పూర్తయిన వెంటనే డిసెంబర్ 24 నుంచి సెలవులు ప్రారంభమయ్యేలా పాఠశాల యాజమాన్యాలు నిర్ణయం తీసుకుంటున్నాయి. తెలంగాణ ప్రభుత్వ క్యాలెండర్ ప్రకారం కూడా డిసెంబర్ 24 నుంచే క్రిస్మస్ పండుగ వేడుకలు ప్రారంభమవుతాయి.ఈ నేపథ్యంలో రెండు రోజుల అధికారిక సెలవులతో పాటు మధ్యలో వచ్చే శనివారం, ఆదివారం కలిపి కొన్ని పాఠశాలలకు అదనపు విరామం లభించనుంది. అదనంగా మరిన్ని సెలవులు ఇవ్వాలా లేదా అన్న విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.ఇక వచ్చే విద్యా సంవత్సరంలో భాగంగా 2026 ఫిబ్రవరిలో (ఫైనల్ పరీక్షలు) నిర్వహించనున్నట్లు విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి. అప్పటి వరకు విద్యార్థులకు క్రిస్మస్ సెలవులు కొంత ఉత్సాహాన్ని కలిగించనున్నాయి.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్ర కార్యాచరణ...

జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు...




ఆకాంక్ష **ఆకాంక్ష డిసెంబర్ 20:** నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలను నియంత్రించడమే లక్ష్యంగా జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రహదారి భద్రతకు సంబంధించి పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించి, స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.రోడ్డు ప్రమాదాల నివారణకు కచ్చితమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖలను ఆదేశించారు. ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో పోలీస్, విద్య, వైద్య%-%ఆరోగ్య, పంచాయతీరాజ్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భవిష్యత్‌లో ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అత్యంత అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, రాష్ డ్రైవింగ్ ఘటనలపై పటిష్ట నిఘా కొనసాగించాలని జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ ఆదేశించారు. ప్రమాదాలు జరుగుతున్న ప్రతి సంఘటనను శాఖల వారీగా విశ్లేషించి, లోపాలను గుర్తించి సరిదిద్దాలని ఆయన సూచించారు. ముఖ్యంగా శ్రీశైలం రహదారి అత్యంత ప్రమాదకర ప్రాంతంగా గుర్తించబడిందని, అక్కడ ప్రత్యేక జాగ్రత్తలు అవసరమని ఎస్పీ తెలిపారు.జిల్లాలో గుర్తించిన 18 బ్లాక్ స్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, అక్కడ ఇంజనీరింగ్, ట్రాఫిక్, పోలీస్ శాఖలు కలిసి క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించారు. జాయింట్ కమిటీ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టి, అవసరమైన మార్పులు, భద్రతా చర్యలు వెంటనే అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఫిట్నెస్ లేని ట్రాన్స్‌పోర్ట్, నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, జిల్లాలో ఫిట్నెస్ లేని సుమారు 8 వేల వాహనాలకు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ డ్రైవింగ్ చేసే వాహనదారుల లైసెన్సులను రద్దు చేయాలని కూడా స్పష్టం చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించే వాహనాలు, అక్రమ మాడిఫికేషన్లు చేసిన వాహనాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని చెప్పారు. జిల్లాలో దెబ్బతిన్న రహదారులను వెంటనే మరమ్మతులు చేయాలని ఇంజనీరింగ్ శాఖకు ఆదేశాలు జారీ అయ్యాయి. రహదారి నిర్మాణాలు, మరమ్మతులు %ఐఆర్సీ% ప్రకారం చేపట్టాలని, రోడ్డు పనులు జరుగుతున్న ప్రాంతాలకు కనీసం 500 మీటర్ల ముందే సూచిక బోర్డులు, డైవర్షన్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. జాతీయ రహదారులపై తగిన లైటింగ్, బ్లింకర్స్ ఏర్పాటు చేసి వాహనదారులను అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. ప్రమాదాల సమయంలో అంబులెన్స్ సేవల్లో ఉన్న లోటుపాట్లపై సమగ్ర నివేదిక అందజేయాలని డీఎంహెచ్వోకు ఆదేశించారు. ప్రమాద బాధితులకు సకాలంలో వైద్య సేవలు అందేలా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు.రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు పాఠశాల స్థాయి నుంచే ప్రారంభించాలని నిర్ణయించారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించడం, పేరెంట్స్%-%టీచర్స్ సమావేశాల్లో రోడ్ సేఫ్టీ అంశాలపై చర్చించడం ద్వారా సమాజంలో అవగాహన పెంచాలని అధికారులకు సూచనలు ఇచ్చారు.ప్రతి నాల్గవ సోమవారం రోడ్ సేఫ్టీ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలును సమీక్షించి, అవసరమైన మార్పులు చేయాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అమరేందర్, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్, డీఎంహెచ్వో రవి నాయక్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొని, రహదారి భద్రతపై తమ సూచనలు, అభిప్రాయాలను వెల్లడించారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి. సీఐ ప్రసాద్ రావు





రామగుండం క్రైమ్ **ఆకాంక్ష డిసెంబర్ 20:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాద్ రావు కోరారు. ఈ నెల 21న జాతీయలోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఆయన శనివారం తెలిపారు. ఈ సందర్భంగా కక్షిదారులు తమ కేసులను త్వరితగతిన, తక్కువ ఖర్చుతో పరిష్కరించుకునే అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.జాతీయ లోక్ అదాలత్ ద్వారా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న చిన్న క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ చలానాలు, సివిల్ వివాదాలు తదితర అంశాలను పరస్పర అంగీకారంతో సులభంగా పరిష్కరించుకోవచ్చని సీఐ ప్రసాద్ రావు పేర్కొన్నారు. కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, సమయాన్ని ఆదా చేసుకుంటూ సమస్యలకు శాంతియుత పరిష్కారం లభిస్తుందని తెలిపారు.భారత ప్రభుత్వం, న్యాయ సేవల అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ జాతీయ లోక్ అదాలత్ ప్రజలకు తక్షణ న్యాయం అందించే వేదికగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఇరు పక్షాలు పరస్పర సమ్మతితో సమస్యలను పరిష్కరించుకోవడం ద్వారా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల భారాన్ని కూడా గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు.కోర్టుల్లో నడుస్తున్న కేసులను తక్కువ సమయంలో ముగించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ ఒక మంచి అవకాశమని, ప్రజలు ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకుని తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం పొందాలని గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాద్ రావు సూచించారు

## వడ్డేమాన్‌లో తిలతైలాభిషేకాలతో శనేశ్వర స్వామి పూజలు...

బ్రహ్మసూత్రం గల పరమశివునికి రుద్రాభిషేకాలు...



నాగర్ కర్నూల్ **ఆకాంక్ష డిసెంబర్ 20:** పుష్యమాసం శనేశ్వర స్వామికి అత్యంత ప్రీతికరమైన మాసమని, ఈ మాసంలో శనివారం నాడు ప్రత్యేక పూజలు నిర్వహిస్తే భక్తులకు విశేష ఫలితాలు లభిస్తాయని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. శ్రీ విశ్వవసు సంవత్సరం పుష్యమాసం శుక్లపక్ష పాడ్యమి శనివారం సందర్భంగా బీజినేపల్లి మండలం పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో గల శనేశ్వర స్వామి ఆలయంలో శనిగ్రహ దోష




నివారణార్థం తిలతైలా అభిషేక పూజలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు.శ్రీసార్థాసప్త జేష్టమాత సమేత శనేశ్వర స్వామికి ప్రత్యేకంగా తిలతైలాభిషేకాలు, అర్చనలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ, శనేశ్వర స్వామి జన్మ నక్షత్రం పుష్యమి కావడంతో పుష్యమాసంలో స్వామివారిని కొలిచిన భక్తులకు అత్యధిక సంతృప్తితో పాటు శుభఫలితాలు కలుగుతాయని తెలిపారు. జన్మ రిత్యా, గోచార రిత్యా ఎదురయ్యే శనిగ్రహ దోష నివారణకు ప్రతి ఒక్కరూ శక్తిమేరకు స్వామివారిని పూజించాలన్నారు.ఈ పుష్యమాసంలో ఈ నెల 27వ తేదీతో పాటు జనవరి నెలలో 3, 10, 17 తేదీలలో శనివారాలు వస్తున్నాయని, అలాగే పుష్యమి నక్షత్రం ఉన్న రోజు శనేశ్వర స్వామిని దర్శించి పూజించడం మరింత విశేష ఫలితాన్ని ఇస్తుందన్నారు. నువ్వుల నూనె, నువ్వులు బెల్లం, జమ్మి ఆకు, నల్లని వస్త్రాలు, నీలిరంగు జిల్లేడు పూలతో స్వామివారిని పూజించి దానం చేయడం ద్వారా శనేశ్వర స్వామి అనుగ్రహం ప్రాప్తిస్తుందని తెలిపారు. ప్రతి మాసంలో శనివారం అష్టమి, నవమి, త్రయోదశి, చతుర్దశి, అమావాస్య తిథులు ఉన్న రోజుల్లో శనేశ్వర స్వామిని పూజిస్తే విశేష ఫలితం కలుగుతుందని పేర్కొన్నారు. అలాగే ఈ ఆలయంలో గోన బుద్ధారెడ్డి కాలంనాటి బ్రహ్మసూత్రం గల పరమశివునికి భక్తులచే రుద్రాభిషేక పూజలు, అర్చనలు, దీపారాధనలు నిర్వహించారు. నందీశ్వర స్వామికి ప్రత్యేక అర్చన పూజలు చేశారు. అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్‌రావు, కమిటీ సభ్యులు రాజేష్, ప్రభాకరాచారి, పుల్లయ్య, అడ్వకేట్ వీరశేఖర్ చారి, శ్రీకాంత్‌రెడ్డి, ఆలయ అర్చకులు గవ్వమఠం శాంతికుమార్, ఉమామహేశ్వర్, సిబ్బంది గోపాల్‌రెడ్డి, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు...




మెదక్ **ఆకాంక్ష డిసెంబర్ 20:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బసవ గార్డెన్‌లో ఈ నెల 19, 20 తేదీల్లో అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ సృజనాత్మకతను, పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఏటా నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి విద్యార్థులు తమ వినూత్న ప్రాజెక్టులతో పాల్గొన్నారు.ఈ ప్రదర్శనలో నాగసానిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉదయ్ కిరణ్, ధనుష్‌లు గైడ్ టీచర్ అశోక్ కుమార్ మార్గదర్శకత్వంలో రూపొందించిన మన జీవితాలను కాపాడే హ్యాండ్ స్టిక్" ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వీధి కుక్కలు, కోతులు, పాములు, అడవి జంతువుల నుంచి మనుషులు తమను తాము రక్షించుకునేలా బహుళ ప్రయోజనాలతో ఈ హ్యాండ్ స్టిక్‌ను రూపొందించిన విధానం న్యాయనిర్ణేతలను, సందర్శకులను ఆకట్టుకుంది.వైజ్ఞానిక ప్రదర్శనను నిజాంబాద్ జోన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాజా వెంకట్ రెడ్డి, తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి తదితరులు సందర్శించి విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. సామాజిక అవసరాలకు ఉపయోగపడే విధంగా రూపొందించిన ఈ ప్రాజెక్టు విద్యార్థుల ఆలోచనా శక్తికి



నిదర్శనమని కొనియాడారు.ప్రదర్శనలో ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపికైన ఉదయ్ కిరణ్, ధనుష్‌లకు రూ.2000 నగదు పురస్కారం, జ్ఞాపికతో పాటు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ విజయంతో నాగసానిపల్లి ఉన్నత పాఠశాల పేరు రాష్ట్రస్థాయిలో మార్మోగింది.

## మేమున్నాం అండగా.. ధైర్యంగా ముందుకు రండి.

షీ టీం ఏఎస్ఐ విజయలక్ష్మి

నాగర్‌కర్నూల్ జిల్లా సాతపూర్‌లో షీ టీం అవగాహన కార్యక్రమం...







నాగర్‌కర్నూల్ **ఆకాంక్ష డిసెంబర్ 20:** నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం సాతపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం ఏఎస్ఐ విజయలక్ష్మి మాట్లాడుతూ అమ్మాయిలు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారు, లైంగిక దాడులకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు, బాలికలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా భయపడకుండా వెంటనే షీ టీం నంబర్ 8712657676కు కాల్ చేయాలని సూచించారు.భరోసా కేంద్రం ద్వారా బాధితులకు పోలీసు సహకారంతో పాటు న్యాయపరమైన, వైద్యపరమైన సహాయం అందిస్తున్నామని, అలాగే సానుకూల వాతావరణంలో అవసరమైన కౌన్సెలింగ్ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని భరోసా టీం సభ్యురాలు దేవి వివరించారు. జిల్లాలో బాధిత మహిళలకు అండగా సఖీ సెంటర్ నిరంతరం సేవలందిస్తోందని సఖీ సెంటర్ అడ్మిన్ సునీత తెలిపారు. మహిళల రక్షణ, భద్రత, హక్కులపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా మాత్రమే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో షీ టీం సభ్యులు వెంకటయ్య, పాఠశాల హెచ్ఎం లక్ష్మణ్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని షీ టీం సేవలపై అవగాహన పొందారు. మహిళలు, బాలికలు ధైర్యంగా ముందుకు వచ్చి సమస్యలను తెలియజేయాలని, షీ టీం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వక్తలు స్పష్టం చేశారు.

# డబ్బు క్లెయిమ్ చేసుకునే అవకాశం కల్పించేందుకు శిబిరాలు...

### లీడ్ బ్యాంకు మేనేజర్ వేంకటేష్...



పెద్దపల్లి **ఆకాంక్ష డిసెంబర్ 20 :** కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక సేవలు విభాగం ఆదేశాలకు అనుగుణంగా మీ డబ్బు - మీ హక్కు అనే అంశంపై కలెక్టరేట్ లో శనివారం అవగాహన శిబిరాన్ని నిర్వహించినట్లు లీడ్ బ్యాంకు మేనేజర్ వేంకటేశ్ గు తెలిపారు. క్లెయిమ్ చేసుకొని బ్యాంకు పొదుపులు, షేర్లు, డివిడెంట్స్, మ్యూచువల్ ఫండ్స్, బీమా తదితరాలకు సంబంధించి డబ్బు క్లెయిమ్ చేసుకునే అవకాశం కల్పించేందుకు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. బ్యాంకుల్లో 10 ఏళ్లకు పైగా క్లెమ్ చేసుకుని డిపాజిట్ల వివరాలు ఆర్బిఐ ఉద్గమ్ వెబ్సైట్ ద్వారా పొందవచ్చని సూచించారు. ఆర్థికపరమైన సమస్యల పరిష్కారానికి డిసెంబర్ 31 వరకు సర్కారు వీలు కల్పించిందని తెలిపారు. డిసెంబర్ 20న నిర్వహించే అవగాహన శిబిరంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో అపర్ణ రెడ్డి , యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా- స్టేట్ బ్యాంక్ ఆఫ్ఇండియా,శ్రీ బి.బాలనాగు మేడమ్ తెలంగాణ గ్రామీణ బబ్యాంకు, %వీణ% ఇంతియాజ్ అలీ ఇండియన్ బ్యాంక్,,ఇతర జిల్లా కోఆర్డినేటర్లు మరియు బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముత్తారం ఎంపిడిఓ జి.లలిత సస్పెన్షన్....

### కమాన్ పూర్ ఎంపీడీవో గా పని చేస్తున్న సమయంలో అవకతవకలు...

### పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష...




పెద్దపల్లి : **ఆకాంక్ష డిసెంబర్ 20 :** ముత్తారం ఎంపిడిఓ, ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా గ్రామీణాభివృద్ధి అథారిటీ లో ఏ.పీ.డీ గా డిప్యూటేషన్ పై విధులు నిర్వహిస్తున్న జి.లలిత ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కమాన్ పూర్ మండలం రొంపికుంట గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా గతంలో పనిచేసిన ఎం.తిరుపతి అవినీతి కారణంగా సర్వీస్ నుంచి తొలగించడం జరిగింది. ఎం తిరుపతి విచారణ సమయంలో అప్పటి కమాన్ పూర్ ఎంపీడీఓ గా విధులు నిర్వహించిన జి.లలిత కు అవినీతి డబ్బులు వాటా పంపినట్లు మాజీ పంచాయతీ కార్యదర్శి ఎం.తిరుపతి వాంగ్మూలం, ఫోన్ పే స్క్రీన్ షాట్స్ సమర్పించారని కలెక్టర్ పేర్కొన్నారు.పిడి హౌసింగ్ జే. రాజేశ్వర్ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించి రిపోర్ట్ అందించాల్సిందిగా ఆదేశించడం జరిగిందని, ఎం.తిరుపతి వాంగ్మూలం సంబంధించి జి లలిత ఎంపీడీవో పై చేసిన ఆరోపణలకు ఆధారాలు లభించాయని, పీడీ హౌసింగ్ చేపట్టిన విచారణకు ఎంపీడీవో జి లలిత నుంచి సహకారం లభించ లేదని రిపోర్ట్ సమర్పించినట్లు కలెక్టర్ తెలిపారు. పిడి హౌసింగ్ అందించిన రిపోర్ట్ అందుబాటులో ఉన్న సాక్షాల పరిశీలన మేరకు ముత్తారం ఎంపిడిఓ, ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా గ్రామీణాభివృద్ధి అథారిటీ లో ఏ.పీ.డీ గా డిప్యూటేషన్ పై విధులు నిర్వహిస్తున్న జి.లలిత ను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసి, సస్పెన్షన్ సమయంలో హెడ్ క్వార్టర్ వదిలి వెళ్ళడానికి వీలు లేదని కలెక్టర్ ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

### ఘనంగా పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ

# ఆసుపత్రిలో ప్రీ క్రిస్మస్ వేడుకలు...




పెద్దపల్లి : **ఆకాంక్ష డిసెంబర్ 20 :** పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా స్టాఫ్ అందరూ ఈ వేడుకలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. శ్రీధర్, ఆర్ ఎం ఓ డా. విజయ్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ అనిత ప్రియదర్శిని, పద్మ, హెడ్ నర్స్ బేబీ రాణి, భవాని మరియు మిగతా సిబ్బంది పాల్గొన్నారు

### ప్రశంస పత్రం అందుకున్న తహసీల్దార్

# కు ప్రత్యేక అభినందనలు...

### పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష....



పెద్దపల్లి **ఆకాంక్ష డిసెంబర్ 20 :** ప్రజావాణి రెండో వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి ప్రశంస పత్రం అందుకున్న కాల్వ శ్రీరాంపూర్ తహసిల్దార్ జగదీశ్వర్ రావు కు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేక అభినందనలు తెలిపారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షను రాష్ట్రస్థాయి ప్రశంస పత్రం గ్రహీత కాల్వ శ్రీరాంపూర్ తహసిల్దార్ జగదీశ్వర రావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమం అమలులో మంచి పనితీరు కనబరిచిన కాల్వ శ్రీరాంపూర్ తహసిల్దార్ ను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి హైదరాబాద్ లోని ప్రజాభవన్ లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ చిన్నా రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందించిందని, భవిష్యత్తులో కూడా ఇదే పనితీరు కనబర్చాలని, పెద్దపల్లి జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం లో ముందంజలో ఉందని, ప్రశంసిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు.

### ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకం కోసం

# జనవరి 19 లోగా దరఖాస్తు చేసుకోవాలి...

### జిల్లా (ఇంచార్జ్) మైనార్టీస్ సంక్షేమ అధికారి పి.నరేష్ కుమార్ నాయుడు...

పెద్దపల్లి **ఆకాంక్ష డిసెంబర్ 20 :** ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకం క్రింద స్కాలర్ షిప్/ఆర్థిక సహాయం కొరకు అర్హత కలిగిన మైనార్టీస్ విద్యార్థులు జనవరి 19లోగా ఆన్ లైన్ లో ధరఖాస్తు చేసి ఫిబ్రవరి 20 లోపు ఆన్ లైన్ దరఖాస్తులను జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయం లో సమర్పించాలని జిల్లా మైనార్టీస్ సంక్షేమ అధికారి పి.నరేష్ కుమార్ నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ మైనారిటీ సంక్షేమ శాఖ డైరెక్టర్ అండ్ కమీషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లాలోని మైనారిటీ విద్యార్థులకు ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకం క్రింద స్కాలర్ షిప్/ఆర్థిక సహాయం కొరకు పేద మైనార్టీస్ విద్యార్థులు విదేశీ యూనివర్సిటీ లలో చదువుటకు ఇంజనీరింగ్ లో 60 శాతం మార్కులు ఉండి పోస్టు గ్రాడ్యుయేట్ చేయుటకు, పి.జి. లో 60 శాతం మార్కులు వచ్చి డాక్టరేట్ చదువుటకు 2025 జూలై 1 నుండి 2025 డిసెంబర్ 31 వరకు విదేశీ యూనివర్సిటీలలో అడ్మిషన్ తీసుకొన్న మైనార్టీస్ విద్యార్థులకు ముఖ్యమంత్రి ఓవర్ సీస్ పథకం క్రింద స్కాలర్ షిప్/ఆర్థిక సహాయం మంజూరు కొరకై ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలని తెలిపారు.ధరఖాస్తుదారుని కుటుంబ సంవత్సర ఆదాయం 5 లక్షల లోపు ఉండాలని, అమెరికా, యు.కె., ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, ఫ్రాన్స్, జర్మనీ,జపాన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా దేశాలలోని యూనివర్సిటీలలో అడ్మిషన్ పొంది ఉండాలని, మిగతా అర్హత వివరాలకు వెబ్సైట్ చూడాలని, లో జనవరి 19 లోగా ఆన్ లైన్ లో ధరఖాస్తు చేసుకొని, సంబందిత సర్టిఫికెట్స్ మూడు జతల జిరాక్స్ ప్రతులతో ఫిబ్రవరి 20 తేది సాయంత్రం 5 గంటల లోగా జిల్లా మైనార్టీస్ సంక్షేమ శాఖ, పెద్దపల్లి కార్యాలయంలో సమర్పించాలని కోరారు. ఎంపికైన విద్యార్థులకు 20 లక్షల ఉపకార వేతనము/ఆర్థిక సహాయం రెండు విడతలలో, 60 వేల రూపాయల వరకు విమాన చార్జీలు చెల్లించబడతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనార్టీస్ సంక్షేమ అధికారి పి. నరేష్ కుమార్ ఆ ప్రకటనలో తెలిపారు.

### ప్రమాణాలు పాటించని హోటళ్ల సీజ్‌కు ఆదేశాలు...

నాగర్‌కర్నూల్ **ఆకాంక్ష డిసెంబర్ 20 :** నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా ఆహార నాణ్యత తనిఖీలు విస్తృతంగా చేపట్టి, భద్రతా ప్రమాణాలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు, షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలను సీజ్ చేయడానికీ వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు.శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఆహార భద్రత, ఆరోగ్యకరమైన ఆహారాలపై సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆహార కల్తీ, నాసిరకమైన ఆహారం తయారీపై సున్నా సహనం విధానం అమలు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.జిల్లాలోని ప్రైవేటు, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలు, ఇతర ఆహారం తయారీ కేంద్రాల్లో ఫుడ్ ఇన్స్పెక్టర్లు ముమ్మరంగా నాణ్యత తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. కొన్ని హోటళ్లలో నాన్‌వెజ వెజిటేరియన్ ఆహార పదార్థాలను కలిపి తయారు చేస్తున్నారన్న ఫిర్యాదులు అందుతున్నాయని, ఈ అంశాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని చెప్పారు. అనుబంధ శాఖల సమన్వయంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి హోటళ్లు, ఐస్ పాయింట్లు, పండ్ల మార్కెట్లలో తనిఖీలు చేపట్టాలన్నారు.వివిధ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న 157 ప్రభుత్వ వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న ఆహార వస్తువులు, వంటకు వినియోగించే సరుకుల నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. జిల్లాలోని చిరు వ్యాపారుల వివరాలు సేకరించి, ఆహార తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. నిబంధనలు పాటించని ఆహార వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆహారం విక్రయించే ప్రదేశాల్లో పరిశుభ్రమైన తాగునీరు, నాణ్యమైన ఆహారం వినియోగదారులకు అందేలా చూడాలని, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో ఉన్న ఆహార తయారీ కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వంట గదులు, వాష్ ఏరియాలు శుభ్రంగా ఉంచాలని, వీధి వ్యాపారులకు ఆహార భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వచ్చే సమావేశం నాటికి జిల్లాలో ఎన్ని హోటళ్లకు లైసెన్సులు ఉన్నాయో, ఏ ఏ స్థాయిలో లైసెన్సులు ఉన్నాయో పూర్తి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. అమరేందర్, ఉమ్మడి జిల్లా ఫుడ్ అధికారి ఆనంద్ రావు, డీఈఓ రమేష్ కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ రవి కుమార్, డీటీడబ్ల్యూఓ ఫిరంగి, ఫుడ్ ఇన్స్పెక్టర్లు శ్రీలత, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

# ఆహార నాణ్యతపై ఉక్కుపాదం...






# డిసెంబర్ 23న జరిగే సింగరేణి దినోత్సవ వేడుకలు నిలిపివేయెుద్దు... ఏఐటీయూసీ డిమాండ్




మంచిర్యాల **ఆకాంక్ష డిసెంబర్ 20 :** సింగరేణి కాలరీస్‌లో ప్రతి సంవత్సరం ఆనవాయితీగా జరుపుకుంటున్న డిసెంబర్ 23 సింగరేణి దినోత్సవ వేడుకలను ఈసారి నిలిపివేయకుండా కొనసాగించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ ఎండి అక్బర్ అలీ, మందమర్రి బ్రాంచి కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, బీపీఎల్ బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్‌లు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు.సింగరేణిలో ప్రతి ఏడాది డిసెంబర్ 23న సింగరేణి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం సంప్రదాయంగా కొనసాగుతున్న విషయాన్ని వారు గుర్తు చేశారు. గత సంవత్సరం వరకు అన్ని ఏరియా స్థాయిలలోనే కాకుండా కొత్తగూడెంలోని కంపెనీ ప్రధాన కార్యాలయంలో కూడా యాజమాన్యం ఈ వేడుకలను వైభవంగా నిర్వహించిందని తెలిపారు. ఈ కార్యక్రమాలు ఉద్యోగుల్లో గర్వభావాన్ని, ఐక్యతను పెంపొందించడంతో పాటు శ్రామిక శక్తిలో అనుబంధాన్ని బలపరిచి, ఉద్యోగులు%-%సంస్థ మధ్య భావోద్వేగ బంధాన్ని మరింత దృఢం చేశాయని పేర్కొన్నారు. అయితే ఇటీవల సింగరేణి దినోత్సవ వేడుకలను నిలిపివేయబోతున్నట్లు సమాచారం గుర్తింపు సంఘం దృష్టికి వచ్చిందని, ఇది ఉద్యోగుల్లో తీవ్ర నిరాశ, నిరుత్సాహానికి దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి వేడుకలు కేవలం ఉత్సవాలుగా కాకుండా, ఉద్యోగుల ప్రేరణకు, సంస్థ వృద్ధికి, వారసత్వాన్ని కాపాడటానికి శ్రామిక వర్గం చేసిన సమిష్టి కృషిని గుర్తించే ముఖ్యమైన సందర్భాలుగా ఉంటాయని వారు స్పష్టం చేశారు.అందుకే ప్రతి సంవత్సరం డిసెంబర్ 23న జరిగే సింగరేణి దినోత్సవాన్ని పునరుద్ధరించి, గతంలో మాదిరిగానే అన్ని ప్రాంతాల్లోనూ, కంపెనీ స్థాయిలోనూ వేడుకలు నిర్వహించాలని యాజమాన్యాన్ని వారు కోరారు. సింగరేణి కార్మికుల మనోధైర్యాన్ని కాపాడేలా తక్షణమే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన సుమారు 45 వేల కోట్ల రూపాయల బకాయిలను విడుదల చేయకుండా, మరోవైపు ఫుట్‌బాల్ పోటీలకు 10 కోట్ల రూపాయలు కేటాయించడం ద్వారా సంస్థను ఆర్థికంగా దివాలా దిశగా నెడుతున్నదని వారు విమర్శించారు. ఈ పరిస్థితుల్లో సింగరేణి దినోత్సవాన్ని తూతూ మంత్రంగా నిర్వహించడాన్ని ఏఐటీయూసీ గుర్తింపు సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, అలాంటి వేడుకలను బహిష్కరిస్తున్నామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో సింగరేణి కార్మిక వర్గం కూడా ఈ వేడుకలకు దూరంగా ఉండాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మందమర్రి బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ భీమనాథని సుదర్శన్, ఆర్కేపీ బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ ఇప్పకాయల లింగయ్య, మందమర్రి బ్రాంచి జాయింట్ సెక్రటరీ కంది శ్రీనివాస్, ఏరియా నాయకులు టేకుమట్ల తిరుపతి, ఎగ్గేటి రాజేశ్వరరావు, ములకలపల్లి వెంకటేశ్వర్లు, సాధన వేణి ప్రభాకర్, పిట్ కార్యదర్శులు గాండ్ల సంపత్, హరి రామకృష్ణ, కల్వల శ్రీనివాస్, ప్రేమ్ లాల్, మాదాసు వేణు, మేకల సంతు తదితరులు పాల్గొన్నారు

### విద్యార్థులు ప్రీ మెట్రిక్ ఉపకార

# వేతనాల దరఖాస్తులు సమర్పించాలి...

### జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ రావు...

పెద్దపల్లి **ఆకాంక్ష డిసెంబర్ 20 :** జనవరి 31 లోగా జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో 1వ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుకున్న దివ్యాంగ విద్యార్థులు ప్రీ-మెట్రిక్ ఉపకార వేతనాల కొరకు దరఖాస్తులు సమర్పించాలని జిల్లా సంక్షేమ అధికారి పి వేణుగోపాల్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగ విద్యార్థులు ప్రీ మెట్రిక్స్ స్కాలర్షిప్ కోసం దరఖాస్తు తో పాటు కుల ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం ,ఆదాయ ధ్రువీకరణ, పత్రం ఆధార్ కార్డు, 2 పాస్ సైజు ఫోటోలు ( అంగ వైకల్యం కనిపించినట్లు) , వైద్య ధ్రువీకరణ పత్రం, ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థులు ఆన్ లైన్ లో %ష్ట్రజా:7/వశ్రీఖఅస్త్రుఖఅఖవజూఖం.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ% ద్వారా దరఖాస్తు చేసుకొని, ఆ దరఖాస్తు ప్రింట్ తో పాఠశాల యొక్క ప్రభుత్వ గుర్తింపు పత్రం జత పరిచి జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం రూమ్ నెంబర్ 114 నందు సమర్పించాలని, ఇతర వివరముల కోసం 9440852495 ఫోన్ నెంబర్ నందు సంప్రదించాలని జిల్లా సంక్షేమ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

### యాదవ చారిటబుల్ ట్రస్ట్

# వాలంటీర్లకు కలెక్టర్ సన్మానం...



### కలెక్టర్ చేతుల మీదుగా ధృవీకరణ పత్రాలు అందజేత...

పెద్దపల్లి **ఆకాంక్ష డిసెంబర్ 20 :** పెద్దపల్లి జిల్లా ప్రధాన ఆసుపత్రిలో గత మూడు నెలల పాటు అంకిత భావంతో వాలంటీర్లుగా సేవలందించిన కే.స్వాతి, డి.సుజాత, జి.సరోజన,కె.రాజేంద్ర ప్రసాద్ లను శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శాలువా కప్పి సన్మానించారు.యాదవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పనిచేసిన ఈ వాలంటీర్లకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా వైద్య ఆరోగ్యశాఖ తరపున అనుభవ ధృవీకరణ పత్రాలను అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ యాదవ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని ప్రశంసించారు.భవిష్యత్తులో కూడా ప్రజలకు ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపయోగపడే విధంగా మరిన్ని వినూత్న కార్యక్రమాలను రూపొందించుకుని ముందుకు సాగాలని, సామాజిక సేవలో ట్రస్ట్ భాగస్వామ్యం మరింత పెరగాలని ఆకాంక్షించారు. సామాజిక సేవకు అంకితమైన ట్రస్ట్ చైర్మన్ మారం తిరుపతి యాదవ్ ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందిస్తూ,ట్రస్ట్ యొక్క భవిష్యత్తు కార్యాచరణ గురించి చర్చించారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షులు చిలారపు పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నేల-29వ తేదీ నుంచి ప్రజావాణి యధాతధం...

### మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్...



/మంచిర్యాల **ఆకాంక్ష డిసెంబర్ 20 :** 2వ సాధారణ పంచాయతీ ఎన్నికలలో గెలుపొందిన సర్పంచ్ వార్డు సభ్యులు ఈ నెల 22వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నందున అధికార యంత్రాంగం ఆయా పనులలో నిమగ్నమై ఉంటారని ఆ కారణంగానే ఈ నెల 22వ తేదీ సోమవారం రోజున జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం వాయిదా వేస్తూ ఈ నెల 29వ తేదీ నుంచి యధాతథంగా నిర్వహించడం జరుగుతుందని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు దరఖాస్తుదారులు ఆ విషయాన్ని గమనించి,సహకరించాలని కోరారు.

### కొంతమంది అధికారులు వల్ల సింగరేణి

# కీర్తి పటిష్టలు దెబ్బతింటున్నాయి...

### ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య...



/మంచిర్యాల :**ఆకాంక్ష డిసెంబర్ 20 :** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో కొంతమంది అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సంస్థకు ఏళ్ల తరబడి సంపాదించుకున్న కీర్తి ప్రతిష్టలను తీవ్రంగా దెబ్బ తీస్తున్నారని ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య తీవ్ర విమర్శలు చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, అధికారుల నిర్లక్ష్య ధోరణి, కార్మిక వ్యతిరేక నిర్ణయాలు, కొత్తగా రుద్దుతున్న నిబంధనల వల్ల రిటైర్డ్ కార్మికులు తీవ్రంగా నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సింగరేణిలో ఇప్పటివరకు ఎప్పుడూ లేని విధంగా రిటైర్డ్ అయిన కార్మికులకు లాభాల వాటా, పిఎల్ఆర్ బోనస్,దీపావళి బోనస్ చెల్లింపులకు సంబంధించి కొత్త నిబంధనలను అధికారులు తీసుకువస్తున్నారని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా రిటైర్మెంట్ అనంతరం క్వార్టర్ ఖాళీ చేయాలనే పేరుతో లాభాల వాటా, బోనస్‌లను నిలిపి వేస్తామని చెప్పడం అత్యంత విడ్డూరంగా ఉందన్నారు. గతంలో రిటైర్డ్ కార్మికుడు క్వార్టర్ ఖాళీ చేయని పక్షంలో కేవలం ఒక గ్రాట్యూటీ మాత్రమే నిలిపివేసే నిబంధన ఉండేదని, కానీ ఇప్పుడు అధికారులు కొత్త నిబంధనల పేరుతో కార్మికులను మానసికంగా వేధిస్తున్నారని తెలిపారు. సింగరేణి సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా కోట్లాది రూపాయల ఆదాయం అందుతున్నప్పటికీ, అదే సంస్థకు విద్యుత్ సంస్థల నుంచి రావాల్సిన 40 వేల కోట్ల రూపాయలకు పైగా బకాయిలను వసూలు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని వాసిరెడ్డి సీతారామయ్య విమర్శించారు. సంస్థకు రావాల్సిన నిధులను రాబట్టడంలో అలసత్వం ప్రదర్శిస్తూ కార్మికుల హక్కులపై మాత్రం కఠినంగా వ్యవహరించడం అన్యాయమన్నారు. ఇక మరోవైపు సింగరేణి సంస్థ లేని జిల్లాల్లో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ, సంస్థ ప్రధాన కేంద్రాల్లో మాత్రం నిధుల కొరత ఉందని చెప్పడం వెనుక దురుద్దేశం స్పష్టంగా కనిపిస్తోందని ఆయన అన్నారు.సంప్రదాయంగా సింగరేణి కార్మికులు ప్రతి సంవత్సరం కుటుంబ సభ్యులతో కలిసి తమ తమ ఏరియాల్లో సింగరేణి అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకుంటారని గుర్తు చేశారు. కానీ ఈ సంవత్సరం మాత్రం సంస్థ వద్ద పైసలు లేవన్న నెపంతో, ఏరియా జీఎం కార్యాలయాల్లో మాత్రమే అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించాలని చెప్పి, కావాలనే తక్కువ బడ్జెట్ కేటాయించారని ఆరోపించారు.ఇలా చేయడం ద్వారా కార్మికుల్లో అసంతృప్తి, ఆగ్రహం పెంచే ప్రయత్నం కొంతమంది అధికారులు చేస్తున్నారని, ఇది పూర్తిగా కార్మిక వ్యతిరేక విధానమని ఏఐటీయూసీ పేర్కొంది. సింగరేణి సంస్థ భవిష్యత్తును నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతోనే ఈ విధమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఇది సంస్థకే ప్రమాదకరమని హెచ్చరించారు. కార్మికుల ఐక్యతను దెబ్బ తీయాలనే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని స్పష్టం చేశారు.రిటైర్డ్ కార్మికులు సింగరేణి అభివృద్ధికి తమ జీవితాలను అంకితం చేశారని, అలాంటి వారిని అవమానించేలా తీసుకుంటున్న నిర్ణయాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. లేకపోతే భవిష్యత్తులో అధికారులు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ ఎప్పటికీ ముందుంటుందని, అవసరమైతే ఉద్యమాలకు కూడా సిద్ధమని వాసిరెడ్డి సీతారామయ్య స్పష్టం చేశారు.

## ఏనుగులను ఢీకొట్టి పట్టాలు తప్పిన రాజధాని ఎక్స్‌ప్రెస్

వేగంగా వెళ్తున్న రైలు.. ఏనుగులను ఢీకొట్టడంతో పట్టాలు తప్పింది. ఈ షాకింగ్ ఘటన అస్సాంలోని లుమ్డింగ్ డివిజన్ పరిధిలో చోటు చేసుకొని తృటిలో భారీ రైలు ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. శనివారం తెల్లవారుజామున సుమారు 2:17 గంటల సమయంలో జమునాముఖ్ - కాంపూర్ సెక్షన్ మధ్య సైరాంగ్ - న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నెం. 20507) పట్టాలపై ఉన్న ఏనుగుల మందను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రైలు ఇంజిన్‌తో పాటు ఐదు కోచ్‌లు పట్టాలు తప్పాయి. అయితే, అదృష్టవశాత్తూ ప్రయాణికులు ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని, అందరూ క్షేమంగా ఉన్నారని ఈశాన్య సరిహద్దు రైల్వేచీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ కపింజల్ కిషోర్ శర్మ ధృవీకరించారు. ప్రమాదం జరిగిన వెంటనే నార్త్ ఈస్ట్ ఫ్రాంటియర్ రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. డివిజనల్ ప్రధాన కార్యాలయం నుండి ఉన్నతాధికారుల బృందం, ప్రమాద సహాయక రైళ్లు ఇప్పటికే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. పట్టాలు తప్పిన బోగీలను తొలగించి, రైల్వే ట్రాక్‌ను పునరుద్ధరించే పనులు యుద్ధప్రతిపాదికన జరుగుతున్నాయి. ఈ ప్రమాదంలో మొత్తం 8 ఏనుగుల మృతిచెందినట్లు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ ఘటన కారణంగా ఆ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది

## ఘనంగా న్యూట్రిషన్ ఫుడ్ పోషణ ఆహారోత్సవ కార్యక్రమం...



/మంథని :ఆకాంక్ష డిసెంబర్ 20 : మంథని మండలంలోని ఆరెంద జడ్.పి.హెచ్.ఎస్ లో కాంప్లెక్స్ హెచ్ఎం నరసింహారావు ఆధ్వర్యంలో న్యూట్రిషన్ ఫుడ్ పోషణ ఆహారోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 55 మంది విద్యార్థులు చురుకుగా పాల్గొని, వివిధ రకాల పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను తయారు చేసి ప్రదర్శించారు. ఆయా ఆహార పదార్థాల్లో ఉండే పోషక విలువలు, వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను విద్యార్థులే స్వయంగా వివరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెచ్ఎం నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం పౌష్టికాహారాన్ని తీసుకోవడంతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా మెరుగు పడుతుందని తెలిపారు. చిన్నప్పటి నుంచే పౌష్టికాహారంపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని, దీని ద్వారా విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన అలవాట్లు పెరుగుతాయన్నారు. స్థానికంగా లభించే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలను ఆహారంలో భాగంగా చేసుకుంటే తక్కువ ఖర్చుతో పోషణ మెరుగుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా తల్లిదండ్రులకు కూడా పిల్లల పోషణపై అవగాహన కలిగించడమే లక్ష్యమని నరసింహారావు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తాము తయారు చేసిన ఆహార పదార్థాల వివరాలను పాఠశాల కమిటీ చైర్మన్ ప్రేమ లతకు, అలాగే తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీలత, సువార్త, పద్మజ, మమత, సి.ఆర్.పీ మల్లన్న తదితరులు పాల్గొన్నారు


## గణిత ప్రతిభ పాటవ పోటీలో
## ప్రతిభ చూపిన విద్యార్థులు...



మంథని రూరల్ ఆకాంక్ష డిసెంబర్ 20 : జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి, తెలంగాణ గణిత ఫోరం ఆదేశాల మేరకు మంథని మండలంలో గణిత ప్రతిభ పాటవ పోటీలు నిర్వహించారు. డిసెంబర్ 20, 2025 న మంథని మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 10వ తరగతి విద్యార్థులతో ఈ పోటీలు మంథని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికలు)ప్రాంగణంలో ఉత్సాహంగా జరిగాయి. ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థుల చొప్పున పాల్గొనగా మొత్తం 14 మంది విద్యార్థులు తమ గణిత ప్రతిభను ప్రదర్శించారు.ఇంగ్లీష్ మీడియం నాన్ రెసిడెన్షియల్ విభాగంలో జిల్లా పరిషత్ గర్ల్స్ హై స్కూల్ మంథనికి చెందిన ఎన్. పరమేష్ మొదటి బహుమతిని కైవసం చేసుకోగా, అదే పాఠశాలకు చెందిన ఎం. జోత్స్న రెండవ బహుమతి సాధించారు. జెడ్పి హెచ్ఎస్ బాయ్స్ మంథనికి చెందిన ఎన్. ధనుష్ తృతీయ బహుమతిని పొందారు. రెసిడెన్షియల్ విభాగంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ బాయ్స్ మంథనికి చెందిన కె. సాయి వినయ్ ప్రథమ బహుమతి సాధించగా, తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ గర్ల్స్ మంథనికి చెందిన శ్రీ వల్లి రెండవ బహుమతి, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ బాయ్స్ మంథనికి చెందిన ఆర్. విశాల్ తృతీయ బహుమతిని గెలుచుకున్నారు.ఈకార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి ఎస్. సుమలతతో పాటు వివిధ పాఠశాలల గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తెలంగాణ గణిత ఫోరం మండల శాఖ బాధ్యులు ఎన్. పరంజ్యోతి, ఎస్. శ్రీనివాస్ పర్యవేక్షణ నిర్వహించగా పరిశీలకులుగా శ్రీ జి. భరత్ రెడ్డి హాజరయ్యారు. విజేతలైన విద్యార్థులకు మెడల్స్ మరియు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు సుమలత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు గణితంలో ప్రతిభ చాటుతూ మండల స్థాయి నుంచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని తెలిపారు. కార్యక్రమం అనంతరం ఉపాధ్యాయులు విజేతలను అభినందిస్తూ వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## మానేరు పై బ్రిడ్జి నిర్మాణానికి
## రూ.203 కోట్ల నిధులు మంజూరు



GOVERNMENT OF TELANGANA
ABSTRACT

T, R&B Department – " Construction of High Level Bridge across Manair River in between Arenda to Damerakunta in Manthani (M), Peddapalli District" - Administrative Sanction - Accorded - Orders - Issued.

TRANSPORT, ROADS & BUILDINGS (R.II) DEPARTMENT

G.O.Rt.No.:581 Dated: 19.12.2025
Read:

From the Chief Engineer (R&B) SR, Hyderabad, Lr.No. 2044/CE/SR & CRN/ SE (D&P)-II /EE-III/DEE-II/AEE/2024-25, Dt.20.08.2025

ORDER:

In the circumstances reported by the Chief Engineer(R&B), State Roads & CRN, Hyderabad in the letter read above Government, after careful examination of the matter hereby accord Administrative sanction for the work "Construction of High Level Bridge across Manair river in between Arenda to Damerakunta in Manthani (M), Peddapalli District" for Rs.203.00 Crores ( Rupees Two Hundred and Three Crores) under PLAN Scheme Head of Account "5054-04-MH337-GH25-SH(07)-530-531" duly allotting additional budget during the financial year 2025-26.

2. The I/c.Engineer-in-Chief (R&B), State Roads, Hyderabad, shall take further action in the matter accordingly.

3. This order issues with the concurrence of Finance (EBS.X) Department vide their U.O.No.3309654/482/A1/EBS.X/2025, Dated 23-10-2025.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

VIKAS RAJ
SPECIAL CHIEF SECRETARY TO GOVERNMENT

To
The I/c. Engineer-in-Chief (R&B), State Roads, Hyderabad.
Copy to:
The Director of Works & Accounts, Telangana, Hyderabad.
The Finance (EBS-X) Department.
The P.S to Minister for R&B.
The PS to Spl. Chief Secretary to Govt., TR&B Department.
SC/SF.

// Forwarded By Order //

SECTION OFFICER


మంథని ఆకాంక్ష డిసెంబర్ 20 : మంథని మండలం మానేరు నదిపై ఆరెంద మీదుగా దామెరకుంట వరకు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి, అలాగే ఆరెంద, మల్లారం, వెంకటాపూర్ నుంచి బ్రిడ్జి వరకు మరియు దామెరకుంట రోడ్డుకు అనుసంధానంగా 9.530 మీటర్ల వెడల్పుతో అప్రోచ్ రోడ్డు కమ్ రోడ్డు నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్ అండ్ బి శాఖ ద్వారా రూ.203 కోట్ల నిధులను మంజూరు చేసింది. తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు ఈ నిధులు మంజూరైనట్లు మంత్రి క్యాంప్ కార్యాలయం మంథని నుంచి వెల్లడించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 1.120 మీటర్ల పొడవు, 13 మీటర్ల వెడల్పుతో హై లెవెల్ బ్రిడ్జి నిర్మించనున్నారు.ఈ బ్రిడ్జి నిర్మాణంతో పెద్దపల్లి జిల్లా మంథని మండల ప్రజలతో పాటు పరిసర మండలాల ప్రజలు మానేరు నది దాటి ఇతర జిల్లాలకు, మహారాష్ట్రకు, కాళేశ్వరం దేవాలయానికి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కాటారం తదితర ప్రాంతాలకు సులభంగా ప్రయాణించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. ముఖ్యంగా కాళేశ్వరం వెళ్లే దూరం సుమారు 25 కిలోమీటర్ల వరకు తగ్గనుందని, దీంతో కాళేశ్వరం టూరిజం అభివృద్ధికి కూడా దోహద పడుతుందని పేర్కొన్నారు.ఈ ప్రాజెక్టు ద్వారా ఆరెంద, మల్లారం, వెంకటాపూర్, దామెరకుంట గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగు పడటంతో పాటు వైద్య, విద్యా అవసరాలకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అలాగే పెద్దపల్లి జిల్లా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మధ్య కనెక్టివిటీ మరింత పెరుగుతుందని వెల్లడించారు. మానేరు పై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.203 కోట్ల నిధులు మంజూరు చేసిన మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకు పెద్దపల్లి జిల్లా ప్రజలు, మంథని మండల ప్రజలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రజలు, ఆరెంద, మల్లారం, వెంకటాపూర్, దామెరకుంట గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

## జీపీ ఎన్నికల విజయవంతంపై
## ఇంచార్జి కలెక్టర్ కు శుభాకాంక్షలు...

### మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీడీఓలు, జిల్లా పంచాయతీ కార్యాలయం సిబ్బంది...

రాజన్న సిరిసిల్ల **ఆకాంక్ష డిసెంబర్ 20:** గ్రామ పంచాయతీ ఎన్నికలు జిల్లాలో విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు ఎంపీడీఓలు, జిల్లా పంచాయతీ కార్యాలయం సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ను శనివారం ఎంపీడీఓలు, జిల్లా పంచాయతీ కార్యాలయాల అధికారులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# క్రానిక్ స్ట్రెస్.. గుండెకు రిస్క్..! ఇలా చేస్తే మీ గుండె సేఫ్!!



ఉరుకులూ పరుగుల జీవితంలో ప్రస్తుతం చాలా మంది ఒత్తిడికి గురవుతున్నారు. ఇండియా ఫిట్ రిపోర్ట్ ప్రకారం 2023 నాటికి మన దేశంలో ఏటా 24 శాతం మంది ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. రోజువారీ పని విధానం, ఆర్థిక పరమైన సమస్యలే ఇందుకు ప్రధాన కారణంగా ఉంటున్నాయి. స్ట్రెస్ సహజమే అయినప్పటికీ దీర్ఘకాలికంగా కొనసాగితే మాత్రం గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. కాబట్టి దాని నుంచి బయటపడాలంటున్నారు ఆరోగ్య నిపుణులు. అందుకోసం ఉపయోగపడే కొన్ని టెక్నిక్స్ ఏమిటో ఇప్పుడు చూద్దాం.

### సెల్ఫ్‌కేర్ ముఖ్యం

చాలా మంది పని ఒత్తిడి, వివిధ సమస్యలతో సఫర్ అయ్యే క్రమంలో తమను తాము నిర్లక్ష్యం చేస్తుంటారు. ఈ పరిస్థితి క్రమంగా మానసిక, శారీరక అనారోగ్యాలకు దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు అధిక ఒత్తిడి గుండెపై ప్రభావం చూపడంవల్ల బ్లడ్ ప్రెజర్, గుండె జబ్బులు వంటివి డెవలప్ కావడానికి కూడా దారితీస్తుంది. అందుకే మీరు ఎంత బిజీగా ఉన్నా.. స్వీయ సంరక్షణపై దృష్టి పెట్టాలి. ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా చేయగలరని గుర్తుంచుకోండి.

### ఫిజికల్ యాక్టివిటీస్

ఒత్తిడి నుంచి రిలీఫ్ కావడంలో ఫిజికల్ యాక్టివిటీస్ అద్భుతంగా పనిచేస్తాయి. సో.. డైలీ వాకింగ్, జాగింగ్, సైక్లింగ్, స్విమ్మింగ్, ఏరోబిక్స్ వంటివి చేస్తూ ఉండాలి. ఇవన్నీ గుండెపై ఒత్తిడిని తగ్గిస్తాయి. నిజానికి ఒత్తిడిలో ఉన్నప్పుడు కార్టిసాల్ హార్మోన్ రిలీజ్ అయి మిమ్మల్ని అనారోగ్యానికి గురి చేస్తుంది. రోజూ వ్యాయామాలు చేయడంవల్ల దీనికి చెక్ పెట్టవచ్చు. ఎందుకంటే ఫిజికల్ యాక్టివిటీస్ మెదడులో ఎండార్ఫిన్‌ల విడుదలను ప్రేరేపించడంవల్ల మీలో ఒత్తిడిని పూర్తిగా తగ్గిస్తాయి. అందుకే వ్యాయామాలకు సమయం కేటాయించండి. కనీసం రోజూ 150 నిమిషాలైనా ఫిజికల్ యాక్టివిటీస్‌లో పాల్గొనాలంటున్నారు నిపుణులు.

### సమతుల్య ఆహారంతో చెక్

గుండెపై ఒత్తిడి ప్రభావాన్ని తగ్గించడంలో సమతుల్య ఆహారం కూడా కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి మీ రోజువారీ డైట్‌లో తాజా కూరగాయలు, పాలు, పండ్లు, తృణ ధాన్యాలు, లీన్ ప్రోటీన్స్ వంటివి ఉండేలా చూసుకోండి. ప్రాసెస్డ్ ఫుడ్స్, జంక్ ఫుడ్స్, హై షుగరింగ్ స్నాక్స్ వంటివి తీసుకోవడం మానుకోవాలి. దీంతో మీ గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

### పీస్‌ఫుల్ మైండ్

మనసు ప్రశాంతంగా ఉంటే చాలా వరకు అనారోగ్యాలు దూరం అవుతాయని నిపుణులు చెబుతుంటారు. అందుకే మైండ్ ఫుల్ నెస్, రిలాక్సేషన్ టెక్నిక్స్ ఫాలో అవ్వాలంటున్నారు నిపుణులు. దీనివల్ల ఒత్తిడి తగ్గుతుంది. గుండె జబ్బులను తగ్గించడంలో సహాయపడుతుంది. బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌లు, మెడిటేషన్, యోగా, ఇతర వ్యాయామాలు ఇందుకు దోహదం చేస్తాయి.

### కుటుంబంతో గడపండి

కుటుంబ సభ్యులతో లేదా ఎప్పుడూ మీకు ఎమోషనల్ సపోర్ట్‌గా నిలిచే నమ్మకమైన వ్యక్తితో మాట్లాడటంవల్ల మీలోని దీర్ఘకాలిక ఒత్తిడి చాలా వరకు దూరం అవుతుందని మానసిక నిపుణులు చెబుతున్నారు. అధ్యయనాలు కూడా అదే పేర్కొంటున్నాయి. మీరు ఎదుర్కొంటున్న సమస్యను ఫ్యామిలీ మెంబర్స్‌తో, మీ ప్రియమైన వారితో షేర్ చేసుకోవడం వల్ల ఒత్తిడి నుంచి ఉపశమనం పొందుతారు. అంతేకాకుండా సానుభూతి, ఎమోషనల్ సపోర్ట్ లభించడంవల్ల మైండ్ రిలాక్స్ అవుతుంది. వీటన్నింటితో పాటు మిమ్మల్ని ఒత్తిడికి గురిచేసే పరిస్థితులను నివారించడానికి హెల్తీ లైఫ్ స్టైల్, హెల్తీ డైట్ మెయింటైన్ చేయడం మర్చిపోవద్దు అంటున్నారు నిపుణులు.

**గమనిక :**

పైవార్తలోని సమాచారం ఇంటర్నెట్ ఆధారంగా పలు హెల్త్ జర్నల్స్ నుంచి సేకరించబడింది. వైద్య నిపుణుల ప్రత్యక్ష సలహాలకు ప్రత్యామ్నాయం కాదు. అనుమానాలు ఉంటే నిపుణులను సంప్రదించగలరు.

# ఈసారైనా సంతోషంగా ఉందామా!!




మంచో చెడో, సుఖమో దుఃఖమో, బాధలో, భావోద్వేగాలో, సంతోషాలో, సంబురాలో.. ఏవైతేనేం.. చూస్తుండగానే ఏడాది గడిపోయింది. మరో పది రోజుల్లో కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టబోతున్నాం. ఈ నేపథ్యంలో ప్రతీ ఒక్కరి మనసులో గత అనుభవాల తాలూకు ఆలోచనలు మెదులుతున్నాయి. మధుర జ్ఞాపకాలో, చేదు అనుభవాలో ప్రతీ హృదయాన్ని తట్టి లేపుతున్నాయి. జరిగిందేదో జరిగింది. అది మంచైనా, చెడైనా గడిచిందంతా ఇక గతమే.. కాబట్టి వర్తమానంలో సరైన ప్రణాళికతో ముందుకెళదాం. వచ్చే ఏడాదంతా సంతోషంగా ఉందాం.. అనే లక్ష్యం వైపు అడుగేస్తోంది ఆధునిక యువత. యువతే కాదు పిల్లలు, పెద్దలు ప్రతీ ఒక్కరి ఫైనల్ డెసిషన్ ఒక్కటే. ఏంటంటే వచ్చే ఏడాదంతా హ్యాపీగా ఉండటమే. అయితే అలా అనుకున్నంత మాత్రాన సంతోషంగా ఉండలేరు. అది మీరు క్రియేట్ చేసుకోవాల్సిన విషయం అంటున్నారు నిపుణులు. అదెలాగో చూద్దాం పదండి!

### ఫీలయ్యే తీరును బట్టే..

హ్యాపీనెస్ అంటే.. కేవలం మనకు ఇష్టమైన అనుభవం మాత్రమే కానవసరం లేదు. దు:ఖం, సుఖం అనేవి ఏ మాత్రం కాదు. అదొక న్యూట్రల్ ఎక్స్‌పీరియన్స్ అంటున్నారు నిపుణులు. మనిషి ఏం చేసినా సరే.. చివరిగా కోరుకునేది జీవితంలో సంతోషంగా ఉండడం మాత్రమే. అయితే ఆ సంతోషమనేది కేవలం ఆస్తి, అంతస్తులు, హోదా, విలాసవంతమైన జీవితం ద్వారా మాత్రమే లభిస్తుందనుకుంటే తప్పులో కాలేసినట్టే. ఇవన్నీ ఉన్నంత మాత్రానా సంతోషంగా ఉంటారనడానికి లేదు. ఎందుకంటే.. రియల్ హ్యాపీనెస్ అనేది మనలోనే, మన మనసులోనే, మనం ఫీలయ్యే విధానంలోనే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. సంతోషంగా జీవించేవారి జీవిత అనుభవం కూడా ఇదే కదా చెబుతున్నది!

### వెతికితే దొరకదు!

అనుకున్నంత మాత్రానా అన్నీ జరిగిపోవు. అనుకోలేదని కూడా అన్నీ ఆగిపోవు. కాబట్టి ఒడిదుడుకులు సహజం. కాబట్టి ఏం జరిగినా స్వీకరించేలా సిద్ధంగా ఉండాలంటారు నిపుణులు. ఎందుకంటే.. కాలం మన కోసం ఆగదు. మన చేతిలోనూ ఉండదు. పరిస్థితులు ఎప్పటికప్పుడు మారుతూనే ఉంటాయి. ఏమీ లేకపోయినా సంతోషంగా ఉండాలనే సంకల్పం మీలో ఉంటే నిజంగానే మీరు సంతోషంగా ఉండగలుగుతారు. అలాగే విజయం సంతోషాన్ని ఇస్తుందని, ఓటమి బాధను ఇస్తుందని కూడా ఎప్పుడూ అనుకోకూడదు. గెలుపు సంతోషాన్ని ఇస్తుందని అనుకుంటే.. ఓటమి ఎదురైనప్పుడు బాధపడుతుంటారు. అందుకే ఎప్పుడూ కూడా సంతోషాన్ని బయట వెతుక్కోకూడదు. అది మీ హృదయాంతరాల్లో ఉంటుంది. మీరు భావించే దానిని బట్టి టుంటుంది. అందుకే సంతోషాన్ని వెతుక్కునే పనిలో పడి మీ లక్ష్యాన్ని వదులుకోకండి. దానిని చేరుకోవాలనే కృషి, పట్టుదల కూడా మీలో సంతోషాన్ని నింపుతాయి. అలాగే ఓటమి ఎదురైనప్పుడు దానిని అధిగమించే ప్రయత్నం కూడా సంతోషాన్నిస్తుంది.

### అంతా మన చేతుల్లోనే..

నిజమైన సంతోషమంటే..ప్రశాంతమైన మనసే అని నిపుణులు చెబుతుంటారు. కొందరు తమకు ఆస్తులు లేకున్నా, అవసరమైన వనరులు లేకున్నా, ఇతరులతో పోల్చుకున్నప్పుడు తక్కువ సౌకర్యాలున్నా సరే సంతోషంగా ఉంటారు.. ఎప్పుడూ చిరునవ్వు చిందిస్తుంటారు. ఇది కదా నిజమైన సంతోషమంటే.. ఇలాంటి వారు ఓటమికి భయపడరు. పైగా ఓటమిని కూడా చిరునవ్వుతో స్వీకరిస్తారు. అంటే ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సిన విషయం ఏమిటంటే.. సంతోషంగా ఉండాలనేది పూర్తిగా వ్యక్తిగత భావన, వ్యక్తిగత నిర్ణయం దానిని ఇతరులు ఇవ్వలేరు. మన నుంచి లాక్కోలేరు కూడా. ఎందుకంటే ఇబ్బందులు వచ్చినప్పుడు కుంగిపోవాలా.. చిరునవ్వుతో వాటిని ఎదుర్కొవాలా అనేది ఎవరు డిసైడ్ చేసినా ఫైనల్‌గా ఏం చేయాలనేది మన చేతుల్లోనే ఉంటుంది. కోపం, బాధ, జెలసీ, ఓవర్ థింకింగ్, పగ, ప్రతీకారం, దురలవాట్లు వంటివి మానసిక, శారీరక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. పైగా జీవితంలో సంతోషాన్ని దూరం చేస్తాయి. మన కోసం మనం కాకుండా ఇతరుల గురించి ఆలోచించడంలోనే జీవితం వృథా అవుతుంది. కాబట్టి సంతోషంగా ఉండాలంటే వాటిని వదిలేయండి. నిజాయితీగా, క్రమశిక్షణగా మెలగండి. ఎవరు ఏమనుకున్నా మంచి వైపు అడుగేయండి. రాబోయే సంవత్సరంలో నిజంగా మీరు సంతోషంగా ఉండాలనుకుంటే.. ఏం చేయాలోనని బుర్రపాడు చేసుకోకండి. ప్రస్తుతం ఉన్న వాటిని అనుభవిస్తూ ముందుకు సాగితే చాలు. ఎందుకంటే సంతోషమనేది బజార్లో దొరికే వస్తువు కాదు. ఎవరో మనకు ఇచ్చేది కాదు. అది కేవలం మనం ఫీలయ్యే దానిని బట్టి మాత్రమే ఉంటుంది. కాబట్టి మీరు తల్చుకుంటే ప్రతీక్షణాన్ని సంతోషకరమైనదిగా క్రియేట్ చేసుకోవచ్చు అంటున్నారు నిపుణులు. ఇంకెందుకాలస్యం కొత్త సంవత్సరంలోనూ అదే చేయండి!

# ఆత్మసాక్షాత్కారానికి క్రియాయోగమే ప్రాథమిక మార్గం.. ప్రపంచ ధ్యాన దినోత్సవం

ప్రతి ఏడాది డిసెంబర్ 21వ తేదీని ప్రపంచ ధ్యాన దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి ప్రకటించినప్పటి నుంచి ప్రపంచవ్యాప్తంగా ధ్యానంపై ఆసక్తి గణనీయంగా పెరిగింది. ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళనలకు ధ్యానం ఒక శాశ్వత పరిష్కార మార్గంగా మారుతోంది. ధ్యానాన్ని భగవంతుడిని చేరే ఆధ్యాత్మిక మార్గంగా ఆధ్యాత్మిక వేత్తలు నిర్వచిస్తుంటారు. రోజూ కొద్దిసేపైనా ధ్యానానికి కేటాయించడం ద్వారా మనస్సు ప్రశాంతత, శారీరక ఆరోగ్యం, మానసిక సమతుల్యత స్పష్టంగా మెరుగుపడుతాయని నిపుణులు చెబుతున్నారు. పశ్చిమ దేశాల్లో 'యోగ పితామహుడు'గా పేరొందిన, ప్రపంచ ప్రసిద్ధ గ్రంథం 'ఒక యోగి ఆత్మకథ' రచయిత పరమహంస యోగానంద, ధ్యానం మానవ జీవితానికి అత్యంత కీలకమని స్పష్టంగా పేర్కొన్నారు. ముఖ్యంగా క్రియాయోగం వంటి శాస్త్రీయ ధ్యాన పద్ధతిని అనుసరించడం ద్వారా ఉన్నత ఆత్మతో అనుసంధానం సాధ్యమవుతుందని ఆయన వివరించారు. క్రియాయోగం ఒక సమగ్ర, వైజ్ఞానిక, సర్వవ్యాప్త ధ్యాన మార్గం. దీనిని క్రమం తప్పకుండా ఆచరించడం వల్ల సంపూర్ణ మానసిక శాంతి సాధ్యమవడమే కాకుండా, శరీరం-మనస్సు-ఆత్మలకు అవసరమైన పునరుజ్జీవనం లభిస్తుందని ధ్యాన గురువులు చెబుతున్నారు. 'యోగ' అనే పదం భగవంతునితో ఐక్యాన్ని సూచిస్తుందని, ఆ యోగ మార్గంలో ధ్యానం అంతర్భాగమని ఆధ్యాత్మికులు గుర్తుచేస్తున్నారు. పరమహంస యోగానంద 1917లో స్థాపించిన యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా (వైఎస్ఎస్) క్రియాయోగ బోధనలను ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తి చేస్తోంది. ఈ బోధనలు ఆత్మసాక్షాత్కారం అనే ఉన్నత లక్ష్యాన్ని సాధించేందుకు గాఢమైన ధ్యానానికి ప్రాధాన్యత ఇస్తాయి. 'భక్తితో కూడిన క్రియాయోగ ధ్యానం ఇతర అన్ని ఆధ్యాత్మిక సాధనల కంటే ఉన్నతమైనది. అది అంతిమ లక్ష్యాన్ని ఖచ్చితంగా చేరుస్తుంది'

## ఆదిలాబాద్ జిల్లా చిన్న బుగ్గారం గ్రామంలో ఎన్నికల ఉద్రిక్తత...

### రోడ్డు మూసివేసిన కాంగ్రెస్ అభ్యర్థి కుటుంబం...
### పోలీసులపై రాళ్ల దాడి ఎస్సై, కానిస్టేబుళ్లకు గాయాలు...



ఆదిలాబాద్ **ఆకాంక్ష డిసెంబర్ 20:** ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం చిన్న బుగ్గారం గ్రామంలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలు తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీశాయి. సర్పంచ్ ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేకపోయిన కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి చంద్రకళ కుటుంబసభ్యులు గ్రామంలో రోడ్డు అడ్డంగా ఎడ్ల బండిని పెట్టి రాకపోకలను నిలిపివేశారు. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చంద్రకళపై బీఆర్ఎస్ అభ్యర్థి ఉజ్వల జాదవ్ విజయం సాధించారు. ఈ ఫలితాలను వ్యతిరేకిస్తూ చంద్రకళ కుటుంబసభ్యులు తమను కావాలనే ఓడించారని ఆరోపిస్తూ ఇంటి ముందే దారి అడ్డంగా ఎడ్ల బండిని నిలిపి రోడ్డు మూసివేశారు. అటు వైపు నుంచి ఎవరూ వెళ్లకూడదంటూ గ్రామంలో తామే నిర్ణయం తీసుకున్నట్లు ప్రవర్తించారు.ఈ విషయాన్ని గమనించిన గ్రామస్తులు



పోలీసులకు సమాచారం అందించారు.వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. రోడ్డు మీద అడ్డుగా పెట్టిన ఎడ్ల బండిని పక్కకు తీసేందుకు ప్రయత్నించగా, ఆ సమయంలో చంద్రకళ కుటుంబసభ్యులు తీవ్ర ఆగ్రహంతో పోలీసులపై రాళ్లతో దాడి చేశారు.ఈ దాడిలో విధులు నిర్వహిస్తున్న ఎస్సైతో పాటు పలువురు కానిస్టేబుళ్లు గాయపడినట్లు సమాచారం. పరిస్థితి చేయి దాటకుండా అదనపు బలగాలను రంగంలోకి దింపిన పోలీసులు గ్రామంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఘటనకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.ఎన్నికల ఫలితాల అనంతరం ఇలాంటి హింసాత్మక చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారు.

## సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం ఏరియా కమిటీ ఎన్నికలు...




మంచిర్యాల **ఆకాంక్ష డిసెంబర్ 20:** సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం మందమర్రి ఏరియా నూతన కమిటీ ఎన్నికలు ఈ నెల 21వ తేదీ ఆదివారం నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు మందమర్రి ఏరియాలోని స్థానిక సీఈఆర్ క్లబ్‌లో ఎన్నికల ప్రక్రియ జరగనుందని బ్రాంచి ప్రధాన కార్యదర్శి ఆంగోతు రవి నాయక్, సెంట్రల్ కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు వాంకుడోత్ శివ, సెంట్రల్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ జరుపుల ప్రేమ్ లాల్ ఒక ప్రకటనలో వెల్లడించారు.ఈ ఎన్నికల కార్యక్రమానికి సెంట్రల్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గోళ్ల రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్య కృష్ణమూర్తి, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సాయి పవన్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బొర్రా రాంబాబు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. గిరిజన ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల అమలు, సమస్యల పరిష్కారంలో సంఘం కీలక పాత్ర పోషిస్తోందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.మందమర్రి ఏరియాలో పనిచేస్తున్న ప్రతి సింగరేణి గిరిజన ఉద్యోగి తప్పనిసరిగా ఈ ఎన్నికల సమావేశానికి హాజరుకావాలని, అదేవిధంగా మందమర్రి చుట్టుపక్కల ఉన్న గోదావరిఖని, భూపాలపల్లి, శ్రీరాంపూర్, బెల్లంపల్లి ఏరియాల నుంచి కూడా గిరిజన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఆంగోతు రవి నాయక్ (ఏరియా ప్రధాన కార్యదర్శి), వాంకుడోత్ శివ (సెంట్రల్ కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు), జరుపుల ప్రేమ్ లాల్ (సెంట్రల్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ) పాల్గొని ఎన్నికల నిర్వహణపై వివరాలు వెల్లడించారు.

# మహిళల్లో మానసిక వేదనలు.. ఓపెన్‌గా ఎందుకు మాట్లాడలేరంటే..

ఒకే సమస్య.. కానీ ఒకరు ఓపెన్‌గా మాట్లాడతారు. మరొకరు మాట్లాడలేకపోతారు. కారణం సామాజిక అంచనాలు, అవగాహనా రాహిత్యం, పరిస్థితుల ప్రభావం ఇందులో కీ రోల్ పోషిస్తాయి. కొన్ని అంశాల్లో స్త్రీ, పురుషుల విషయానికి వస్తే ఈ ఆధునిక కాలంలోనూ అదే జరుగుతోందని నిపుణులు అంటున్నారు. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు స్త్రీ, పురుషుల సమానత్వ భావనకు సంబంధించి సానుకూల మార్పులు చాలానే వచ్చాయి. మహిళలు అనేక రంగాల్లో దూసుకుపోతున్నారు. ఇష్టమైన కెరీర్‌లో ప్రవేశించడానికి, నచ్చిన విధంగా జీవించడానికి రాజ్యాంగపరమైన హక్కులను కూడా కలిగి ఉన్నారు. అయినప్పటికీ పురుషాధిక్య భావజాలమే ఏదో ఒక రూపంలో నేటికీ డామినేట్ చేస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదంటున్నారు స్త్రీ వాదులు. ఇలాంటి పరిస్థితులే నేటికీ కొన్ని విషయాల్లో మహిళలు ఓపెన్‌గా మాట్లాడే పరిస్థితికి కారణం అవుతున్నాయి. ముఖ్యంగా మెంటల్ హెల్త్ విషయంలో మహిళలు పూర్తి నిర్లక్ష్యానికి గురవుతున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. బయటకు చెప్పలేని పరిస్థితులు మహిళల రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేసే అంశాల్లో మానసిక ఆరోగ్యం ఒకటి. ఇప్పటికీ విదేశాలతో పోలిస్తే ఇండియాలో స్త్రీల మనోభావాలు, మనసులో మాటలు, మానసిక ఆరోగ్యం వంటి విషయాలు అంత ప్రయారిటీ గల అంశంగా పరగణించని వారే చాలా మంది ఉంటున్నారు. పురుషులు తమ ఫిజికల్ అండ్ మెంటల్ హెల్త్ గురించి మాట్లాడినంత, ఓపెన్‌గా స్త్రీలు మాట్లాడుకునే పరిస్థితి కుటుంబాల్లో ఇప్పటికీ లేదు. ఎందుకంటే మహిళలు ఏది చెప్పినా తప్పుగా అర్థం చేసుకునే పురుషాధిక్య భావజాలమే అధికం కాబట్టి. ముఖ్యంగా ప్రేమ, కోరికలు, రుతుస్రావం, ఇష్టాయిష్టాలు, సెక్స్ వంటి విషయాలైతే ఇప్పటికీ వాటిని స్త్రీలు లేదా అమ్మాయిలు బయటకు మాట్లాడకూడనివిగా భావిస్తుంటారు చాలా మంది. దీంతో ఇలాంటి విషయాల్లో సమస్యలు వచ్చినా, సందేహాలు ఏర్పడినా బయటకు చెప్పుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలు ఇప్పటికీ ఉంటున్నారు. తమ సమస్యను చెబితే ఇతరులు ఏమనుకుంటారోననే ఫీలింగ్ ఆధునిక మహిళలను సైతం వెంటాడుతోంది. ఒత్తిడి, ఆందోళనలతో సతమతం ఒత్తిడి, డిప్రెషన్, యాంగ్జైటీ, ఈటింగ్ డిజార్డర్ వంటివి ప్రపంచ వ్యాప్తంగా స్త్రీ, పురుషులందరూ ఎదుర్కొనే కామన్ సమస్యలే. అయితే పురుషులు వీటిని ఎదుర్కొంటున్నప్పుడు అవి కుటుంబాల్లో చర్మనీయాంశం అవుతాయి. వెంటనే ట్రీట్మెంట్, ఎమోషనల్ సపోర్ట్ వంటివి లభిస్తాయి. కానీ పురుషులు బయటకు చెప్పుకోగలిగినంత ఈజీగా మహిళలు ఈ సమస్యలను చెప్పుకోవడం లేదు. అలాగే ఇప్పటికీ చాలా వరకు అమ్మాయిలు, అబ్బాయిల ద్వారా వేధింపులు ఎదుర్కొంటున్నప్పటికీ ఆ విషయాన్ని తమ స్నేహితులు, కుటుంబ సభ్యులు, వర్క్ ప్లేస్‌లో కొలీగ్స్‌తో పంచుకోలేరు. అత్యంత సన్నిహితులతో కూడా వెంటనే చెప్పే ధైర్యం చేయని వారే చాలామంది ఉంటారు. ఏదైనా పెద్ద సమస్యగా మారుతుందనుకొని భయపడినప్పుడు మాత్రమే చెప్పగలుగుతున్నారు. కారణం.. పురుషాధిక్య భావజాలం. బయటకు చెప్తే చుట్టు పక్కల జనాలు, సమాజం తమను హేళన చేస్తుందని, అవమానాలు, అనుమానాలు వంటివి ఎదుర్కోవాల్సి వస్తుందనే భయం ఆధునిక మహిళలను కూడా ఎటూ తోచనివ్వట్లేదు. హార్మోన్లలో మార్పులు మహిళలు ఎదుర్కొనే సాధారణ రుగ్మతలకు హార్మోన్లలో మార్పులు కూడా కారణం అవుతున్నాయి. పెరినాటల్ డిప్రెషన్, పెరి-మెనోపాసల డిప్రెషన్, ప్రీ మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్ (పీఎంఎస్) వంటివి కూడా అందులో భాగమే. ఇవి స్త్రీలలో శారీరక, మానసిక సమస్యలకు, మార్పులకు కారణం అవుతుంటాయి. యంగ్ ఏజ్ మూడ్ స్వింగ్స్, పీరియడ్స్, ఏజ్ రిలేటెడ్ ఫీలింగ్స్, మ్యారేజ్, ప్రెగ్నెన్సీ, ప్రసవం వంటి అంశాల్లో హార్మోన్లు కీ రోల్ పోషిస్తాయి. అలాగే రుతుక్రమం ఆగిపోయే ముందు, ఆగిపోయిన తర్వాత కూడా మహిళల్లో మెంటల్ డిజార్డర్లు పెరుగుతుంటాయి. ఇవన్నీ మానసిక అల్లకల్లోలానికి దారితీస్తుంటాయి. అనుభవించే మహిళలకు, ఆస్పత్రులకు వెళ్లినప్పుడు వైద్య నిపుణులకు అర్థం అవుతుంటాయే తప్ప.. కుటుంబంలోని పురుషులు, ఇతర వ్యక్తులు ఈపరిస్థితులను అర్థం చేసుకోవడం చాలా అరుదు. అందుకే స్త్రీలు వీటిని బయటకు మాట్లాడలేకపోతుంటారు. సంబంధాలు - సవాళ్లు సమాజంలో, సంబంధాల్లో ఎదురయ్యే సమస్యలు, సవాళ్లు కొన్నిసార్లు మానసిక సంఘర్షణలకు దారితీసే అవకాశం ఉంటుంది. ఇవి పురుషులతో పోలిస్తే మహిళల్లోనే అధికంగా ఉంటున్నాయి. పని ఒత్తిడి, కుటుంబ బాధ్యతలు, పిల్లల్ని కనడం, పెంచడం, ఫ్యామిలీని చూసుకోవడం వంటివి మహిళల్లో మానసిక, శారీరక సమస్యలకు దారితీస్తున్నాయి. పైగా ఇటువంటి ఇబ్బందికర పరిస్థితుల్లో కుటుంబ సభ్యుల మద్దతు లభించకపోవడం, చివరికి సాటి మహిళలు, ఫ్రెండ్స్ ద్వారా కూడా ఎమోషనల్ సపోర్ట్‌లేక పోవడం వంటి కారణాలతో లోన్లీనెస్‌ను ఎదుర్కొంటున్న మహిళలు చాలామందే ఉంటున్నారు. అయినా బయటకు చెప్పుకోలేకపోతుంటారు. వేధింపులు, ఆర్థిక పరిస్థితులు మహిళలను మానసికంగా కృంగదీసే ప్రధాన వాటిలో ఇంటా బయటా సమస్యలు, లైంగి వేధింపులు కూడా ఉంటున్నాయి. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సూటిపోటి మాటలను చాలామంది ఎదుర్కొంటున్నప్పటికీ బయటకు చెప్పుకోలేకపోతారు. చెప్పుకున్నా తగిన సపోర్ట్ లభించకపోగా మహిళలనే బాధితులుగా చేసే పరిస్థితుల కారణంగా ఇలా జరుగుతుందని నిపుణులు అంటున్నారు. ఇవేకాకుండా కొన్నిసార్లు మానసిక ఆందోళనలు స్త్రీలలో పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ వంటి రుగ్మతలకు దారితీస్తున్నాయి. డిప్రెషన్‌లో కూరుకుపోయి ఏదైనా తప్పుగా మాట్లాడినా, తప్పుగా ప్రవర్తించిన కూడా అమ్మాయిలను అర్థం చేసుకునే పరిస్థితి చాలా అరుదు. పైగా వారిపై చెడ్డవారు అనే ముద్ర వేయడం పరిపాటిగా మారిపోయింది. పరిష్కారం ఏమిటి? మహిళలు మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ, వాటిని ఎదుర్కోవడానికి అవసరమైన సహాయ సహకారాలు పూర్తి స్థాయిలో అందడం లేదని నిపుణులు, స్త్రీ వాదులు అంటున్నారు. మహిళల మానసిక ఇబ్బందులను అసలు ఆరోగ్య సమస్యగా పరిగణించకపోవడం, సమాజంలో నాటుకుపోయిన మూఢ నమ్మకాలు, పురుషాధిక్య భావజాలం వంటివి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో స్త్రీలలో మానసిక సమస్యలకు దారితీస్తున్నాయి. కాబట్టి వీటిని అర్థం చేసుకోవడంలో, ఎదుర్కోవడంలో స్త్రీలకు సహకారం సమాజం నుంచి, కుటుంబ సభ్యుల నుంచి సాటి మహిళల నుంచి సపోర్ట్ అందాల్సిన అవసరం ఉందంటున్నారు నిపుణులు. సపోర్టివ్ సిస్టం బిల్డ్ చేయడం, ట్రీట్మెంట్ పొందడంలో సహకరించడం, సమస్య నుంచి బయటపడే వరకు మద్దతుగా నిలువడం వంటివి పరిష్కార అంశాలుగా నిపుణులు పేర్కొంటున్నారు.




## గిల్ టీ20 ప్రపంచకప్‌లో మ్యాచ్‌లు గెలిపిస్తాడు: అభిషేక్ శర్మ





గాయం తర్వాత గిల్, కెప్టెన్ బాధ్యతలు తీసుకున్న తర్వాత సూర్యకుమార్ యాదవ్ ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. దీంతో వారిపై సోషల్ మీడియాలో దారుణంగా ట్రోల్స్ కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి జరిగిన మూడో టీ20లో సైతం గిల్, సూర్యాలు మంచి ఫామ్ కనబరచలేదు. ప్రస్తుతం ఫామ్‌లో లేక విమర్శలు ఎదుర్కొంటున్న భారత వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ త్వరలోనే తిరిగి ట్రాక్‌లోకి వస్తాడని, వచ్చే ఏడాది జరగబోయే టీ20 ప్రపంచకప్ లో భారత్‌కు మ్యాచ్‌లు గెలిపిస్తాడని గిల్ బాల్య స్నేహితుడు, సహచర క్రికెటర్ అభిషేక్ శర్మ ధీమా వ్యక్తం చేశారు. 12 ఏళ్ల వయస్సు నుంచీ గిల్‌తో కలిసి ఆడుతున్నందున, అతడి సామర్థ్యంపై తనకు పూర్తి అవగాహన ఉందని అభిషేక్ పేర్కొన్నారు. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో గిల్ ప్రదర్శనపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి, ముఖ్యంగా స్థిరంగా ఆడుతున్న సంజు శాంసన్‌ను పక్కన పెట్టిన తర్వాత ఈ విమర్శలు ఎక్కువయ్యాయి. వైస్-కెప్టెన్ హోదాలో గిల్ 15 ఇన్నింగ్స్‌లలో 137.3 స్ట్రైక్-రేట్‌తో కేవలం 291 పరుగులు మాత్రమే చేశాడు. ఈ మ్యాచ్‌లలో అతను కేవలం నాలుగు సిక్సర్లు మాత్రమే కొట్టాడు. ఆదివారం దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో టీ20లో, 118 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో, గిల్ ఒక బంతికి ఒక పరుగు చొప్పున కష్టపడి 28 పరుగులు చేశాడు. అయితే, ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ (18 బంతుల్లో 35 పరుగులు) మెరుపు ఆరంభాన్ని ఇవ్వడంతో ఆ లక్ష్యం సులభంగా ఛేదించబడింది. "ప్రతి ఒక్కరూ శుభ్‌మన్‌పై నమ్మకం ఉంచాలి, అతడు టీ20 ప్రపంచకప్‌లో ఖచ్చితంగా మాకు మ్యాచ్‌లు గెలిపిస్తాడు" అని అభిషేక్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## చలికాలంలో కలలు ఎక్కువగా వస్తున్నాయా.. కారణాలు ఇవే..?



చలికాలం మొదలైనప్పటి నుంచి చాలామందికి కలలు ఎక్కువగా వస్తుంటాయి.. స్పష్టంగా గుర్తుంటాయి కూడా అయితే ఇది ఏదైనా అనారోగ్య లక్షణమా? లేక సహజమైన మార్పేనా? అనే అనుమానాలకు వైద్య నిపుణులు స్పష్టత ఇస్తున్నారు. చలికాలంలో నిద్ర లోతుగా పడటం వల్ల నిద్ర దశ ఎక్కువసేపు కొనసాగుతుంది. ఈ దశలోనే ఎక్కువగా కలలు వస్తాయి. వేసవితో పోలిస్తే చలిలో శరీర ఉష్ణోగ్రత తగ్గడం, మెలటోనిన్ అనే నిద్ర హార్మోన్ ఎక్కువగా విడుదల కావడం వల్ల మెదడు మరింత యాక్టివ్‌గా పనిచేస్తుందని తెలిపారు. అలాగే చలిలో బరువైన దుప్పట్లు వాడటం, నిద్ర మధ్యలో ఒక్కసారైనా మేల్కొనడం వల్ల వచ్చిన కలలు స్పష్టంగా గుర్తుండిపోతాయని వైద్యులు చెబుతున్నారు. మానసికంగా ఆలోచనలు, ఒత్తిడి ఎక్కువగా ఉన్నవారిలో భయంకరమైన కలలు కూడా ఎక్కువగా రావచ్చని హెచ్చరిస్తున్నారు. వైద్య నిపుణుల మాటల్లో, చలికాలంలో కలలు ఎక్కువగా రావడం సాధారణమైన శారీరక ప్రక్రియ మాత్రమే తప్ప, దీనిని వ్యాధిగా భావించాల్సిన అవసరం లేదన్నారు. అయితే కలల వల్ల నిద్రకు అంతరాయం కలుగుతూ, రోజువారీ జీవనంపై ప్రభావం చూపితే మాత్రం వైద్యులను సంప్రదించడం మంచిదని సూచించారు. నిద్ర బాగా రావాలంటే నిద్రకు ముందు మొబైల్ వినియోగం తగ్గించడం, గోరువెచ్చని ఆహారం తీసుకోవడం, చలి గాలి నేరుగా తగలకుండా జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని వైద్యులు సూచిస్తున్నారు.

## లేజర్లు లేకుండానే దృష్టిలోపాన్ని సరిచేసే కొత్త టెక్నిక్: తో భవిష్యత్ విజన్ థెరపీ!



అధునాతన కంటి శస్త్ర చికిత్సల్లో భాగంగా లేజర్లను ఉపయోగిస్తారు. దీనివల్ల ట్రీట్మెంట్ సులభం అవుతుంది. అయితే యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా ఇర్విన్ కు చెందినబ్రయన్ వాంగ్, ఆక్సిడెంటల్ కాలేజ్‌కు చెందిన మైకెల్ హిల్ అనే ఇద్దరు శాస్త్రవేత్తలు మరో కొత్త పద్ధతిని డెవలప్ చేశారు. లేజర్లు లేకుండా కూడా దృష్టిని సరిచేయడానికి, కంటి చూపును మెరుగు పర్చడానికి ఎలక్ట్రో మెకానికల్ రీషేపింగ్ అనే టెక్నిక్‌ను ప్రవేశపెట్టారు. అదేమిటి? ఎలా పనిచేస్తుందో ఇప్పుడు తెలుసుకుందాం. పరిశోధకులు డెవలప్ చేసిన కొత్త మెథడ్‌లో కంటి మొదటి పొర అయిన కార్నియాను కట్ చేయకుండానే, సాఫ్ట్ విద్యుత్ ప్రవాహాలతో దాని ఆకారాన్ని మారుస్తారు. అందుకోసం ప్లాటినమ్‌తో తయారు చేసిన ప్రత్యేక 'కాంటాక్ట్ లెన్స్' ఎలక్ట్రోడ్‌ను కార్నియా పై ఉంచి, సుమారు ఒక నిమిషం వ్యవధి గల తక్కువ స్థాయిలో ఎలక్ట్రిక్ పొటెన్షియల్ వాడుతారు. ఇది కార్నియాలోని కొల్లాజెన్ ఫైబర్ల(మధ్య ఆకర్షణలను బలహీనపరచడానికి టిష్యూ ని తగ్గించి సాఫ్ట్‌గా మారుస్తుంది. ఈ సమయంలో కార్నియా లెన్స్ ఆకారానికి అనుగుణంగా మారుతుంది. పవర్ ఔటేజ్ తర్వాత సాధారణ స్థితికి తిరిగి వచ్చి, కొత్త ఆకారాన్ని లాక్ చేస్తుంది. ఈ ప్రాసెస్ ప్రభావవంతమైనదే కాకుండా, సురక్షితమైనదని కూడా పరిశోధకులు అంటున్నారు.పరిశోధనలో భాగంగా కొత్త చికిత్స పద్ధతిని శాస్త్రవేత్తలు 12 కుందేళ్ల పై పరీక్షించారు. వీటిలో 10 కుందేళ్లలోతక్కువ కంటి చూపు, దూర దృష్టి లోపం సమస్య అయిన మాయోపియా సృష్టించి చికిత్స చేశారు. అన్ని సందర్భాల్లోనూ కార్నియాను సరైన ఆకారంలోకి మార్చడం ద్వారా కంటి చూపును మెరుగు పర్చగలిగారు. పైగా ఏమాత్రం నష్టం లేకుండా కంటి భాగంలోని కణాలు జీవించి ఉన్నాయి. అంటే ఎటువంటి కటింగ్ లేదా లేజర్ కాంతి ప్రయోగం లేకుండానే ట్రీట్మెంట్ సక్సెస్ అయింది. ఇందుకు సంబంధించిన పద్ధతిని, ఫలితాలను శాస్త్రవేత్తలు అమెరికన్ కెమికల్ సొసైటీ ఫాల్ 2025 సమావేశాల్లోనూ ప్రస్తావించారు. ఈ చికిత్సా పద్ధతి మాయోపియా, హైపరోపియా అస్టిగ్మటిజం వంటి దృష్టి సమస్యలకు భవిష్యత్ పరిష్కారంగా మారవచ్చునని నిపుణులు అంటున్నారు.

# సచిన్... సచిన్... మెస్సీ... మెస్సీ

## ముంబైని మురిపించిన దిగ్గజాల భేటీ

## వాంఖెడేలో అర్జెంటీనా స్టార్ సందడి




అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లయోనల్ మెస్సీ తన 'గోట్ టూర్'లో భాగంగా రెండో రోజు ముంబైని మురిపించాడు. భారత మాస్టర్ సచిన్ టెండూల్కర్‌తో కలిసి వాంఖెడేలో సందడి చేశాడు. మామూలుగా అయితే ఈ మైదానంలో టెండూల్కర్ ఉంటే 'సచిన్... సచిన్...' అనే గోలే వినిపించేది. కానీ ఆదివారం స్వరం మారింది. యువ తరం, నవతరం అంతా కలిసి తమ ఆరాధ్య క్రికెటర్‌తో పాటు అభిమాన ఫుట్‌బాలర్ పేరునూ మార్మోగించారు. దీంతో వాంఖెడే స్టేడియం 'సచిన్... సచిన్... మెస్సీ... మెస్సీ...' నామస్మరణతో మార్మోగిపోయింది. సచిన్, మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్, భారత ఫుట్‌బాల్ దిగ్గజం సునీల్ ఛెత్రితో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, బాలీవుడ్ స్టార్స్ అజయ్ దేవ్‌గణ్, టైగర్ ష్రాఫ్, అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య అధ్యక్షుడు ప్రఫుల్ పటేల్, పలువురు సెలబ్రిటీలతో స్టేడియమంతా తారతోరణం దిద్దుకుంది. వాంఖెడే పుటల్లో ఈ పూట క్రీడా ప్రపంచంలోనే అలుపెరగని దిగ్గజాలు ప్రత్యక్షంగా మైదానాన్ని, పరోక్షంగా యావత్ భారత్‌ను అలరించారు. ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లోని క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ తన పురిటి గడ్డపై జగద్విఖ్యాత ఫుట్‌బాలర్ లయోనల్ మెస్సీతో కలిసి సందడి చేశాడు. వాంఖెడే స్టేడియంలో దిగ్గజాల భేటీతో సరికొత్త అధ్యాయం ప్రారంభించినట్లయ్యింది. పోటెత్తిన అభిమానులతో కిక్కిరిసిపోయిన స్టేడియంలో వీరిద్దరే కేంద్ర బిందువులయ్యారు. భారత ఫుట్‌బాల్ మాజీ కెప్టెన్ సునీల్ ఛెత్రి, రాష్ట్ర సీఎం ఫడ్నవీస్ సహా పుర ప్రముఖులు ఎందరున్నా... వేల కళ్లు సచిన్ మెస్సీల నుంచి చూపును తిప్పుకోలేకపోయాయి. ముఖ్యంగా భారత క్రికెట్ అభిమానులు తమ ఆరాధ్య దిగ్గజం సచిన్‌ను విఖ్యాత ఫుట్‌బాలర్‌తో కన్నుల పండుగగా చూసుకున్నారు. ఈ సందర్భంగా మహా సీఎం ఫడ్నవీస్ రాష్ట్రంలో యువ ఫుట్‌బాలర్ల ప్రతిభను సానబెట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'ప్రాజెక్ట్ మహాదేవ' పేరిట ఫుట్‌బాల్ ప్రతిభావంతుల్ని తయారు చేయడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని ముఖ్యమంత్రి ప్రకటించారు. అపురూపం... పరస్పర బహుమానం అర్జెంటీనా స్టార్‌కు టెండూల్కర్ తను స్వయంగా ఆటోగ్రాఫ్ చేసిన వన్డే జెర్సీని మెస్సీకి అందివ్వగా... ప్రతిగా మెస్సీ కూడా తన సంతకంతో కూడిన ఫుట్‌బాల్‌ను సచిన్‌కు ఇచ్చాడు. అన్నట్లు ఆటలు వేరైనా... దేశాలు వేరైనా... సచిన్ జెర్సీ నంబర్, మెస్సీ జెర్సీ నంబర్ ఒక్కటే 10! అదేనండీ 'దస్‌కా దమ్"! దిగ్గజాలు పరస్పర బహుమతులు ఇస్తూ స్వీకరిస్తుంటే అభిమానులంతా ఉప్పొంగిపోయారు. ఈ అపు'రూపం'ను తమ ఫోన్ కెమెరాల్లో పదిలంగా బంధీచేసుకున్నారంతా! నేడు ప్రధాని మోదీతో మెస్సీ భేటీ... 'గోట్ టూర్'లో భాగంగా అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లయోనల్ మెస్సీ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఈరోజు మర్యాదపూర్వకంగా కలువనున్నాడు. మూడు రోజుల 'గోట్ టూర్' నేడు ఢిల్లీలో ముగియనుంది. ముంబై నుంచి సోమవారం ఉదయం 10 గంటల తర్వాత మెస్సీ ఢిల్లీ చేరుకుంటాడు. నగరంలోని క్రీడాభిమానులతో 'మీట్ అండ్ గ్రీట్' ముగించుకొన్న తర్వాత మెస్సీ... ప్రధాని మోదీతో భేటీ అవుతాడు. ప్రధాని నివాసంలో దాదాపు 20 నిమిషాల పాటు వీరిద్దరి మధ్య జరిగే మాటామంతీలో సాకర్ సూపర్ స్టార్ ఫుట్‌బాల్ ముచ్చట్లు పంచుకోకున్నాడు. ఆ తర్వాత భారత సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చీఫ్ రాహుల్ నవీన్, అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు, ఎంపీ ప్రఫుల్ పటేల్‌తో కూడా మెస్సీ భేటీ అవుతారని నిర్వాహకులు వెల్లడించారు. ఇలా పలువురు వీవీఐపీలను కలిసిన తర్వాత మెస్సీ మధ్యాహ్నం 3.30 గంటలకు అరుణ్ జైట్లీ స్టేడియానికి చేరుకుంటాడు. అక్కడ తన అభిమానుల్ని అలరించిన అనంతరం స్వదేశానికి పయనమవుతాడని నిర్వాహకులు వెల్లడించారు. నాకు ఇక్కడ (వాంఖెడే) మరుపేలేని మధుర జ్ఞాపకాలెన్నో ఉన్నాయి. అందుకే మన ముంబై ఒక కలల నగరి. ఈ వేదికపై ఎంతో మంది స్వప్నాలు సాకారమయ్యాయి. 2011 నాకు బాగా గుర్తు. నా కల (వన్డే వరల్డ్‌కప్) కూడా ఇక్కడే నిజమైంది. ముఖ్యంగా మీ (అభిమానులు) మద్దతే లేకపోతే ఆ స్వర్ణానుభూతిని నేనైతే ఎప్పటికీ చూడలేను. ఇప్పుడు కూడా మెస్సీని ఇక్కడ చూస్తుంటే అలాంటి అనుభూతే కలుగుతోంది. మన యువ ఫుట్‌బాలర్లను ప్రోత్సహించిన మెస్సీకి మీ అందరి తరపున, భారతీయుల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నాను.

## మెస్సీ కోల్‌కతా పర్యటన.. మరో ఇద్దరి అరెస్ట్




'గోట్ టూర్ ఆఫ్ ఇండియా'లో భాగంగా అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి భారత్ లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. అయితే కోల్‌కతాలో పాల్గొన్న ఈవెంట్‌లో చోటు చేసుకున్న ఉద్రిక్త ఘటనకు సంబంధించి పోలీసులు మరో ఇద్దరిని అరెస్టు చేశారు. స్టేడియంలో కుర్చీలు ధ్వంసం చేసి గందరగోళం సృష్టించినందుకు శుభోప్రతిమ్, గౌరబ్ బసు అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై పూర్తి నివేదికను మరో 15 రోజుల్లో ప్రభుత్వానికి అందజేస్తామని దర్యాప్తు అధికారులు వెల్లడించారు.ఇదిలా ఉండగా, ఇప్పటికే అరెస్టైన ఈవెంట్ నిర్వాహకుడు శతద్రు దత్తాను స్థానిక కోర్టు 14 రోజుల పోలీస్ కస్టడీకి అనుమతించింది. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న మెస్సి సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఫిరోజ్ షా కోట్లా మైదానంలో జరిగే కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు.

# పిల్లల్లో ఆత్మవిశ్వాసరం పెరగాలంటే.. పేరేంట్స్ చేల్సింది ఇదే..!



చిన్న పిల్లల మనసు తెల్లకాగితం లాంటిది అంటారు నిపుణులు. ఆ కాగితంలో ఏ గీతలు గీస్తే ఆ గీతలే వారిని పెద్దయ్యాక ప్రభావితం చేస్తాయని చెబుతుంటారు. అందుకే మీ చిన్నారులు తర్వాతి జీవితంలో ఆనందంగా, ఆత్మ విశ్వాసంతో ఉండాలంటే వారిని అలా మార్చడం మీ చేతుల్లోనే ఉందనే విషయం పేరెంట్స్ గుర్తించాలి అందుకోసం వారిని చిన్నప్పటి నుంచే అలాంటి ప్రాక్టీస్ చేయించాలి. మోటివేషన్ : పిల్లలు శారీరకంగా, మానసికంగా స్ట్రాంగ్‌గా ఉన్నప్పుడే ఏదైనా సాధించగలమనే నమ్మకం వారిలో ఏర్పడుతుంది. కానీ ఇటీవల చాలా మంది పిల్లలు ఒత్తిడితో కూడిన చదువులు, వయసుకు మించిన ఆలోచనలు వంటి కారణాలతో మానసిక ఇబ్బందుల్ని ఫేస్ చేస్తున్నారు. అయితే వాటిని అధిగమించడానికి, పిల్లలు మెంటల్లీ బలంగా మారడానికి తల్లిదండ్రులు తగిన మోటివేషన్ అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాంటి వాటిలో కమ్యూనికేషన్, సమాజంపై అవగాహన వంటివి చాలా ముఖ్యం అంటున్నారు నిపుణులు.కమ్యూనికేషన్: పిల్లలతో తల్లితండ్రులు తరచూ మాట్లాడుతూ ఉండాలి. వారి సమస్యల్ని అడిగి తెలుసుకుంటూ ఉండాలి. దీంతో వారిలో భయం, ఒత్తిడి వంటివి తగ్గిపోతాయి. అన్ని పరిస్థితుల్లోనూ తమ పేరెంట్స్ ఉన్నారని నమ్మడంతో ధైర్యం ఏర్పడుతుంది. అది పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంచుతుంది. ఆ తర్వాత పేరెంట్స్ అవసరం లేకుండానే సమస్యలను ఎదుర్కొనే స్థాయికి ఎదుగుతారు. ఊబకాయంతో క్యాన్సర్ రిస్క్..2035 నాటికి మరింత పెరిగే చాన్స్! సమాజంపై అవగాహన: మీ పిల్లలకు సామాజిక నైపుణ్యాలు నేర్పించాలి. ఇతరులతో ఎలా మసలుకోవాలి? ఎలా మాట్లాడాలి? ఎలాంటి వారితో స్నేహం చేయాలి? ఏది మంచి, ఏది చెడు అనే విషయాలు చెప్పాలి. ఎదుటివారి మనోభావాలకు రెస్పెక్ట్ ఇవ్వడం, మంచిని స్వీకరించడం, చెడును వ్యతిరేకించడం వంటివి నేర్పించాలి. సరైన నిద్ర, డైట్: పెద్దల కైనా, పిల్లలకైనా సరైన సమయానికి మంచి నిద్ర అవసరం. నిద్ర సరిగ్గా పోకపోతే ఒత్తిడి పెరిగిపోయి.. మానసికంగా బాధపడుతుంటారు. కాబట్టి నాణ్యమైన ఆహారం, మంచి నిద్ర ఉండే వాతావరణాన్ని కల్పించాలి. ఇది పిల్లల ఆరోగ్యానికి మేలు చేస్తుంది.ప్రేమ, అనుబంధం: పిల్లల పట్ల ప్రేమ చూపించాలి. వారు అడిగిన వస్తువుల్ని.. అవసరమైనవి అప్పుడప్పుడూ కొనివ్వడం కూడా చేయాలి. అలాగనీ అడిగిందల్లా కొనివ్వడం కూడా మంచిది కాదు.. ఏది అవసరమో, ఏది అనవసరమో పిల్లలకు చెప్పాలి. అలాగే వారిపై సానుభూతి చూపిస్తూనే అవసరమైన సందర్భంలో హెచ్చరించాలి. ఎప్పుడైనా సరే పిల్లలపై అరవడం, కొట్టడం వంటివి చేయకూడదు. తప్పు చేస్తే ఆ తప్పును వివరించి వారికి అర్థమయ్యేలా చెప్పాలి.ఫిజికల్ యాక్టివిటీస్ : పిల్లలు మానసికంగా దృఢంగా తయారు కావాలంటే.. ఫిజికల్ యాక్టివిటీస్ తప్పక ఉండాలి. చిన్న చిన్న పనులు చేయడం, గ్రౌండ్‌లో ఆటలు ఆడటం, అట్లనే యోగా, మెడిటేషన్ వంటివి కూడా పిల్లల్లోని ఆందోళన, ఒత్తిడి వంటి సమస్యల్ని దూరం చేస్తాయి. దీనికి తోడు సరైన పోషకాహారం చాలా ముఖ్యం.స్ఫూర్తిదాయకమైన కథలు: తల్లిదండ్రులు పిల్లల్లో ఆత్మ విశ్వాసం, ధైర్యం, స్ఫూర్తిని నింపే మాటలు మాట్లాడుతూ ఉండాలి. పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలి. మీరు మంచి కోసం ఏదైనా చేయగలరనే నమ్మకాన్ని వారిలో కలిగించాలి. వారిలో స్ఫూర్తిని కలిగించే కథలు చెప్పాలి. ఇవి పిల్లల్లో ఆలోచనా శక్తిని, అవగాహనను పెంపొందిస్తాయి.అభిప్రాయాలకు గౌరవం ఇవ్వడం: పిల్లల్ని ఎంతసేపూ.



# బాక్సాఫీస్.. ఈ రెండు సినిమాల లెక్క ఏ లెవెల్లో ఉందంటే..

ఇప్పుడు వీకెండ్ లో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచాయి.

బాక్సాఫీస్ వద్ద రెండు చిత్రాలు కూడా భారీ వసూళ్లను అందుకుని దూసుకుపోతున్నాయి.

థియేటర్స్ కు వెళ్తాం.. కంటెంట్ ఉంటే కచ్చితంగా వెళ్తాం.. అని ఇప్పటికే పలుమార్లు నిరూపించిన సినీ ప్రియులు.. మరోసారి ప్రూవ్ చేశారు. కంటెంట్ బాగుంటే జై కొడతామని ఇంకోసారి చేసి చూపించారు. ఇప్పుడు సైయారా.. మహవతార్ నరసింహా చిత్రాలు అదే కోవలోకి వస్తాయి. రెండు సినిమాలూ మంచి రెస్పాన్స్ అందుకుంటున్నాయి. ఇప్పుడు వీకెండ్ లో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచాయి. బాక్సాఫీస్ వద్ద రెండు చిత్రాలు కూడా భారీ వసూళ్లను అందుకుని దూసుకుపోతున్నాయి. బాలీవుడ్ ఫిల్మ్ సైయారా గత వారం రిలీజ్ అయినా.. ఇప్పటికే అదే జోష్ తో సందడి చేస్తోంది. పాన్ ఇండియా ఫిల్మ్ మహావతార్ నరసింహ 4రోజుల క్రితమే వచ్చి అందరినీ మెప్పిస్తోంది.

**పిక్‌టాక్ :** ఈ అందం వయసు లెక్కించడం అసాధ్యం కొత్త హీరో, హీరోయిన్లు అహాన్ పాండే, అనీత్ పద్దా జంటగా నటించిన సైయారా.. బాక్సాఫీస్ వద్ద రూ.200 కోట్లు వసూలు చేసి రూ.300 కోట్ల క్లబ్ వైపు పరుగులు పెడుతోంది. 2025లో చావా తర్వాత బాక్సాఫీస్ వద్ద అతిపెద్ద హిట్ గా నిలిచింది. క్యాస్టింగ్ యాక్టింగ్, మ్యూజిక్, స్టోరీ టెల్లింగ్, టేకింగ్.. ఇలా ప్రతిదీ చర్చనీయాంశంగా మారాయి. మొదటి వారం అద్భుతమైన ప్రదర్శన ఇచ్చిన సైయారా ఇప్పుడు అదే స్పీడ్ లో ఉంది. నార్త్ లో ఇంకా ఆడియన్స్ ను రప్పిస్తూనే ఉంది. శని, ఆదివారాల్లో భారీ వసూళ్లను రాబట్టింది. నార్త్ మూవీ లవర్స్ కు సైయారా మొదటి ఎంపికగా మారింది. దేశవ్యాప్తంగా మెట్రో నగరాల్లో కూడా సక్సెస్ ఫుల్ గా ప్రదర్శితమవుతోంది.



మహావతార.. ఒక్కటి కాదు చాలా మరోవైపు, ప్రముఖ హొంబలే ఫిల్మ్స్ నిర్మించిన యానిమేషన్ మహావతార్ నరసింహ చిన్న సినిమాగా విడుదలవ్వగా.. మౌత్ టాక్ మూవీని విజేతగా నిలిపింది. భక్త ప్రహ్లాదుడి కథతో వచ్చిన సినిమా వీఎఫ్ ఎక్స్ వర్క్ కు అంతా ఫిదా అవుతున్నారు. థియేటర్స్ కు ప్రజలు క్యూ కడుతున్నారు. దీంతో స్క్రీన్ల సంఖ్య రెట్టింపు అయింది. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మహావతార్ నరసింహ ప్రేక్షకుల సంఖ్య, బాక్సాఫీస్ సంఖ్యల్లో 400 శాతం పెరుగుదల కనిపించిందని ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. ఇది చాలా పెద్ద విజయంగా చెబుతున్నాయి. నార్త్ లో కూడా మల్టీప్లెక్స్ లు షోస్ కౌంట్ ను పెంచాయి. నిన్న ఒక్క రోజే రూ.11.25 కోట్లు వసూలు చేసినట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. అలా సైయారా, మహావతార్ నరసింహ ఇప్పుడు ఇండియన్ బాక్సాఫీస్ వద్ద అగ్రస్థానంలో ఉన్నాయి.


# అవతార్ 3.. ఓపెనింగ్స్ సంగతేంటి?

ప్రపంచంలోనే దిగ్గజ దర్శకుడు జేమ్స్ కామెరూన్ డైరెక్షన్ లో రూపొందిన అవతార్: ఫైర్ అండ్ యాష్ థియేటర్స్ లో రిలీజ్ అయిన విషయం తెలిసిందే. అవతార్ ఫ్రాంచైజీలో మూడో చిత్రంగా తెరకెక్కిన ఆ సినిమా సందడి నిన్న ప్రీమియర్స్ తో మొదలైంది. భారీ బడ్జెట్ తో రూపొందిన ఆ చిత్రం.. నేడు వరల్డ్ వైడ్ గా విడుదలైంది.



దాదాపు 400 మిలియన్ డాలర్లు అంటే భారతీయ కరెన్సీలో 3600 కోట్ల రూపాయల బడ్జెట్ తో నిర్మితమైన అవతార్ 3 ఓపెనింగ్స్ ఎలా ఉండనున్నాయోనని ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. అయితే తొలి రోజు వసూళ్లు 340 మిలియన్ డాలర్ల నుంచి 380 మిలియన్ డాలర్ల మధ్య ఉండే అవకాశం ఉందని అంచనా వెలువడుతున్నాయి. కొత్త అమ్మాయిలకు బిగ్ బాస్ బ్యూటీ సలహాలు.. ఆదమరిచారో అంతే! అమెరికా డొమెస్టిక్ మార్కెట్ నుంచి దాదాపు 90 మిలియన్ డాలర్లు రాబట్టే ఛాన్స్ ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. అంతర్జాతీయ మార్కెట్ నుంచి 250 మిలియన్ డాలర్లకు పైగా వసూలు అయ్యే అవకాశం ఉందని వెల్లడించాయి. అయితే 340 మిలియన్ డాలర్ల ఓపెనింగ్ సాధించడం దాదాపు ఖాయమని కూడా అంచనా వేస్తున్నాయి. అయితే ట్రేడ్ వర్గాలు చేస్తున్న అంచనాలు.. మార్వెల్, డీసీ వంటి సూపర్‌హీరో సినిమాలతో పోలిస్తే తక్కువనే చెప్పాలి. కానీ అవతార్ ఫ్రాంచైజీకి ఇది మాత్రం మంచి ఆరంభమనుకోవాలి. కానీ ఇప్పుడు అవతార్-3 మూవీకి రివ్యూస్ మిక్స్ డ్ గా వస్తున్నాయి. యాక్షన్ ఘట్టాలు, విజువల్స్ అదిరిపోయాయని సినీ ప్రియులు చెబుతున్నారు. సారా టెండూల్కర్ ఆదాయం స్కైలోకి కానీ సినిమా స్టోరీలో కొత్తదనం మిస్ అయిందని, ఎమోషన్స్ లో డెప్త్ తక్కువైందని అంటున్నారు. అయితే జేమ్స్ కామెరూన్ సినిమాలకు ఉండే ప్రత్యేకత, విజువల్ ఎక్స్పీరియన్స్, అవతార్ ఫ్రాంచైజీకి ఉన్న క్రేజ్ బట్టి.. భారీ కలెక్షన్లు సాధించే అవకాశాలు లేవని చెప్పలేమని కూడా ఇప్పుడు ట్రేడ్ పండితులు అభిప్రాయపడుతున్నారు. అయితే అవతార్-1 మూవీ.. 2.92 బిలియన్ డాలర్లకు వసూలు చేసి అదరగొట్టింది. వినూత్న విజువల్ ఎఫెక్ట్స్, 3%ణ% టెక్నాలజీతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసి, బాక్సాఫీస్ వద్ద అదుతే విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత రెండో భాగం అవతార్: ది వే ఆఫ్ వాటర్ అనుకున్నట్లు ఆకట్టుకోకపోయినా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించింది. ప్రపంచవ్యాప్తంగా 2.32 బిలియన్ డాలర్లకు పైగా వసూలు చేసింది. దీంతో ఇప్పుడు మూడో భాగం ఎంత కలెక్షన్స్ సాధిస్తుందో అంతా వేచి చూడాలి.

## నివిన్ పాలి ఫార్మా వెబ్ సీరీస్ ఎలా ఉంది..?




ఫార్మా సీరీస్ 8 ఎపిసోడ్స్ తో మొత్తం 5 గంటల 45 నిమిషాల కంటెంట్ తో వచ్చింది. నివిన్ పాలి సీరీస్ స్టోరీ సెలక్షన్ బాగున్నా స్టోరీ ఉన్నంత బలంగా స్క్రీన్ ప్లే తీసుకెళ్లడంలో మేకర్స్ విఫలమయ్యారు. ప్రేమమ్ హీరో నివిన్ పాలి డిఫరెంట్ సినిమాలు చేస్తూ ప్రేక్షకులను మెప్పిస్తున్నాడు. అతని కెరీర్ లో మొదటిసారి వెబ్ సీరీస్ చేశాడు అదే ఫార్మా. పి.ఏ అరుణ్ డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ వెబ్ సీరీస్ జియో హాట్ స్టార్ లో రిలీజైంది. ఫార్మా టైటిల్ తోనే ఇదొక ఫార్మాస్యూటికల్స్ నేపథ్యంతో జరిగే కథ అని తెలుస్తుంది. నివిన్ పాలి ఈ సినిమాలో ఒక ఫార్మా డిస్ట్రిబ్యూటర్ గా నటించాడు. ఇంతకీ ఫార్మా వెబ్ సీరీస్ కథ ఏంటంటే.. వినోద్ (నివిన్ పాలి) ఆర్కేస్ లైఫ్ అనే ఫార్మా కంపెనీలో జాబ్ లో జాయిన్ అవుతాడు. ఐతే తక్కువ టైంలోనే అతను తన జాబ్ లో మంచి పొజిషన్ కి వెళ్తాడు. కొంతకాలం తర్వాత ఈ ఫార్మా కంపెనీలు వెనక చేస్తున్న చీకటి పనులను కనిపెడతాడు. ఆ టైం లోనే రాజీవ్ రావు అనే జాతి సంస్థతో కలిసి వారు చేస్తున్న పనులను బయట పెట్టాలని చూస్తాడు. ఆ తర్వాత వినోద్ లైఫ్ ఎలా మారింది అన్నది సీరీస్ కథ. కొత్త అమ్మాయిలకు బిగ్ బాస్ బ్యూటీ సలహాలు.. ఆదమరిచారో అంతే! మళయాల ప్రేక్షకులను తన నటనతో మెప్పించిన నివిన్ పాలి కి ఈమధ్య సరైన సక్సెస్ లు పడలేదు. ఐతే వెబ్ సీరీస్ తో ఒక మంచి ప్రయత్నమే చేశారని చెప్పొచ్చు. కానీ ఇలాంటి కథలు ఆల్రెడీ ఇదివరకే వచ్చాయి. నవీన్ తన పాత్ర వరకు చాలా బాగా చేశాడు. ఇలాంటి కథలు చెప్పేందుకు కథతో పాటు కథనం మెప్పించాలి. ఫార్మా సీరీస్ 8 ఎపిసోడ్స్ తో మొత్తం 5 గంటల 45 నిమిషాల కంటెంట్ తో వచ్చింది. నివిన్ పాలి సీరీస్ స్టోరీ సెలక్షన్ బాగున్నా స్టోరీ ఉన్నంత బలంగా స్క్రీన్ ప్లే తీసుకెళ్లడంలో మేకర్స్ విఫలమయ్యారు. రాజీవ్ రావుగా రజిత్ కపూర్ నటించారు. ఆ పాత్రకు ఎంతో వెయిట్ ఉంటుందని అనుకోగా అది తేలగొట్టేశారు. శృతి రామచంద్రన్ మాత్రం ఇంప్రెస్ చేస్తారు. నరైన్ కూడా ఇచ్చిన పాత్రకు న్యాయం చేశారు. సారా టెండూల్కర్ ఆదాయం స్కైలోకి ఐతే వెబ్ సీరీస్ స్టోరీ బాగుంటే స్క్రీన్ ప్లే విషయంలో హెచ్చుతగ్గులు ఉన్నా ఆడియన్స్ యాక్సెప్ట్ చేస్తారు. ఫార్మా విషయంలో అటు ఇటుగా అదే జరుగుతుంది. మెజారిటీ ఆడియన్స్ ముఖ్యంగా ఇలాంటి సస్పెన్స్ క్రైం థ్రిల్లర్ ని ఇష్టపడే ఆడియన్స్ కి ఇది ఒక మోస్తారుగా నచ్చే ఛాన్స్ ఉంటుంది. ఐతే ఎంటర్టైన్మెంట్ ఇంకా కామెడీ లాంటివి అసలు ఆశించలేం. నివిన్ పాలి నుంచి వచ్చిన ఈ ఫార్మా సైలెంట్ గా ఓటీటీ స్ట్రీమింగ్ వచ్చేసింది. జియో హాట్ స్టార్ లో వెబ్ సీరీస్ లకు మంచి వ్యూయర్షిప్ ఉంటుంది. మరి నివిన్ చేసిన ఈ ఫస్ట్ అటెంప్ట్ ఎలాంటి రెస్పాన్స్ తెచ్చుకుంటుందో చూడాలి. థ్రిల్లర్ సినిమాలకు మలయాళ పరిశ్రమ కేరాఫ్ అడ్రస్ గా మారింది. ఐతే అక్కడ మేకర్స్ మెడికల్ క్రైం థ్రిల్లర్స్ ని అంతగా ప్రయత్నించలేదు. అందుకే నివిన్ పాల్ ఫార్మా వెబ్ సీరీస్ కి మంచి క్రేజ్ ఏర్పడింది. ఐతే ఈ వెబ్ సీరీస్ తో మలయాళ స్టార్స్ కూడా ఈఅంటి అటెంప్ట్ లు చేసే ఛాన్స్ ఉంటుందని చెప్పొచ్చు.

## ఈ వారం ఓటీటీలో సందడే సందడి.. మరి థియేటర్‌లో పరిస్థితి ఏంటి?

ప్రతి వారం మాదిరిగానే ఈ వారం కూడా ఇటు థియేటర్స్, అటు ఓటీటీలలో వైవిధ్యమైన సినిమాలు ప్రేక్షకులని అలరించేందుకు సిద్ధమవుతున్నాయి. థియేటర్స్ విషయానికి వస్తే.. విజయ్ దేవరకొండ నటించిన కింగ్ డమ్ చిత్రంతో పాటు విజయ్ సేతుపతి, నిత్యా మేనన్ ల సార్ మేడమ్ కూడా సందడి చేసేందుకు సిద్ధమయ్యాయి. యాన్ హానెస్ట్ లైఫ్ (స్వీడిష్ సినిమా) జూలై 31, గ్లాస్ హార్ట్ (జపనీస్ వెబ్ సిరీస్) జూలై 31, లియాన్నే (ఇంగ్లిష్ వెబ్ సిరీస్) జూలై 31,మార్క్డ్ (జులు వెబ్ సిరీస్) జూలై 31, తమ్ముడు (తెలుగు సినిమా) ఆగస్టు 01న స్ట్రీమ్ కానుంది. ఇక అమెజాన్ ప్రైమ్ వీడియోలో చూస్తే.. లోన్లీ ఇనఫ్ టూ లవ్ సీజన్ 1 (తెలుగు డబ్బింగ్ సిరీస్) జూలై 28, చెక్ (తెలుగు సినిమా) జూలై 28న స్ట్రీమింగ్ కానుంది. జియో హాట్‌స్టార్ లో అడ్డా ఎక్స్‌ట్రీమ్ బాటిల్ (రియాలిటీ సిరీస్) జూలై 28, క్యుంకీ సార్ బీ కబీ బహు థీ సీజన్ 2 (హిందీ సిరీస్) జూలై 29,బ్లాక్ బ్యాగ్ (ఇంగ్లిష్ సినిమా) జూలై 28, పతీ పత్నీ ఔర్ పంగా (హిందీ వెబ్ సిరీస్) ఆగస్టు 02న స్ట్రీమ్ కానుంది. జీ5 ఓటీటీలోలో బకైటి (హిందీ వెబ్ సిరీస్) ఆగస్టు 01న స్ట్రీమ్ కానుండగా, ఆపిల్ ప్లస్ టీవీలో చీఫ్ ఆఫ్ వార్ (ఇంగ్లిష్ వెబ్ సిరీస్) ఆగస్టు 01, స్టిల్ వాటర్ సీజన్ 4 (ఇంగ్లిష్ వెబ్ సిరీస్) ఆగస్టు 01న స్ట్రీమ్ కానుంది. సన్ నెక్స్ట లో.. సురభిల సుందర స్వప్నం (మలయాళ సినిమా) ఆగస్ట్ 1 నుండి స్ట్రీమ్ కానుంది.



# ఈ అందం వయసు లెక్కించడం అసాధ్యం



సీనియర్ హీరోయిన్ టబు అయిదు పదుల వయసులో పడి మూడు ఏళ్లు అవుతుంది.

అయినా కూడా టబు ఫోటో షూట్స్ లో మూడు పదుల



వయసు హీరోయిన్ మాదిరిగానే ఉంటుంది.



ఒకప్పుడు హీరోయిన్స్ మూడు పదుల వయసు దాటిన తర్వాత పెద్దగా కనిపించే వారు కాదు, నాలుగు పదుల వయసులో ఆంటీ పాత్రలు, అయిదు పదుల వయసులో అమ్మమ్మ పాత్రలు పోషించిన సందర్భాలు చాలానే ఉన్నాయి. కానీ ఈతరం హీరోయిన్స్ అలా కాదు. ప్రస్తుతం ఉన్న సీనియర్ స్టార్స్ హీరోయిన్స్ లో చాలా మంది అయిదు పదుల వయసులో ఉన్నప్పటికీ ఇండస్ట్రీలో బిజీగా హీరోయిన్ వేశాలు వేస్తున్నారు. హీరోయిన్ కాకున్నా కనీసం క్యారెక్టర్ ఆర్టిస్టుగా అయినా మంచి ఆఫర్లు దక్కించుకుంటున్నారు. సోషల్ మీడియాలో చాలా మంది సీనియర్ హీరోయిన్స్ అందం గురించి చర్చ జరుగుతూ ఉంటుంది. అందులో ప్రధానంగా టబు పేరు ఉంటుంది అనడంలో సందేహం లేదు. బాక్సాఫీస్.. ఈ రెండు సినిమాల లెక్క ఏ లెవెల్లో ఉందంటే.. సీనియర్ హీరోయిన్ టబు అయిదు పదుల వయసులో పడి మూడు ఏళ్లు అవుతుంది. అయినా కూడా టబు ఫోటో షూట్స్ లో మూడు పదుల వయసు హీరోయిన్ మాదిరిగానే ఉంటుంది. ఈమె అందం ఏమాత్రం తగ్గడం లేదు అంటూ ప్రతి ఫోటోకు నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉంటారు. టబు గురించి పెద్దగా తెలియని వారు, ఆమె పాత సినిమాలు చూడని వారిని ఆమె ఫోటోలు చూపించి వయసు ఎంత అంటే ఠక్కున చెప్పడం కష్టమే. ఎక్కువ శాతం మంది ముప్పై నుంచి నలభై మధ్య వయసు ఉంటుందేమో అని అంటారు. ఎక్కువ శాతం మంది మూడు పదుల వయసు లోపు ఉండే అవకాశం ఉందని అంటారు. అంతే కానీ ఈమె అయిదు పదుల వయసు అని ఏ ఒక్కరూ ఖచ్చితంగా అనరు అనడంలో సందేహం లేదు. మహావతార.. ఒక్కటి కాదు చాలా తాజాగా మరోసారి టబు సోషల్ మీడియాలో షేర్ చేసిన చీర కట్టు ఫోటోలు వైరల్ అవుతున్నాయి. టబు ఎంత అందంగా ఉంటుందో ఈ ఫోటోలు మరోసారి ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తాయి అనడంలో సందేహం లేదు. అందమైన రూపంకు తగ్గట్లుగా అంతకు మించిన అందమైన చీర కట్టులో టబు మరింత అందంగా ఉందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. టబు ఇంత అందంగా ఉండటం వల్లే ఇప్పటికీ హీరోయిన్స్ ఆఫర్లు వస్తున్నాయి. సీనియర్ హీరోలతో పోల్చితే ఈమె చాలా వయసులో చిన్న అన్నట్లుగా ఉంటుంది. హీరోలు ఐదు.. ఆరు పదుల వయసులోనూ టబుతో హీరోయిన్‌గా నటించేందుకు ఆసక్తి చూపిస్తూ ఉన్నారు. చాలా మంది సీనియర్ హీరోలతో ఈమె నటించింది. రంగస్థలం.. 7 ఏళ్ల వెయిటింగ్ కి ఎండ్ కార్డ్..! తాజా ఫోటోల్లో టబు అందమైన చిరు నవ్వు నెటిజన్స్‌ను అలాగే కట్టిపడేసి ఉంచుతుంది. చీర కట్టులో టబును గతంలో చాలా సార్లు చూశాం. కానీ ఈసారి అంతకు మించి అందం అన్నట్లుగా ఉంది అనడంలో సందేహం లేదు. ఆకట్టుకునే రూపంతో పాటు, మంచి చిరునవ్వు టబు సొంతం. అందుకే గత మూడు దశాబ్దాలుగా ఆమెను ప్రేక్షకులు అభిమానిస్తూ ఉన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అభిమానించే వారు కూడా చాలా మంది ఉన్నారు. ఈ అందమైన టబు మరిన్ని మంచి సినిమాలు చేయాలని, ఆకట్టుకునే విధంగా పాత్రలను ఎంపిక చేసుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు. టబు గతంలో ఎన్నో సార్లు ప్రేమలో పడిందనే వార్తలు వచ్చాయి. కానీ ఇప్పటి వరకు టబు వైవాహిక జీవితంలో అడుగు పెట్టలేదనే విషయం తెల్సిందే.

## శర్వానంద్ నారి నారి నడుమ మురారి రిలీజయ్యేది ఎప్పుడో..



కథను నమ్మి సినిమాలు చేసే అతికొద్ది మంది టాలీవుడ్ యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు శర్వానంద్. గతేడాది చివరగా మనమే సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు శర్వానంద్. ఈ టాలెంటెడ్ యాక్టర్ నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి నారి నారి నడుమ మురారి. ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ చిత్రం పలు కారణాల వల్ల వాయిదా పడుతూ వస్తోంది. ఈ మూవీ విడుదల తేదీని ఇప్పటికీ ఫైనల్ చేయకపోవడానికి కారణమేంటని తెగ చర్చించుకుంటున్నారు సినీ జనాలు. తాజాగా దీనికి సంబంధించిన అప్‌డేట్ ఒకటి ఫిలింనగర్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. మేకర్స్ ఓటీటీ డీల్ ఫైనలైజ్ చేసే పనిలో ఉన్న కారణంగా విడుదల తేదీ ప్రకటించడంలో ఆలస్యం జరుగుతుందట. ఓటీటీ డీల్ సినిమా బిజినెస్‌లో చాలా కీలక పాత్ర పోషిస్తుందని తెలిసిందే. సామజవరగమన ఫేం రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఫన్ ఎంటర్‌టైనర్‌గా రాబోతుంది. ఈ చిత్రంలో భీమ్లానాయక్ ఫేం సంయుక్తా మీనన్, ఏజెంట్ ఫేం సాక్షి వైద్య ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. ఇప్పటికే ఇరువురు భామల కౌగిలిలో స్వామి , ఇరుకున పడి నీవు నలిగితివా అంటూ షేర్ చేసిన పోస్టర్ ఒకటి నెట్టింట హైప్ క్రియేట్ చేస్తుంది. ఈ చిత్రానికి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర తెరకెక్కిస్తున్నారు. శర్వానంద్ మరోవైపు అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో 36లో కూడా నటిస్తున్నాడు. ఈ చిత్రంలో మాళవికా నాయర్ హీరోయిన్‌గా నటిస్తోంది.

## ఆకట్టుకుంటున్న దుల్కర్ సల్మాన్ కాంత టీజర్..
## నట చక్రవర్తిగా అదరగొట్టేశాడంతే..!




మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ ఖాన్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. ఆయన తెలుగు, తమిళం, మలయాళ భాషలలో వైవిధ్యమైన సినిమాలు చేస్తూ ప్రేక్షకులని ఎంతగానో అలరిస్తూ ఉంటారు. 'మహానటి', 'సీతా రామం' వంటి సినిమాలతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు పొందిన దుల్కర్, ఇటీవల 'లక్కీ భాస్కర్' సినిమాతో బాక్సాఫీస్ వద్ద ఘన విజయం అందుకున్నాడు. ఇప్పుడు ఆయన తన నెక్స్ట్ ప్రాజెక్ట్‌తో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతున్నారు. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో 'కాంత' అనే చిత్రం చేస్తుండగా, ఇది ఒక పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా రూపొందుతోంది. ఈ క్యారెక్టర్‌లో ఆయన పెర్ఫార్మెన్స్ పీక్స్‌లో ఉంటుందనడానికి టీజర్ తో హింట్ ఇచ్చారు. 1950లో మద్రాసులో జరిగిన ఒక ఉత్కంఠభరితమైన నాటకీయ థ్రిల్లర్ గా చిత్రాన్ని తెరకెక్కించగా, ఇందులో రానా, సముద్రఖనీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాతో దుల్కర్ మళ్లీ ఓ సీరియస్ యాక్టర్‌గా తన టాలెంట్‌ను నిరూపించబోతున్నాడు. హీరోయిన్‌గా భాగ్యశ్రీ బొర్సె నటిస్తున్నారు. నిర్మాతలుగా రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు.మ్యూజిక్ డైరెక్టర్ జాను చంతార్ సంగీతం అందిస్తున్నారు. వినూత్నమైన కథతో, హర్రర్ నేపథ్యంతో వస్తున్న ఈ చిత్రం భారీ అంచనాల నడుమ సెప్టెంబర్ 12న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. ఒక హర్రర్ సినిమాని డైరెక్ట్ చేస్తూ ఓ ఫిల్మ్‌మేకర్‌గా దుల్కర్ పయనించే కథ 'కాంత'. కంటెంట్ పరంగా డిఫరెంట్ గానే కాదు, ఎమోషన్, మిస్టరీ, టెక్నికల్ వాల్యూస్ పరంగా కూడా ఇది కొత్త అనుభూతిని ఇచ్చే సినిమా అవుతుందని టీజర్ స్పష్టం చేసింది.

Printed, Published and Owned by PENAGONDA SATHISH,Printed at BUILDING NO: 1-17-18, SVN COLONY, SUNDAY PRINTING PRESS,Editor: PENAGONDA SATHISH,: H NO : 8-4-458, RAM NAGAR, GODAVARIKHANI, PEDDAPALLI, TELANGANA - 505209. RNI.No.TGTEL/25/A1964,Cell : 8333818121,Email: akankshanewsdaily@gmail.com